thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 330 కరీంనగర్ గురువారం, 5 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 10 వేల కోట్లతో క్షిపణుల కొనుగోలు

న్యూఢిల్లీ : గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి మనదేశం వేగంగా అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థను మరింత విస్తరించ డానికి సిద్ధమైంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) దీనిని ఓ గేమ్‌చేంజర్‌గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో మరో ఐదు ఎస్-400లను కొనుగోలు చేయనున్నారు. డిసెంబరు 5న జరిగే ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీలో వీటితో పాటు మరిన్ని క్షిపణుల కొనుగోలుకు ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. అలాగే రూ. 63 వేల కోట్లతో సుఖోయ్-30ఎంకేఐ యుద్ధవిమానాల ఆధునీకరణ కార్యక్రమానికి కూడా భారత్ సిద్ధమవుతోందని టైమ్స్ ఆఫ్ ఇండియా తన కథనంలో తెలిపింది.

ఆ కథనం ప్రకారం.. మరిన్ని ఎస్-400 స్క్వాడ్రన్‌లు కొనుగోలుకు ఇప్పటికే రక్షణ శాఖ సిద్ధమైంది. అలాగే పాక్‌తో యుద్ధం సమయంలో తరిగిపోయిన నిల్వలను మళ్లీ పెంచడానికి ఎస్-400 క్షిపణులను కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించింది.




## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు.. బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్..

న్యూఢిల్లీ: మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్.. మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. **కొత్త సీఎం వివరాలివే..** మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు.




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) వివాదంపై మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా కోర్టుకు హాజరైన ఆమె.. తన పిటిషన్‌పై స్వయంగా వాదనలు వినిపించారు. ఈ క్రమంలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'తలుపుల వెనుక న్యాయ దేవత దుఃఖిస్తోంది' అని అన్నారు. సుప్రీంకోర్టులో అయినా తమకు న్యాయం జరగాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు మమత. పశ్చిమ బెంగాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను వ్యతిరేకిస్తూ సీఎం మమతా బెనర్జీ, మోస్తారీ బాను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రియన్, డోలా సేన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్లు అన్నింటినీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా తన పిటిషన్‌పై స్వయంగా వాదనలు వినిపించిన సీఎం మమతా బెనర్జీ.. ఎన్నికల సంఘాన్ని 'వాట్సాప్ కమిషన్'గా అభివర్ణించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అంతా గందరగోళంగా ఉందని ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన ధ్రువపత్రాలు చూపించినా ఎస్ఐఆర్ అధికారులు అంగీకరించడం లేదని మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరుగనున్న అసోంలో కాకుండా.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్‌ను చేపడుతున్నారంటూ ఈసీ తీరుపై మమతా బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఉన్న అసోంలో ఎందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం లేదని ప్రశ్నించారామె. బీఎల్ఓలపై ఒత్తిడి తెచ్చి ఓట్లను తొలగిస్తున్నారని.. ఈ అంశంపై ఈసీకి ఆరుసార్లు లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో బెంగాల్‌లో వంద మంది చనిపోయారన్నారు. సుప్రీంకోర్టులో అయినా న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు సీఎం. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, ప్రజల హక్కులను కాపాడండి' అని సీజేఐకి మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. మమత అభ్యర్థనపై స్పందించిన సుప్రీంకోర్టు.. కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది.

# జనం మెచ్చేలా పాలన అందిస్తున్నాం


## ఏ ఎన్నిక అయినా.... ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కడతారు!




## మిర్యాలగూడ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

నల్గొండ, ఫిబ్రవరి 04: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురు లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా శక్తి ఎదుట ఎవరూ నిలువలేరన్నారు. అన్ని వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నాడు మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. గతంలో ఒక్క కొత్త రేషన్ కార్డయినా ఇచ్చారా? అంటూ గత ప్రభుత్వాన్ని రేవంత్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం లక్షలాది మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. 3.15 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు సీఎం రేవంత్ రెడ్డి. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే వరికి రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. రైతులకు రూ.21వేల కోట్ల మేర రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఆడబిడ్డలంతా కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీలకు డిపాజిట్లు సైతం రావన్నారు. తమ ప్రభుత్వం చేసిన పనులు చూసి ఓటు వేయాలని కోరుతున్నామని విజ్ఞప్తి చేశారు. రెండేళ్లలో పేదలు, గిరిజనుల సంక్షేమం కోసం ఎంతో చేశామని చెప్పుకొచ్చారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ నిప్పులు చెరిగారు. ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు కానీ.. పేదలను పట్టించుకోలేదంటూ బీఆర్ఎస్ నేతల వైఖరిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ ఎండగట్టారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున.. రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బీసీని నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు రేవంత్ రెడ్డి. కానీ తాము ఈ ఎస్ఎల్‌బీసీ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మామ, అల్లుడు, బామ్మర్ది కలిసి నల్గొండ జిల్లాపై విషం చిమ్మారంటూ బీఆర్ఎస్ అగ్రనేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. గంజికి గతిలేనోళ్లు కూడా బెంజి కార్లు కొన్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. భార్యాభర్తల ఫోన్లు ఎవరైనా వింటారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. సినిమా తారల ఫోన్లు సైతం విన్నారని తెలిపారు. జాతిపితకు నోటీసులు ఇస్తారా? అని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కేడర్ తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు జాతిపిత.. మీ జాతి ఏంటి?.. నీతి ఏంటి? అంటూ బీఆర్ఎస్ అగ్రనేతలపై నిప్పులు చెరిగారు. దోపిడీ చేసిన దొంగలు జాతిపిత ఎలా అవుతారు? అంటూ వారిని సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌస్ నిర్మించుకున్న మీలాంటోళ్లని.. జాతిపిత అంటే.. ఆత్మహత్య చేసుకుని చావాలని వ్యంగ్యంగా పేర్కొన్నారు. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసినోళ్లు జాతిపిత అవుతారని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

ఇప్పటికైనా చేసిన తప్పులు ఒప్పుకుని నేలకు ముక్కు రాయండంటూ వారికి స్పష్టం చేశారు. రెండేళ్లే పూర్తయ్యాయి.. మరో 8 ఏళ్లు తామే అధికారంలో ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నిరంతర అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌నే గెలిపించాలని ప్రజలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు.. జనసేన సంచలన నిర్ణయం ?

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల హడావిడి కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇస్తూ సంచలన ప్రకటన చేసింది జనసేన.

నిన్న అర్ధరాత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అలాగే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అటు తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు కీలక సమావేశం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ నివాసంలో మున్సిపల్ ఎన్నికలపై ప్రధానంగా చర్చ జరిగింది. అయితే చర్చల అనంతరం భారతీయ జనతా పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఇందులో భాగంగానే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పార్టీ తరఫున పవన్ కళ్యాణ్ ప్రచారం కూడా చేయనున్నారు. ముందుగా జనసేన అలాగే బిజెపి పార్టీ మధ్య పొత్తు ఉండబోదని రామచంద్రరావు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కేంద్ర బిజెపి ఆదేశాల మేరకు తెలంగాణలో రెండు పార్టీలు కలవాల్సి వచ్చిందట. ఇది ఇలా ఉండగా తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11వ తేదీన జరగనుండగా రిజల్ట్ 13వ తేదీన ప్రకటిస్తారు


# తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్



## భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీబ్

మహబూబ్‌నగర్: ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీబ్ విమర్శించారు. మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప్ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. "నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్‌ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే భాజపాను గెలిపించాలి. తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో రైల్వేకు రూ. 5,400 కోట్లకుపైగా కేటాయించింది. తెలంగాణకు మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు కేటాయించింది. రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోంది.

ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తోంది. కొన్నివర్గాలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత పెడుతోంది. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తోంది. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపట్లేదు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములు ఆక్రమిస్తున్నారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించం" అని నితిన్ నబీబ్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు.




హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీలో గురువారం నుంచి భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఇందుకోసం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. గతంలో స్తంభాలు, లైన్స్ కోసం వినియోగదారుల నుంచి దూరాన్ని బట్టి ఒక్కో రీతిలో ఫీజు వసూలు చేసేవారు. ఇకపై ఫిక్స్‌డ్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. గృహ విద్యుత్ కనెక్షన్‌లకు 1 కిలో వాట్ వరకు రూ.500. ఒకటి నుంచి 5కేవీ వరకు రూ.500ం కిలో వాట్‌కి రూ.600 చొప్పున వసూలు చేయనున్నారు.




హైదరాబాద్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు ఊరట లభించింది. ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను తెలంగాణ స్పీకర్ ప్రసాద్ కుమార్ కొట్టేశారు. సంజయ్‌పై అనర్హత వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పిటిషన్ దాఖలు వేశారు. ఆ పిటిషన్‌ను కొట్టేస్తూ స్పీకర్ నేడు తీర్పునిచ్చారు.

పార్టీ మారారనడానికి సరైన ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఇవాళ్టితో సంజయ్ సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్.. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్ల విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేశారు.

**నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే: సంజయ్...** స్పీకర్ తీర్పుపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించారు. తాను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేనని స్పష్టం చేశారు. "నా జీతం నుంచి నెలకు రూ. 5 వేలు బీఆర్ఎస్ పార్టీకి కట్ అవుతున్నాయి. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చాను" అని సంజయ్ తెలిపారు.

**అది హాస్యాస్పదం: కేపీ వివేకానంద గౌడ్...** కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యానించారు. "కడియం నీతులు చెప్పడం ఆపు. నువ్వు కాంగ్రెస్‌లో చేరావని స్పీకర్ ముందు అంగీకరించు. ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాలయాపన చేసి అనర్హత నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఆధారాలు లేవని ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు" అని వివేకానంద తెలిపారు.




హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈరోజు (బుధవారం) సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

## మా అభ్యర్థనను చేతగానితనంగా భావిస్తున్నారా?.. పోలీసులపై బండి సంజయ్ ఫైర్

వేములవాడ: పద్ధతి మార్చుకోకపోతే వేములవాడలోనే కూర్చుంటా.. మీ డీజీపీ, ఎస్పీని ఇక్కడికి రప్పించాల్సి ఉంటుంది అంటూ.. సిరిసిల్ల పోలీసులను కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. సిరిసిల్ల, వేములవాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై విరుచుకుపడ్డారు. "వేములవాడ ఎమ్మెల్యే భాజపా కార్యకర్తలను బెదిరిస్తుంటే పోలీసులు వంతపాడతారా? మా రిక్వెస్ట్‌ను చేతగానితనంగా భావిస్తున్నారా? ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని లేదా" అని హెచ్చరించారు. సిరిసిల్ల సీఐ క్రిష్ణ.. భాజపా నాయకులు, సిబ్బందిపై దాడి చేసి ఓవరాక్షన్ చేశారని బండి సంజయ్ మండిపడ్డారు. తక్షణమే విధుల్లోంచి తప్పించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

**ఆ రెండు పార్టీలను నిలదీయండి...** వేములవాడ మున్సిపాలిటీని భాజపా కైవసం చేసుకోవడం ఖాయం. నిధులిచ్చేది మోదీ... తెచ్చేది నేను. మరి కాంగ్రెస్,



భారాసకు ఎందుకు ఓట్లేయాలి?కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా?. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ ఇచ్చారా? అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారా?

నిరుద్యోగ భృతి ఇచ్చారా? పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారు. కేంద్రం నిధులిస్తే కమీషన్లు దండుకున్నారు. మళ్లీ దొంగ హామీలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. ఎందుకు ఓటేయాలంటూ ఆ రెండు పార్టీలను నిలదీయండి" అని బండి సంజయ్ పిలుపునిచ్చారు.







## మిత్ర ద్రోహి.. దేశ ద్రోహి.. పార్లమెంట్ వెలుపల రాహుల్ గాంధీ, బీజేపీ ఎంపీ మధ్య వాగ్వాదం..

బుధవారం పార్లమెంట్ వెలుపల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒకప్పటి తన సహచరుడు, ప్రస్తుతం బీజేపీ ఎంపీ అయిన రవ్‌నీత్ సింగ్ బిట్టూను 'మిత్ర ద్రోహి'గా రాహుల్ గాంధీ అభివర్ణించారు. దానికి కౌంటర్‌గా రాహుల్‌ను బిట్టూ 'దేశద్రోహి'గా అభివర్ణించారు. పార్లమెంట్ వెలుపల ద్వారం దగ్గర ఈ ఇద్దరూ ఎదురుపడినపుడు వాతావరణం వేడెక్కింది. కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా కాంగ్రెస్ ఎంపీలు బుధవారం ఉదయం పార్లమెంట్ వెలుపల నిరసన తెలియజేశారు. అదే సమయంలో రవ్‌నీత్ సింగ్ బిట్టూ అక్కడకు వచ్చారు. కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఉన్న రాహుల్ గాంధీ, రవ్‌నీత్‌ను చూసి.. 'ఇదుగో.. ఒక ద్రోహి ఇటువైపు వచ్చారు. అతడి మొహం చూడండి' అని ఎద్దేవా చేశారు. అనంతరం బిట్టూకు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి చేయి ముందుకు చాచి.. 'హలో బ్రదర్.. మిత్ర ద్రోహి. కంగారు పడకు.. నువ్వు మళ్లీ కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తావు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ కరచాలనం చేయడానికి చేయి ముందుకు చాచినప్పటికీ రవ్‌నీత్ సింగ్ బిట్టూ తిరస్కరించారు. రాహుల్ గాంధీని దేశ ద్రోహిగా బిట్టూ అభివర్ణించారు. 'ఏదో యుద్ధంలో గెలిచినట్టుగా వచ్చి ఇక్కడ కూర్చున్నారు' అంటూ బిట్టూ ముందుకు వెళ్లిపోయారు. ఆ క్రమంలో రాహుల్ గాంధీ, రవ్‌నీత్ బిట్టూ మధ్య కొద్ది సెకెన్ల పాటు మాటల యుద్ధం జరిగింది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడిన రవ్‌నీత్ బీజేపీలో చేరారు. అప్పట్నుంచి రాహుల్, రవ్‌నీత్ మధ్య మాటల యుద్ధం జరుగుతూనే ఉంది.




మొయినాబాద్: రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సొంత అన్న చేతిలో మహిళా న్యాయవాది స్వప్న (34) హత్యకు గురయ్యారు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల కోర్టులో స్వప్న న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె కుటుంబంలో ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం పొలం వద్ద పంచాయతీ జరుగుతుండగా.. స్వప్నను సోదరుడు రాజు హతమార్చాడు. హత్య సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు.. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**రాజు మూడేళ్లుగా పథకం పన్నాడు: తల్లి వెంకటమ్మ...** స్వప్నను చంపాలని రాజు మూడేళ్లుగా పథకం పన్నాడని తల్లి వెంకటమ్మ అన్నారు. హతమార్చేందుకు ఇప్పటికే రెండుసార్లు యత్నించాడని చెప్పారు. భూమి సర్వే అనంతరం తిరిగి వెళ్తుండగా స్వప్నపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని తెలిపారు. కర్రలు, కత్తులతో దాడి చేశారని.. రాజుతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని వెంకటమ్మ కోరారు.

**న్యాయవాదుల ఆందోళన...** స్వప్న హత్యపై చేవెళ్ల కోర్టు న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బుధవారం విధులను బహిష్కరించి మొయినాబాద్ పీఎస్ వద్ద ఆందోళనకు దిగారు. పీఎస్ ఎదుట ఉన్న హైదరాబాద్-బీజాపూర్ హైవేపై బైఠాయించి నిరసన తెలిపారు.




హైదరాబాద్, ఫిబ్రవరి 3: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ స్కాములను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నామని, మూసీ నది పేరిట లక్షల కోట్ల దోపిడీని బీఆర్ఎస్ అడ్డుకుందని అన్నారు. లగచర్లలో అల్లుడి కంపెనీ కోసం గిరిజనుల భూములు లాక్కోవాలని చూస్తే బీఆర్ఎస్ అడ్డుకుందని, హిల్ట్ పాలసీలో లక్షల కోట్ల కుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిందని చెప్పారు.

అలాగే, సింగరేణి అవినీతినీ తమ పార్టీ బయటపెట్టిందని కేటీఆర్ వెల్లడించారు. కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రా కంపెనీని సీఎం రేవంత్ రెడ్డి బినామీ కంపెనీగా కేటీఆర్ అభివర్ణించారు. జనవరి 23న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కేఎల్ఎస్ఆర్‌పై సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిందని, దివాళా తీసిన కంపెనీకి కాంట్రాక్టులు ఎలా ఇస్తున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని ఆయన చెప్పారు. కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రాకు రూ.6 వేల కోట్ల టెండర్లు ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి బినామీ చీఫ్ మినిస్టర్ అని, ఆయన్ను వెనుక నుంచి వేరే వాళ్లు నడిపిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేఎల్ఎస్ఆర్‌కు అప్పగించారని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డిపై గతంలో రైడ్స్ జరిగితే అందులో కేఎల్ఎస్ఆర్ కంపెనీ రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ అని ఐటీ శాఖ అనుమానం వ్యక్తం చేసిందన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీలో రేవంత్ రెడ్డి బినామీ పెట్టుబడులు ఉన్నాయని 2018లోనే ఐటీ చెప్పిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సీఎం కాగానే కేఎల్ఎస్ఆర్‌కు రెక్కలు వచ్చాయన్నారు కేటీఆర్. మెదక్‌లో ఆర్ అండ్ బి వర్క్స్, షాద్‌నగర్ పరిగి రోడ్, ఇరిగేషన్ వర్క్స్ ఇచ్చారని కేటీఆర్ అన్నారు. 2023 జులై నుంచి కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాళా తీసిందని ఆయన చెప్పారు. బినామీ బాగోతం బయటకు రాకుండా ఉండటం కోసం దావోస్ నుంచి బాగోతం నడిపారని మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థకు ఇచ్చిన కాంట్రాక్టులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దావోస్‌లో సీఎం మాయమయ్యారనే వార్తలు వచ్చాయన్నారు. బినామీ బాగోతాలు చక్కబెట్టుకోవడం కోసమే ముఖ్యమంత్రి మాయమయ్యారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

కేఎల్ఎస్ఆర్ కంపెనీ నుంచి రేవంత్ రెడ్డి కుటుంబీకులకు చెందిన కంపెనీలకు డబ్బులు బదిలీ అయ్యాయని కేటీఆర్ ఆరోపించారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సంబంధించిన తీర్పు కామెడీ సీరియల్ అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గాంధారి ప్రసాద్ కుమార్‌గా మారారని ఆయన విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు స్వయంగా సీఎం కండువా కప్పారని తెలిపారు. దీనిపై కోర్టులోనే తేల్చుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దన్నారని.. 9వ ఫ్లోర్ నుంచి దూకి ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య

ఫోన్‌లో ఆన్‌లైన్ గేమింగ్‌కు విద్యార్థులు, యువత బానిసలవుతున్నారు. ఓ ఇంట్లో ఈ సమస్య తీవ్రరూపం దాల్చింది. ఆ గేమ్స్ ఆడొద్దన్నందుకు ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గాజియాబాద్‌లోని రెసిడెన్షియల్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు తోబుట్టువులు (12,14,16 ఏళ్ల వయసు) కలిసిమెలిసి ఉండేవారు. అయితే కరోనా సమయంలో వారికి ఫోన్ చూడటం అలవాటైంది. తర్వాత ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం వ్యసనంగా మారిపోయింది. అందుకోసం చదువును కూడా పక్కనపెట్టేశారు. రోజూ స్కూల్‌కు వెళ్లడం కూడా మానేశారు. వారి ప్రవర్తనపై ఆందోళనకు గురైన తల్లిదండ్రులు.. ఫోన్ వినియోగం తగ్గించాలంటూ పిల్లలను మందలించేవారు. మంగళవారం రాత్రి ఇదే విషయమై ఇంట్లో గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాతే ఆ ముగ్గురూ తీవ్రమైన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. టౌన్‌షిప్‌లోని 9వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. అందరూ నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా శబ్దం వినిపించడంతో.. ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం అందింది. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో బాలికల మృతదేహాలను గుర్తించారు. వాటిని పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి పంపించారు. సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.

# భాజాపా తొలి తరం నేత జంగారెడ్డి - ఫిబ్రవరి 5...జంగారెడ్డి వర్ధంతి



బీజేపీ తొలితరం నాయకుడు, రాజకీయ కురువృద్ధుడు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే చందుపట్ల జంగారెడ్డికి దక్షిణ భారత దేశ తొలి బీజేపీ ఎంపీగా, మాజీ ప్రధాని పి వి నరసింహా రావు ను ఓటమి పాలు చేసిన నేతగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి లోక్‌సభలో బీజేపీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక వ్యక్తిగా చందుపట్ల జంగారెడ్డికి పేరుంది. 1984 ఎన్నికల్లో వాజ్‌పేయ్, అద్వానీ వంటి బీజేపీ అగ్రనాయకులందరూ పరాజయం పాలయినా హన్మకొండ నుండి జంగారెడ్డి విజ యం సాధించాడు. 1984 లో భాజపా 543 నియోజకవర్గాలలో కేవలం రెండింటిని గెలుపొందింది... ఒకటి అవిభాజ్య ఆంధ్ర ప్రదేశ్ లోని హనుమకొండ కాగా, ఏకే పటేల్ అనే బీజేపీ అభ్యర్థి గెలుపొందిన గుజరాత్ లోని మెహ్సానా నియోజక వర్గం రెండోది. హనుమ కొండ నుంచే కాదు మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి లోక్ సభలో బీజేపీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక వ్యక్తి చందుపట్ల జంగారెడ్డి. 18 నవంబర్ 1935 న జన్మించిన జంగారెడ్డి కొంత కాలం ప్రభుత్వ పాఠశాలలో బడిపంతులుగా పనిచేశాడు. పరకాల నియోజక వర్గం నుండి శాసనసభ్యునిగా భారతీయ జనసంఘ పార్టీ నుండి ఇండిపెం డెంట్ బి. కైలాసం పై గెలిచి శాసనస సభలో అడుగు పెట్టాడు. 1967 – 72 (పర్కల్ నుండి జనసంఘ్ సభ్యునిగా), 1978–83 (శ్యాంపేట నుండి జనతా పార్టీ సభ్యునిగా), 1983–84 (బిజెపి సభ్యునిగా శ్యాంపేట నుండి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. 1984లో 8వ లోక్‌సభలో పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. 1984 లో బీజేపీ 543 నియోజక వర్గాలలో కేవలం రెండింటిని గెలుపొందింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లోని హనుమకొండ కాగా గుజరాత్ లోని మెహ్సానా నియోజక వర్గం నుంచి ఏకే పాటిల్ అనే బీజేపీ నేత గెలిచారు. అలా హనుమకొండ నుండి పార్లమెంటు సభ్యుడుగా ఎంపికయిన చందు పట్ల జంగారెడ్డి, దక్షిణ భారతదేశం నుండి తొలి బీజేపీ ఎంపీగా రికార్డు సొంతం చేసుకు న్నాడు. పరకాల అసెంబ్లీ నియోజక వర్గం నుండి1967లో శాసన సభ్యునిగా ఎన్నికై, అసెంబ్లీ లో అడుగిడిన ఆయన, 1972లో పోటీచేసి పింగళి ధర్మా రెడ్డి చేతిలో ఓటమి చెందా డు. తరువాత 1978లో మళ్ళీ పింగళి ధర్మా రెడ్డి పై శాసన సభ్యుని గా, శాయంపేట అసెంబ్లీ నియోజక వర్గం భారతీయ జనసంఘ పార్టీ నుండి విజయం సాధించాడు. పరకాల అసెంబ్లీ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ కావడం మూలానా ఇద్దరు కూడా రెడ్డి సామాజికవర్గం వారు కావడం వలన పరకాల పక్కనేఉన్న జనరల్ సీటు శాయంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి తలపడ్డారు. మాజీ ముఖ్య మంత్రి, ఏ ఐ సి సి అధ్యక్షు లు, కాంగ్రెస్‌లో కీలక నేత, దేశ ఆర్థిక సంస్కరణల ఆద్యులు, దివం గత ప్రధాని పాముల పర్తి వెంకట నరసింహారావు పై 54వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించి దక్షిణ భారత దేశం తొలి బీజేపీ తొలి ఎంపీ గా హనుమకొండ నుండే ఎంపిక య్యాడు. 1989, 1991, 1996లో కాంగ్రెస్ పార్టీ నుండి కమాలుద్దీన్ అహ్మద్ చేతిలో జంగారెడ్డి భారతీయ జనతా పార్టీ నుండి పోటీచేసి ఓటమి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతూ జంగారెడ్డి 5 ఫిబ్రవరి, 2022న మణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# కళారంగ ఘనాపాఠి గరికపాటి

## - ఫిబ్రవరి 5...గరికపాటి రాజారావు జయంతి



కళలు సామాజిక ప్రగతికి దోహదం చెయ్యాలని, జనాన్ని చైతన్య స్ఫూర్తితో ముందుకు నడిపించాలని, అందుకు కళలు కరదీపికలు కావాలని ప్రతికరణ శుద్ధిగా నమ్మి ఆ లక్ష్య సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గరికపాటి రాజారావు. కళ ప్రజాచైతన్యం కోసమేనని నమ్మి, జీవితాన్ని కళకే అంకితం చేసిన ప్రజా కళాకారుడు, ప్రజావైద్యుడు రాజారావు. నాటకరంగం ద్వారా ప్రజాకళా రంగానికి దిక్సూచిగా నిలచిన వైతాళికుడు డాక్టర్ గరికపాటి రాజారావు. తెలుగు నాటక రంగంలో అతి నవీన భావాలతో వినూత్న విలువలను ఆవిష్కరించి తెలుగు నాటక దశను, దిశను మార్చి సామాన్య ప్రజల సాంస్కృతిక సైనికుడిలా నిలచిన కళాస్రష్ట ఆయన. ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేసిన ఘనత ఆయనదే. గరికపాటి రాజారావు (ఫిబ్రవరి 5, 1915 – సెప్టెంబరు 8, 1963) తెలుగు సినిమా దర్శకుడు, నాటకరంగ ప్రముఖుడు, ఆంధ్ర ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు. ప్రజానాట్య మండలి సాంఘిక నాటకాలకు పెద్దపీట వేసింది. ఈ నాటక సంఘం ద్వారా అనేకమంది ప్రతిభా వంతమైన కళాకారులు పరిచమయ్యారు. చెప్పికోదగిన వారిలో దేవిక, అల్లు రామలింగయ్య, సంగీత దర్శకులు మోహన్ దాస్, టి.చలపతిరావులు, నృత్యదర్శకుడు వేణుగోపాల్, రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఉన్నారు. రాజారావు 1915 ఫిబ్రవరి 5వ తేదీన రాజమండ్రిలో గరికపాటి కోటయ్య, దేవరా రామలింగమ్మల దంపతులకు జన్మించారు. చిన్నప్పుడే కాకినాడలోని ఆదిభట్ల నారాయణదాసు హరికథకు వెళ్లి, పాటకు తగిన తాళం వేసి తన ప్రతిభను నిరూపించుకుని అభినందనలు పొందారు. చదువుకుంటున్న రోజుల్లో విచిత్ర వేషధారణలో ఆసక్తి చూపించిన రాజారావు, హరిశ్చంద్ర నాటకంలోనూ ఓ వేషం ధరించి పాఠశాల అధ్యాపకుల మెప్పు పొందారు. తరువాత విజయ నగరంలో మేనమామ సుబ్రహ్మణ్యం ఇంట చేరి ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. రాజారావుకు 15వ ఏటనే నాగేశ్వరమ్మతో వివాహం జరిగింది. తండ్రి ఉద్యోగం చేసిన సికిందరా బాదు లాలాగూడ వర్క్‌షాపులో చిన్న గుమాస్తాగా జీవనం సాగిస్తూ, పై ఉద్యోగి పీడన భరించలేక దానికి రాజీనామా చేసి 1937లో మద్రాసు చేరారు. మద్రాసులో ఎల్.ఐ.యం చదువుతున్న రోజులో పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి (పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు) డాక్టర్ రామదాసు ఆయనకు ప్రాణ స్నేహితులు. అలాంటి స్నేహ వాతావరణ ప్రభావం వలన రాజారావు మార్క్సిస్టు రాజకీయ ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు. మద్రాసలో చదువుతున్నప్పుడే సహ విద్యార్థులతో కలిసి గుళ్లపల్లి నారాయణ మూర్తి రచించిన విడాకులు నాటకానికి దర్శకత్వం వహించాడు. మద్రాసులో రాజారావు దర్శకత్వంలో ప్రదర్శించిన షాజహాన్ నాటకం సంచలనాన్ని సృష్టించింది. షాజహాన్‌గా ఎస్‌వీఆర్ సాంబశివరావు, జహనారాగా డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు, ఔరంగజేబుగా రాజారావు అద్భుతంగా నటించి పలువురి ప్రశంసలు పొందారు. ఆ నాటకంలో రాజారావుకు సుప్రసిద్ధ నటుడు రూపశిల్పి దేవీప్రసాద్ రాయ్ చౌదరి మేకప్ చేయడం విశేషం. మద్రాసులో విద్యార్థులను సమీకరించి భమిడిపాటి బాగుబాగు, గాలి బాల సుందరరావు అపోహ వంటి నాటకాలను ప్రదర్శించారు. వృత్తి రీత్యా వైద్యుడైన రాజారావు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి విజయవాడలోని పోరంకిలో ప్రజా వైద్యశాల నెలకొల్పి ఫీజులు తీసుకోకుండా మందులు కూడా తనే కొనుగోలు చేసి ఉచితంగా రోగులకు సేవ చేసేవారు. కొంతకాలం రాజమండ్రి లోనూ ప్రజావైద్యశాల నిర్వహించారు. రాజారావు 1953లో పుట్టిల్లు సినిమాను స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేశారు. పుట్టిల్లు సినిమాలో వివిధ నటులు తమ నటనకు ప్రశంసలందుకున్నా ఈ సినిమా ఆర్థికంగా లాభించ లేదు. దానితో రాజరావు ఆర్థికంగా దెబ్బతిని అప్పుల పాలయ్యారు. కానీ వృత్తిరీత్యా వైద్యుడైన రాజారావు సంఘసేవ మాత్రం ఆపలేదు. ఒక్క రూపాయికి వైద్యం చేసిన సేవా తత్పరులు. పేదవారికి ఉచితం వైద్యం చేస్తుండేవారు. ఆ తరువాత ఈయన 1962లో విడుదలైన ఆరాధన వంటి సినిమాల్లో చిన్నాచితక పాత్రలు కూడా పోషించారు. ఆరాధనలో రాజశ్రీకి తండ్రి షావుకారు పాత్ర వేశారు. జైభవానీ నాటకాన్ని ప్రదర్శించే సమయంలో గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థులయ్యారు. అదే సమయంలో దేవుడుచేసిన మేలు చిత్రాన్ని నిర్మించినా ఆర్థిక కారణాలవల్ల ఆ చిత్రం విడుదల కాలేదు. మానసికంగా కుంగిపోయిన రాజారావు 1963 సెప్టెంబరు 8న మద్రాసులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి హేతుబద్ధీకరణే మార్గమా?

## ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణతో ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తు మారుతుందా?



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే అంశం ఇటీవలి కాలంలో రాష్ట్ర విద్యా విధానంలో అత్యంత కీలకమైన మలుపుగా మారింది. విద్యా వ్యవస్థలో అసమానతలు, వనరుల వృథా, ఉపాధ్యాయుల అసమతుల పంపిణీ వంటి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారంగా ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఈ ప్రక్రియను పూర్తిగా అమలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నిర్ణయానికి పూర్వాపరాలు, దానికి దారితీసిన సంఘటనలు, ప్రస్తుతం ఉన్న గణాంకాలు, భవిష్యత్‌పై దీని ప్రభావం అన్నిటినీ సమగ్రంగా పరిశీలిస్తే ఇది కేవలం పరిపాలనా సంస్కరణ మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాల విద్యా భవిష్యత్తును నిర్ణయించే కీలక చర్యగా కనిపిస్తుంది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ చరిత్రను పరిశీలిస్తే ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలు, పదోన్నతులు తరచూ రాజకీయ, ప్రాంతీయ ఒత్తిళ్లకు లోనవుతూనే వచ్చాయి. ఒక దశలో విద్యార్థుల సంఖ్యకు మించిన ఉపాధ్యాయులు కొన్ని పాఠశాలల్లో ఉండగా, మరికొన్ని గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లో కనీస అవసరానికి సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు అనేకం. ఉదాహరణకు, గత దశాబ్దంలో నిర్వహించిన విద్యాశాఖ అంతర్గత సర్వేల్లో పట్టణ ప్రాంతాల్లోని కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:15 లేదా 1:18 ఉపాధ్యాయ--విద్యార్థి నిష్పత్తి ఉండగా, మారుమూల మండలాల్లో అదే నిష్పత్తి 1:60 లేదా అంతకంటే ఎక్కువగా నమోదైంది. ఈ అసమానతలు విద్యా నాణ్యతపై ప్రత్యక్ష ప్రభావం చూపడమే కాకుండా ప్రభుత్వ వ్యయాన్ని కూడా అనవసరంగా పెంచాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే భావన ముందుకు వచ్చింది. హేతుబద్ధీకరణ అంటే ఉద్యోగాలను తగ్గించడం కాదు, ఉన్న వనరులను సమర్థంగా, న్యాయంగా పంపిణీ చేయడం. ప్రభుత్వ వివరణ ప్రకారం విద్యార్థుల సంఖ్య, పాఠశాల స్థాయి, తరగతుల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు వంటి ప్రమాణాల ఆధారంగా ప్రతి పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయుల సంఖ్యను ఖరారు చేయడం ఈ ప్రక్రియ యొక్క మూల ఉద్దేశం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య, వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల మొత్తం సంఖ్య, విద్యార్థుల నమోదు గణాంకాలను పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజా అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో సుమారు లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిలో దాదాపు నాలుగు లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కానీ విద్యార్థుల మొత్తం సంఖ్య గత పది సంవత్సరాల్లో క్రమంగా తగ్గుతూ రావడం గమనార్హం. ప్రైవేట్ పాఠశాలల విస్తరణ, వలసలు, జనాభా ధోరణుల మార్పు వంటి కారణాల వల్ల కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పడిపోయింది. ఈ గణాంకాలే హేతుబద్ధీకరణకు బలమైన ఆధారంగా మారాయి. ఉదాహరణకు, ఒక పాఠశాలలో మొత్తం విద్యార్థులు 40 మాత్రమే ఉండగా అక్కడ ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయులు ఉండటం, మరో పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండటం వంటి పరిస్థితులు స్పష్టమైన అసమతులతను చూపుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన నివేదికల ప్రకారం సుమారు 20 శాతం పాఠశాలల్లో అవసరానికి మించిన ఉపాధ్యాయులు ఉండగా, దాదాపు 30 శాతం పాఠశాలల్లో తీవ్ర కొరత ఉంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పునర్వ్యవస్థీకరణ తప్పనిసరిగా మారింది. హేతుబద్ధీకరణ నిర్ణయానికి దారితీసిన సంఘటనల్లో మరో ముఖ్యమైన అంశం జాతీయ విద్యా విధానం సూచనలు. విద్యా నాణ్యత, ఉపాధ్యాయుల పాత్ర, విద్యార్థి--ఉపాధ్యాయ నిష్పత్తి వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రాథమిక స్థాయిలో 1:30, ప్రాథమికోన్నత స్థాయిలో 1:35 నిష్పత్తి సాధించాలన్న సూచనలను రాష్ట్రం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రమాణాలను సాధించాలంటే ఉన్న ఉపాధ్యాయులను సమర్థంగా వినియోగించడమే ప్రధాన మార్గమని విద్యాశాఖ భావించింది. కొత్త నియామకాలు చేపట్టడం కంటే ముందుగా ఈ అసమతులతలను సరిదిద్దడం ఆర్థికంగా కూడా ప్రభుత్వానికి మేలు చేస్తుందని ఆర్థిక శాఖ అంచనా వేసింది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే ఉపాధ్యాయ సంఘాల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. కొందరు దీన్ని అవసరమైన సంస్కరణగా స్వాగతిస్తే, మరికొందరు ఉద్యోగ భద్రత, బలవంతపు బదిలీలు, కుటుంబ సమస్యలు వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రం స్పష్టంగా ఒక విషయం చెబుతోంది---హేతుబద్ధీకరణ వల్ల ఒక్క ఉపాధ్యాయుడి ఉద్యోగం కూడా పోదు, వేతనాలు తగ్గవు. కేవలం పాఠశాలల మధ్య సమతుల పంపిణీ మాత్రమే జరుగుతుంది. బదిలీల్లో పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానం, స్పష్టమైన పాయింట్ల వ్యవస్థను అమలు చేస్తామని ప్రకటించింది. సీనియారిటీ, మహిళా ఉపాధ్యాయుల సమస్యలు, అనారోగ్య కారణాలు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న లక్ష్యం వెనుక ఒక వ్యూహం ఉంది. విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయుల మార్పులు జరిగితే బోధనకు అంతరాయం కలుగుతుందన్న విమర్శలు గతంలో వచ్చాయి. అందుకే ఈసారి వేసవి సెలవుల కాలాన్ని వినియోగించి హేతుబద్ధీకరణను పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి ప్రతి తరగతికి సరిపడా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో జిల్లాల వారీగా డేటా సేకరణ, మండల స్థాయి సమీక్షలు, రాష్ట్రస్థాయి ఆమోదం వంటి దశలను ఖరారు చేశారు. గణాంకాల పరంగా చూస్తే ఈ చర్య వల్ల సంవత్సరానికి వందల కోట్ల రూపాయల ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగం కానుంది. అవసరానికి మించిన ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో అదనపు తరగతులు లేకపోయినా వేతనాలు చెల్లించాల్సి వస్తుండేది. మరోవైపు ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా ఫలితాలు దెబ్బతింటున్నాయి. ఈ రెండు సమస్యలకు ఒకేసారి పరిష్కారం చూపే మార్గంగా హేతుబద్ధీకరణను ప్రభుత్వం చూస్తోంది. విద్యాశాఖ అంతర్గత అంచనాల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తయితే ఉపాధ్యాయ--విద్యార్థి నిష్పత్తిలో 90 శాతం వరకు సమతులత సాధ్యమవుతుంది. సామాజికంగా కూడా ఈ నిర్ణయం ప్రాధాన్యత కలిగినదే. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల పిల్లలు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడుతున్నారు. అక్కడ ఉపాధ్యాయుల కొరత ఉండటం అంటే నేరుగా ఆ వర్గాల భవిష్యత్తుపై ప్రభావం పడటమే. హేతుబద్ధీకరణ ద్వారా అటువంటి ప్రాంతాలకు ఎక్కువ మంది ఉపాధ్యాయులు అందుబాటులోకి రావడం విద్యలో సమాన అవకాశాలను పెంచుతుంది. ఇది రాజ్యాంగంలోని సమానత్వ సూత్రానికి అనుగుణమైన చర్యగా కూడా భావించవచ్చు. అయితే ఈ ప్రక్రియ సవాళ్లలేనిదేం కాదు. ఉపాధ్యాయుల బదిలీలతో పాటు పాఠశాలల విలీనాలు, తక్కువ విద్యార్థులున్న పాఠశాలల నిర్వహణ వంటి అంశాలు రాజకీయంగా, సామాజికంగా సున్నితమైనవి. కొన్ని గ్రామాల్లో పాఠశాలే ఒక గుర్తింపుగా ఉండటం వల్ల అక్కడ మార్పులకు ప్రతిఘటన కనిపించే అవకాశముంది. ప్రభుత్వం ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల సంఘాలతో చర్చలు జరిపి ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. కేవలం పరిపాలనా ఆదేశాలతో కాకుండా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ ఈ సంస్కరణను అమలు చేయడం కీలకం. మొత్తంగా చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ నిర్ణయం విద్యా రంగంలో ఒక కీలక మలుపు. ఇది సక్రమంగా, పారదర్శకంగా అమలైతే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది, విద్యా నాణ్యత మెరుగుపడుతుంది, ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగమవుతుంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తవ్వడం ద్వారా విద్యార్థులకు ఎలాంటి అంతరాయం లేకుండా మార్పు సాధ్యమవుతుంది. అయితే దీనికి అవసరమైన రాజకీయ సంకల్పం, పరిపాలనా సామర్థ్యం, సామాజిక సమన్వయం అన్నీ సమపాళ్లలో కలిసినప్పుడే ఈ నిర్ణయం ఆశించిన ఫలితాలను ఇస్తుంది. ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తును కొత్త దిశగా మలిచే ఈ ప్రయత్నం విజయం సాధిస్తుందా లేదా అన్నది అమలు విధానంపైనే ఆధారపడి ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఇప్పుడే ఎందుకు కుదిరింది? అదానీ కోసమా?

## అమెరికాతో డీల్ పై రాహుల్ గాంధీ ధర్మసందేహం



అమెరికా, యూఎస్ మధ్య వాణిజ్య చర్చలు సఫలమయ్యాయి. టారిఫ్ లు 50 శాతం నుంచి 18 శాతానికి దిగొచ్చాయి. కానీ రష్యా చమురు కొనుగోలు అంశంలో మాత్రం స్పష్టత లేదు. రష్యా చమురుకు బదులుగా వెనుజులా చమురు విక్రయిస్తామని ట్రంప్ చెబుతున్నారు. రష్యా నుంచి భారత్ కొనుగోలు చేయదని, వెనుజులా చమురు కొనుగోలు చేస్తుందని ట్రంప్ ప్రకటించడం, అదే సమయంలో భారత్ నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడం అస్పష్టతకు కారణమవుతోంది. ఇప్పుడు రష్యా కూడా స్పందించింది. చమురు కొనుగోలు అంశంలో భారత్ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదని, చమురు దిగుమతులు ఆపేస్తున్నట్టు భారత్ రష్యాకు చెప్పలేదని రష్యా స్పష్టత ఇవ్వడం గందరగోళానికి కారణమవుతోంది. భారత్ తో ద్వైపాక్షిక సంబంధాలకు, వాణిజ్యానికి ప్రాధానత్య ఇస్తామని రష్యా చెబుతోంది. భారత్ వ్యూహమా ? రష్యాతో భారత్ కు సుదీర్ఘకాలం నుంచి సంబంధాలు ఉన్నాయి. వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. చమురు కొనుగోలు చాలా కాలంగా జరుగుతోంది. దీనిని రద్దు చేసుకోవాలని ట్రంప్ భారత్ పై ఒత్తిడి చేస్తున్నారు. కానీ భారత్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఇప్పుడు కూడా రష్యా చమురు కాకుండా.. వెనుజులా చమురు భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్ చెబుతున్నారు. కానీ భారత్ ప్రకటన చేయకపోవడం గమనార్హం. రెండు దేశాలతో సమానంగా సంబంధాలు నెరపాలని భారత్ యోచిస్తున్నట్టు కనిపిస్తోంది. –రష్యా చమురు కొనుగోలు చేయం– అని భారత్ ప్రకటన చేయకపోవడం వ్యూహాత్మకమే అవుతుంది. అటు రష్యా, ఇటు అమెరికా ఇద్దరూ అవసరమే. ఒకరి కోసం ఇంకొకరిని వదులుకోవడం సరైన నిర్ణయం కాదు. దేశ ప్రయోజనాలు కోసం రెండు దేశాలతో సంబంధాలు కొనసాగించాలి. అప్పుడే భారత్ ప్రయోజనాలు నెరవేరుతాయి. ట్రంప్ కోసమో.. రష్యా కోసమో మన ప్రయోజనాలు పణంగా పెట్టడం తెలివైన చర్య కాదు. ఇదే ఇప్పుడు భారత్ చేస్తున్నట్టు కనిపిస్తోంది.ట్రంప్ రియాక్షన్ ఏంటి ? భారత్ రెండు దేశాలతో తన ప్రయోజనాల నిమిత్తం సంబంధాలు కొనసాగిస్తే ట్రంప్ ఎలా స్పందిస్తారు అన్నది కూడా ప్రశ్న. ఎందుకంటే ట్రంప్ రష్యా చమురు కొనుగోలు అంశంలో భారత్ మీద ఆగ్రహంతో ఉన్నారు. భారత్ ఒకవేళ వెనుజులా చమురు కొనుగోలు చేస్తామని ప్రకటిస్తే.. రష్యా చమురు కొనుగోలు చేయబోమని ప్రకటించడం కాదు. వెనుజులా చమురుతో పాటు ఏక కాలంలో రష్యా చమురు కూడా కొనుగోలు చేయవచ్చు. ఇక్కడ ధర ముఖ్యమైన అంశం. రష్యా చమురు వెనుజులా చమురు కంటే తక్కువ ధరకు, నాణ్యతతో వస్తే రష్యా నుంచి కొనుగోలు చేయడమే భారత్ కు ప్రయోజనం. రష్యా కంటే వెనుజులా చమురు తక్కువకు, నాణ్యతతో వస్తే వెనుజులా చమురు కొనుగోలు చేయడం ప్రయోజనం. వాణిజ్యంలో దేశ ప్రయోజనాలే పరమావధి. అంతేకానీ ట్రంప్ బెదిరించారనో, టారిఫ్ వేస్తారనో తమ ప్రయోజనాలు తాకట్టు పెట్టడం సరైన చర్య కాదు. రష్యాతో డీల్ కొనసాగిస్తే.. ట్రంప్ మళ్లీ టారిఫ్ ప్రకటించే ప్రమాదం కూడా లేకపోలేదు. అయితే.. ఇక్కడ కొంత మినహాయింపు ఉంది. భారత్ తో టారిఫ్ వార్ కొనసాగిస్తే.. అది అమెరికాకు ఇబ్బంది అయినప్పుడు ట్రంప్ ఇరుదేశాల ప్రయోజనాల నేపథ్యంలో తగ్గొచ్చన్నది నిపుణుల వాదన. అదానీ కోసమేనా ? అదానీపై అమెరికాలో ఉన్న కేసు కోసమే యూఎస్ ఇండియా ట్రేడ్ డీల్ కుదిరిందని రాహుల్ వ్యాఖ్యానించడం ఆసక్తికరం. ఇన్నాళ్లుగా నాన్చుతూ.. ఇప్పుడు అనూహ్యంగా నిర్ణయం తీసుకోవడం వెనుక ఉన్న అంతరార్థం ఇదేనని చెబుతున్నారు. అదానీ కోసం దేశ, రైతుల ప్రయోజనాలు తాకట్టు పెట్టారని మాట్లాడటం చర్చనీయాంశం. ఈ అంశాన్ని కూడా లోతుగా పరిశీలించాల్సి ఉంటుంది. అమెరికా ఉత్పత్తులను మన దేశంలోకి ఆహ్వానించడం ద్వారా జరిగే నష్టం, మన ఎగుమతులు అమెరికా వెళ్లడం ద్వారా వచ్చే లాభం.. ఈ రెండింటిని అంచనా వేస్తే భారత్ కు ఒనగూరే లాభం ఏంటో అర్థమవుతుంది. ఇందులో భారత్ కు లాభం లేకపోతే మాత్రం రాహుల్ ఆరోపణల్లో వాస్తవం ఉండే అవకాశం ఉంటుంది. అలా కాకుండా లాభం ఉంటే ఆరోపణలు రాజకీయమే అవుతాయి.

చురకలు

## సంపాదకీయం

# అది 2003 ప్రపంచ కప్..

## భారత్ కు శివరాత్రి.. పాక్ కు కాళరాత్రి..!

భారతీయులు అత్యంత నిష్టగా జరుపుకొనే పండుగల్లో ఒకటి శివరాత్రి..! ఆ రోజు జాగరణతో పాటు ఉపవాసాలు కూడా ఉంటారు. సరిగ్గా అదే రోజు క్రికెట్ మ్యాచ్ ఉంటే...? అది కూడా పాకిస్థాన్ తో అయితే..? అందులోనూ మన జట్టే గెలిస్తే? ఇక చెప్పేదేముంది? 2003లో సరిగ్గా అదే జరిగింది...! అప్పటికి టి20లు లేవు. క్రికెట్ వరల్డ్ కప్ అంటే వన్డేలే! సెల్ ఫోన్లు కూడా పెద్దగా లేవు..! స్మార్ట్ ఫోన్లు అసలే లేవు.. అలాంటి సమయంలో టీవీలే క్రికెట్ మ్యాచ్ ల మజా అందించే వేదికలు..! ఆ ఏడాది ప్రపంచ కప్ దక్షిణాఫ్రికాలో జరిగింది. భారత్ పాక్ మ్యాచ్ మార్చి 1న శివరాత్రి సందర్భంగా సెంచూరియన్ లోని సూపర్ స్పోర్ట్స్ పార్క్ లో జరిగింది. 1999 కార్గిల్ యుద్ధం, 2001 భారత పార్లమెంటుపై పాక్ మద్దతున్న ఉగ్రవాదుల దాడి తదితర ఘటనల అనంతరం భారత్–పాక్ సంబంధాలు బాగా క్షీణించాయి. ఇలాంటి సమయంలో రెండు దేశాల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ హైఓల్టేజ్ గా మారింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. 273 పరుగులు చేసింది. నాటి పరిస్థితుల్లో ఇది పెద్ద స్కోరే. వసీం అక్రమ్, వకార్ యూనిస్, షోయబ్ అక్తర్ వంటి పేస్ బౌలర్లు, అజహర్ మొహమూద్, అబ్దుల్ రజాక్ వంటి పేస్ ఆల్ రౌండర్లు, షాహిద్ ఆఫ్రిది వంటి స్పిన్ ఆల్ రౌండర్ పాక్ బౌలింగ్ ను ఎదుర్కొంటూ భారత్ టార్గెట్ ను అలవోకగా ఛేదించింది. మరీ ముఖ్యంగా క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ అప్పర్ కట్ లతో అలరిస్తూ 75 బంతుల్లోనే 98 పరుగులు చేసి భారత పతాకాన్ని సగర్వంగా ఎగురవేశాడు. డాషింగ్ బ్యాటర్ వీరేంద్ర సెహ్వాగ్ 14 బంతుల్లో 21 పరుగులతో సూపర్ స్టార్ట్ అందించాడు. రాహుల్ ద్రవిడ్ (44 నాటౌట్), యువరాజ్ సింగ్ (50 నాటౌట్) నిలవడంతో భారత్ 45.4 ఓవర్లలోనే 276 పరుగులు చేసింది. దీంతో నాటి మీడియాలో... భారత్ కు శివరాత్రి.. పాక్ కు కాళరాత్రి శీర్షికన పెట్టిన హెడింగ్ పేలింది. పైగా పండుగ నాడు జరిగిన మ్యాచ్ కావడంతో చాలామందికి సెంటిమెంట్ గా నిలిచింది. మళ్లీ ఇప్పుడు అదే శివరాత్రి.. అదే పాక్ తో మ్యాచ్..! ఈ సారి జరుగుతుందా? గత ఏడాది పెహల్గాంలో పాకిస్థాన్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు.. భారత టూరిస్టులపై జరిపిన పాశవిక దాడి, అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్, తర్వాత జరిగిన ఆసియా కప్ లో షేక్ హ్యాండ్ లు ఇవ్వకుండా పాక్ క్రికెటర్లకు భారత ఆటగాళ్లు బుద్ధి చెప్పడం.. ఇలా అనేక పరిణామాలు జరిగాయి. వీటి మధ్యనే బంగ్లాదేశ్ లో మైనారిటీలైన హిందువులపై దాడులు, హత్యల అంశం వివాదాస్పదమైంది. ఆ దేశ క్రికెటర్ ను ఐపీఎల్ నుంచి తప్పించడం చర్చకు దారితీసింది. బంగ్లాదేశ్.. టి20 ప్రపంచ కప్ నుంచి తప్పుకొంది. ఇదే అదనుగా పాకిస్థాన్.. భారత్ తో మ్యాచ్ ను ఆడబోమని బీష్మించింది. కాగా, ఈ సారి శివరాత్రి ఫిబ్రవరి 15 (వచ్చే ఆదివారం) రానుంది. టి20 ప్రపంచ కప్ లో భారత్ –పాక్ మ్యాచ్ అదే రోజు జరగనుంది. కొలంబో వేదిక. కానీ, ఇప్పటికైతే పాకిస్థాన్ ఈ మ్యాచ్ ఆడనంటోంది. ఆడినా భారత్ కు శివరాత్రి.. పాక్ కు కాళరాత్రే.. వచ్చే టి20 ప్రపంచ కప్ లో భారత్ హాట్ ఫేవరెట్. డిఫెండింగ్ చాంపియన్ కూడా అయిన మన జట్టును ఓడించడం అంత సులువు కాదు. పైగా జట్టు చాలా పటిష్ఠంగా ఉంది. మరోవైపు పాకిస్థాన్ బలహీనంగా ఉంది. కాబట్టి ఒకవేళ భారత్ తో మ్యాచ్ ఆడినా.. ఓటమి తప్పదు. అంటే.. భారత్ కు శివరాత్రి.. పాక్ కు కాళరాత్రే అన్నమాట. ఈ నేపథ్యంలోనే 2003 వన్డే ప్రపంచ కప్ నాటి ఉదాహరణ గుర్తుకొస్తోంది.

# తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు వట్టికోట - ఫిబ్రవరి 5...వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతి



తెలంగాణ ప్రజాసాహిత్య చరిత్రలో వట్టికోట ఆళ్వారుస్వామి ఒక మహోన్నత స్థానం పొందారు. ఆయన కేవలం రచయిత మాత్రమే కాకుండా ఉద్యమకర్త, కమ్యూనిస్టు నాయకుడు, ప్రచురణకర్త, పాత్రికేయుడిగా విభిన్న రంగాలలో సేవలందించారు. భాషా సాహిత్యం నుంచి పౌరహక్కుల ఉద్యమాల వరకు అనేక రంగాలలో ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. ఆయనకు "తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు" అనే బిరుదు అందించారు.

**బాల్యం మరియు ప్రారంభ జీవితం....** 1915 నవంబర్ 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని చెరువు మాదారం అనే గ్రామంలో జన్మించిన ఆళ్వారుస్వామి, చిన్నతనం నుండే సామాజిక అన్యాయాలను గమనించారు. ఈ అన్యాయాలు ఆయనలో చైతన్యాన్ని, మార్పు తపనను రేకెత్తించాయి. ఆయనకు సాహిత్యం పట్ల ఉన్న ఆసక్తిని "గ్రంథాలయోద్యమం" మరింత పెంచింది. నిజాం పాలనలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలు ఆయనను రాజకీయాల వైపు నడిపించాయి. వట్టికోట ఆళ్వారుస్వామి నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. పేద ప్రజల పట్ల అన్యాయం, వివక్షలపై ఆయన గళం ఎత్తారు. ఈ ఉద్యమంలో ఆయన అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. జైలు జీవితం ఆయన వ్యక్తిత్వం, సాహిత్యం పై విపరీతమైన ప్రభావం చూపింది. జైలులో ఉన్నప్పుడు ఆయన తన అనుభవాలను కథల రూపంలో అభివ్యక్తం చేయడం ప్రారంభించారు. "జైలు లోపల" అనే కథా సంపుటి ఆయన జైలు అనుభవాలకు ప్రతిబింబంగా నిలిచింది, ఇందులో జైలు లోపల నిర్బంధితుల జీవితం, వారి బాధలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. తెలుగులో రాజకీయ నవలలను రచించిన మొట్ట మొదటి వ్యక్తిగా వట్టికోట ఆళ్వారు స్వామి ప్రసిద్ధి చెందారు. ఆయన "ప్రజల మనిషి" అనే నవల రచించి తెలంగాణ ప్రజల జీవన పరిస్థితులను, సామాజిక అన్యాయాలను, ప్రజల మానసిక స్థితిగతులను ప్రతిబింబించారు. ఈ నవల ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులపై తీవ్ర విమర్శగా నిలిచింది. వట్టికోట రచనల్లోని కథలు, నాటికలు సమాజాన్ని విమర్శిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఉన్నవి. సురవరం ప్రతాప రెడ్డి హైదరాబాద్ లో స్థాపించిన "గోలకొండ" పత్రిక లో ప్రూఫ్ రీడర్ గా పని చేసారు. వట్టికోట ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, ప్రజా స్వేచ్ఛను కాపాడటానికి కృషి చేశారు. సమాజంలో న్యాయం, సమానత్వం రావాలనే ఆశయంతో ఆయన అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వట్టికోట ప్రజాసాహిత్య చైతన్యానికి ఒక బలమైన పునాదిగా నిలిచారు. ప్రజల జీవన గాధలను సాహిత్యంలోకి తీసుకురావడం ద్వారా సామాజిక మార్పు తపనను ప్రేరేపించారు. తెలంగాణా లో స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్మూనిస్టు పార్టీ, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణా రచయితల సంఘం వంటి సామాజిక, రాజకీయ సాహిత్య సంస్థలలో కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారు.

హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, 1944లో గుమాస్తాలు సంఘం, రిక్షాకార్మిక సంఘం, రైల్వే ఉద్యోగులు, కార్మిక ఉద్యోగుల సంఘాలకు నాయకత్వం వహించారు. దాశరథి వట్టికోట కలసి 1948 లో మూడు నెలలు నిజామాబాద్ జైలులో ఉన్నారు. దాశరథి పద్యాలు జైలు గోడల మీద రాసి దెబ్బలు తిన్నారు. 1961 ఫిబ్రవరి 5న మరణించారు. వట్టికోట ఆళ్వారుస్వామి కేవలం ఒక రచయిత మాత్రమే కాకుండా సమాజ సేవకుడు, ఉద్యమకర్త, ప్రజల చైతన్య దాత అని చెప్పవచ్చు. ఆయన రచనలు ప్రజల బాధలను, వారి ఆశయాలను ప్రతిబింబిస్తూ, ప్రజాస్వామ్య పునాదుల స్థాపనకు తోడ్పడతాయి. ఆయన సాహిత్యం తెలంగాణ ప్రజాసాహిత్యంలో ఒక అద్భుతమైన అధ్యాయంగా నిలిచిపోతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# బుర్రకథా పితామహుడు నాజర్ - ఫిబ్రవరి 5...నాజర్ జయంతి




ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథా ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథా పితామహుడు నాజర్, నటుడు, ప్రజారచయిత, గాయకుడు. " ఈ గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు. అంగాంగ విన్యాసాల ద్వారా ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన గొప్ప ప్రతిభాశాలి షేక్ నాజర్. నాజర్ ప్రతిభకు ముగ్ధుడైన సినీ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు సినీరంగంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుర్రకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడిగా కొనసాగిన ప్రజా గాయకుడు నాజర్. బుర్రకథా పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ (ఫిబ్రవరి 5, 1920 – ఫిబ్రవరి 22, 1997) బుర్రకథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. పద్మశ్రీ అవార్డు గ్రహీత. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఓ పేద దూదేకులముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5 వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీలకు దంపతులకు జన్మించారు. నాజరు పూర్తి పేరు "షేక్ నాజరు వలి". మహ్మదీయ సభ పేరిట నాటకా లాడి మంచిపేరు గడించారు. ఆయన కృష్ణలీలలో దేవకి, శ్రీ కృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్యపతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవం పోశారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. నాస్తికుడయ్యారు. తెనాలిలోని "బాలరత్న నాటక సమాజం"లో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలోచేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుర్రకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించు కున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు మొదలగు ఇతివృత్తాలలో నమకాలీన రాజకీయాలు జోడించి బుర్రకథలు రూపొందించారు. పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్రను అంగడాల వెంకట రమణమూర్తి... పింజారీ అనే పుస్తకంగా ప్రచురించాడు. కొంతకాలం విరసం సభ్యులుగా ఉన్నారు. అగ్గిరాముడు, బలేబావ, నిలువు దోపిడీ, పెత్తందార్లు, పుట్టిల్లు, మనుషులంతా ఒక్కటే – సినిమాల్లో నాజర్ బుర్రకథలు కన్పిస్తాయి. పూల రంగడు సినిమాలో "అక్కినేని"కి నేర్పించారు. చాలా మందికి ఈ గాంధర్వ విద్య నేర్పారు. ఆయన గళ గాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, "ఆసామీ" నాటకాన్ని రచించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో ఆసామీ నాటకం ప్రథమ బహుమతి పొందింది. నాజర్ ఏడుసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు. ఆంధ్రనాటక అకాడమీ 1981లో "ఉత్తమ కళాకారుడు" అవార్డుతో సత్కరించింది. 1986 లో భారత ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదుతో నాజరును సత్కరించింది. రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవా చార్యులు, నాజరు బుర్రకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం, మద్రాసులో ప్రదర్శన చూచిన గోవిందరాజుల సుబ్బారావు నాజరుని అభినందిస్తూ కౌగిలించు కోవడం, ప్రముఖ పాత్రికేయుడు కె. అబ్బాస్ నాజరును "ఆంధ్ర అమరషేక్" అని అభివర్ణించడం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజా భాషకు ముగ్ధుడై "నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో" అని ఆలింగనం చేసుకోవడం, నాజరు లోని కళా ప్రతిభకు తిరుగులేని నిదర్శనాలు. "నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది" అని ప్రముఖ నటి జమున వ్యాఖ్యానించారు. గుంటూరుకు ఎన్టిఆర్ వచ్చినప్పుడు "నేను మీ అభిమానిని" అని నాజర్ చెపితే... "నేను మీ ఫాన్ను" అని ఎన్టిఆర్ చెప్పి అందరినీ ఆనంద పరిచారు. "హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుర్రకథకు నాజర్ అలాంటివాడు" అని ముదిగొండ శివప్రసాద్ తదితర ప్రముఖుల అభిప్రాయాలు ఉంటే నాజర్ గొప్పతనం స్పష్టం అవుతున్నది. కటిక పేదరికాన్ని మరణించే వరకు అనుభవించిన నాజర్ 1997, ఫిబ్రవరి 22 న అంగలూరులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# అడ్వర్టయింజింగ్ దిగ్గజం ఏజీకే

## ఫిబ్రవరి 5...ముద్రా కమ్యూనికేషన్స్ వ్యవస్థాపకులు ఎ.జి.కృష్ణమూర్తి వర్ధంతి



మానవులు పుడతారు. చనిపోతారు . కొంతమంది మాత్రమే తమ జీవితంలో మేథో మథనంతో, స్వయం కృషితో, ప్రజలకు గుర్తుండే, పనులు చేసి, చిరస్థాయిగా నిలిచి పోతారు. ప్రచార రంగంలో అలాంటి కృషి చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యాపార దిగ్గజం ఎ.జి.కృష్ణమూర్తి. దేశంలోనే ప్రచార రంగంలో తనదైన ముద్ర వేసుకున్న 'ముద్ర' వ్యవస్థాపకుడు ఎ.జి.కృష్ణమూర్తి. ముద్రా కమ్యూనికేషన్స్ సంస్థాపక అధ్యక్షుడు ఎ. జి. కృష్ణమూర్తి. కేవలం 35 వేల నగదు తో, ఒకే ఒక క్లయింట్ తో వ్యాపార ప్రకటనా సంస్థ స్థాపించి, కేవలం తొమ్మిదేళ్ళల్లో ముద్రా భారతదేశంలో ఉన్న పెద్ద వ్యాపార ప్రకటనా సంస్థలలో మూడవ స్థానాన్ని, స్వదేశీ వ్యాపార ప్రకటనా సంస్థలలో ప్రథమ స్థానాన్ని చేరుకునేలా కృషి చేశారు. ప్రభుత్వంలో చిన్న గుమస్తా ఉద్యోగంతో ప్రారంభించిన ఎ. జి. కె. తెలుగువారు గర్వించదగ్గ అతి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ధీరూభాయ్ అంబానీకి అతి చేరువలో ఉండి ఈ సంస్థని ఇంత త్వరగా ఉన్నత స్థాయికి లేవనెత్తి ఆయనచేత శభాష్ అనిపించు కున్నారు. ఎ.జి.కృష్ణమూర్తి (అచ్యుతాని గోపాల కృష్ణమూర్తి) 1942, ఏప్రిల్ 28న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. అయన ముద్రా కమ్యూనికేషన్స్ సంస్థాపక అధ్యక్షులు. తెలుగువారు గర్వించదగ్గ వ్యాపార దిగ్గజం. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి చరిత్రలో బి.ఏ హానర్స్ పట్టా పుచ్చుకొని 1968లో 60, 70వ దశకాలలో వస్త్ర పరిశ్రమలో బాగా పేరున్న కాలికో మిల్స్ లో గిరాబెన్ సారాభాయికి సహాయకుడిగా చేరారు. 1972లో అదే కంపెనీకి చెందిన వ్యాపార ప్రకటన సంస్థ అయిన "శిల్పా అడ్వర్టైజింగ్" లో అకౌంట్ ఎగ్జిక్యూటివ్ గా పదోన్నతి పొందారు. 1976లో రిలయన్స్ సంస్థలకు ఆడ్వర్టైజింగ్ మేనేజరుగా చేరి, నాలుగు సంవత్సరాలు తిరక్కుండానే సొంత వ్యాపార ప్రకటనా సంస్థ "ముద్రా కమ్యూనికేషన్స్" ను 1980, మార్చి 25న స్థాపించారు. రిలయన్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో అడ్వర్టయిజింగ్ డైరెక్టర్‌గా చేరిన ఏజీకే అడ్వర్టయి జింగ్ రంగంలో శిఖర సదృశుడైన ఫ్రాంక్ సియాయిస్‌తో కలసి అద్భుతాలు చేశారు. రిలయన్స్ సంస్థ ఉత్పత్తి చేసిన సిల్కు చీరలూ, ఇతర దుస్తులకూ విమల్ బ్రాండ్‌తో ప్రకటనలు తయారు చేయడంలో ఫ్రాంక్ అనేక విన్యాసాలు చేశారు. 'ఓన్లీ విమల్' అన్నది అందరికీ, ఎప్పటికీ గుర్తు ఉండే సృజనాత్మక ప్రకటన. విమల్ కోసం తయారు చేసిన మొదటి అడ్వర్టయిజ్ మెంట్ ... "ఒక స్త్రీకి ఎన్నెన్నో మనోభావాలు". అడ్వర్టయిజ్ మెంటు రకరకాల రూపాలు సంతరించుకొని అత్యధికంగా పత్రికలలో, రేడియోలలో వచ్చి విమల్ చీరలకు అసాధారణమైన ఆదరణ తెచ్చింది. ఫ్రాంక్ సియాయిస్ సొంత ఏజెన్సీ పెట్టుకున్న తర్వాత, రిలయన్స్ ప్రత్యర్థులు ఆయన క్లయింట్లు అయిన కారణంగా రిలయన్స్ స్వయంగా ఒక అడ్వర్టయిజింగ్ ఏజెన్సీని నెలకొల్పాలనీ, దానికి 'ముద్ర' అని పేరు పెట్టాలనీ ఏజీకే చేసిన సూచనను ధీరూభాయ్ అంబానీ ఆమోదించారు. ఆయన రూ. 35 వేల నగదు తోను ఒకే ఒక క్లయింట్ తోను వ్యాపార ప్రకటనా సంస్థ స్థాపించారు. కేవలం తొమ్మిదేళ్ళల్లో ముద్రా భారత దేశంలో ఉన్న పెద్ద వ్యాపార ప్రకటనా సంస్థలలో మూడవ స్థానాన్ని, స్వదేశీ వ్యాపార ప్రకటనా సంస్థలలో ప్రథమ స్థానాన్ని చేరుకుంది. 1980లో ముద్ర వెలిసింది. ఒక వెలుగు వెలిగింది. కార్పొరేట్ రంగంలో "అడ్వర్టయింజింగ్ జీనియస్"గా ఏజీకే గుర్తింపు పొందారు. దేశ వ్యాప్తంగా విమల్ షోలు నిర్వహించి విమల్ విజయ పరంపరను కొనసాగించడంలో ఏజీకేది అద్వితీయమైన పాత్ర. 'ఐ లవ్ యూ రస్నా' కూడా ఆయన సృష్టే. ప్రభుత్వంలో చిన్న గుమస్థా ఉద్యోగంతో ప్రారంభించిన ఎ. జి. కె. తెలుగువారు గర్వించదగ్గ అతి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ధీరూభాయ్ అంబానీకి అతి చేరువలో ఉండి ఆ సంస్థను అంత త్వరగా ఉన్నత స్థాయికి లేవనెత్తి ఆయన చేత శభాష్ అనిపించు కున్నారు. ఆయన తమ అనుభవాలను పుస్తకాల రూపంలోనూ, పత్రికా శీర్షికల ద్వారా రాసి యువతను ఉత్తేజ పరిచారు. కృష్ణమూర్తి తెలుగు పత్రికలో వారం వారం అనే శీర్షికను, ఆంగ్ల పత్రికలలో ఏజికె స్పీక్ అనే శీర్షికను రాశారు. ఆయన 'ధీరూభాయిజమ్' అనే పేరుతో తెలుగులో, ఇంగ్లీష్‌లో పుస్తకం రాశారు. 'ఎదురీత' పేరుతో మరో పుస్తకం రాశారు. వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసే ఆయన రచనలను వివిధ భారతీయ భాషలలోకి అనువదించారు. 'ఇదండీ నా కథ' అనేది ఏజీకే ఆత్మకథ. అదే ఆయన చివరి రచన. అంచెలంచెలుగా ఎదుగుతూ యాడ్స్ రంగ దిగ్గజ వ్యక్తుల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్న కృష్ణమూర్తి తెలుగు, ఆంగ్లంలో 15కు పైగా పుస్తకాలు రచించారు. 2013లో ఇఫ్ యు కెన్ డ్రీమ్ పేరుతో తన ఆత్మకథను పుస్తక రూపంలో విడుదల చేశారు. ముద్రా కమ్యూనికేషన్స్ చైర్మన్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత ఎ.జి.కె. బ్రాండ్ కన్సల్టింగ్‌ను స్థాపించారు. కాలమిస్టుగా, రచయితగా ఆంగ్లంలోనూ, తెలుగులోనూ పలు వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు. ఆయన పుస్తకాలు అతి కొద్దికాలంలో పలు భారతీయ భాషల్లో ప్రచురింపబడి, ఎంతో మందికి స్ఫూర్తినిచ్చి ఒక కొత్త ఒరవడిని సృష్టించాయి. ఆయన 73వ యేట ఫిబ్రవరి 5, 2016న హైదరాబాదులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

చురకలు



## విద్యుత్తు వాహనాలు ఇక రయ్‌రయ్

చేగుంట : విద్యుత్తు వాహనాల(ఈవీ)తో పర్యావరణ పరిరక్షణే కాకుండా.. వాహనదారుల డబ్బులు ఆదా అవుతాయి. ఏడాదిగా వీటి కొనుగోళ్లు అధికమయ్యాయి. బైక్‌లు, కార్లు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్ల (పీసీఎస్) ఏర్పాటుకు కేంద్రం తోడ్పాటు అందిస్తోంది. జాతీయ, రాష్ట్ర రహదారులు, ప్రభుత్వ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్లలో నెలకొల్పేందుకు రాయితీ అవకాశం కల్పిస్తోంది.

**పెరుగుతున్న కొనుగోళ్లు**

పెట్రోల్, డిజిల్ వాహనాలతో ఆర్థిక భారం తప్పదు. ద్విచక్రవాహనాల్లో రూ.100 పెట్రోల్ పోసుకుని వెళితే 50 కి.మీ. నడుస్తుంది. కార్లకు కూడా ఎక్కువ మైలేజీ రాదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని చాలా మంది విద్యుత్తు వాహనాలనే కొంటున్నారు. వీరిలో అధికంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులే ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా రెండేళ్లలో 5 వేలకు పైగా




విద్యుత్తు వాహనాలు కొన్నారు.

**జాతీయ రహదారు, బస్టాండ్లలో**

మనోహరాబాద్, తూప్రాన్, మాసాయిపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట పరిధిలో 44వ జాతీయ రహదారి 55 కి.మీ. మేర విస్తరించి ఉంది. ఈ దారిలో పెట్రోల్‌బంక్‌లు, దాబాలతో పాటు చేగుంట ప్రయాణ ప్రాంగణం వద్ద 60 కిలోవాట్ల ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. త్వరలో ప్రారంభించే అవకాశం ఉంది. జాతీయ రహదారిపై ప్రయాణ సమయంలో పెట్రోల్ బంకులతో పాటు చేగుంట బస్టాండ్‌కు వచ్చినా ఛార్జింగ్ చేసుకుని ఎంచక్కా వెళ్లవచ్చు.

## పార్టీల్లో రెబెల్స్!

మెదక్ : మెదక్‌లో 16వ వార్డు నుంచి కాంగ్రెస్ నుంచి ముగ్గురు నామినేషన్లు వేశారు. వీరిలో ఒక్కరికే టికెట్ ఖరారు కానుంది. ఒకరు బీఫాం కోసం పార్టీ మారే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. 20వ వార్డులో భారాస నుంచి ఇద్దరు నామినేషన్లు వేశారు. ఇక్కడా అదే సమస్య. తూప్రాన్‌లోని అన్ని వార్డుల్లో ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. టికెట్ రాదని భావిస్తున్న వారంతా ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఆయా పార్టీల ప్రధాన నేతలతో అంతర్గతంగా మంతనాలు జరుపుతున్నారు.

నామినేషన్ల దాఖలు.. పరిశీలన ప్రక్రియ ముగిసినా ఇంకా అభ్యర్థులు ఎవరనేది తేలకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ప్రతి వార్డులో ఆశావహుల సంఖ్య పెరగడంతో తలనొప్పిగా మారింది. పార్టీనే అంటిపెట్టుకున్న నాయకులు కొందరు ఉండగా, టికెట్ వస్తుందనే ఆశతో మరికొందరు నామినేషన్లు వేశారు.

**వ్యూహాత్మకంగా అడుగులు..**

పోటీదారుల సంఖ్య పెరగడంతో ప్రధాన పార్టీల నాయకులు బీఫాం ఇచ్చే విషయంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. టికెట్



ఆశించిన వారు పార్టీ తరఫున, స్వతంత్రంగా రెండు, మూడు సెట్లు నామినేషన్లు వేశారు. మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ పురపాలికల్లో కాంగ్రెస్, భారాస, భాజపా, బీఎస్పీ, ఎంఐఎం, ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐతో పాటు ఇతర గుర్తింపు పొందిన పార్టీలు పోటీలో ఉన్నాయి.

**అవకాశాలిస్తామని హామీలు..**

ప్రధానంగా అధికార కాంగ్రెస్ తరఫున ఒక్కో వార్డులో ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరిలో ఒకరికి టికెట్ కేటాయించి, మిగతా వారిని తప్పించేందుకు నేతలు బుజ్జగింపులు మొదలుపెట్టారు. నామినేటెడ్ పదవులు ఇస్తామని, భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నారు. మెదక్‌లో 32 వార్డులకు అధికార కాంగ్రెస్ తరఫున 50 నామపత్రాలు దాఖలు కావడం గమనార్హం. రామాయంపేటలోనూ ఇదే పరిస్థితి. తూప్రాన్‌లో టికెట్ రాని వారు రెబెల్‌గా బరిలో దిగేందుకు సైతం వెనకాడటం లేదు. నర్సాపూర్‌లోని పలు వార్డుల్లో కొందరు తిరుగుబాటుదారులు నామినేషన్ వేశారు.

## గరిష్ఠ వేగం.. ప్రమాదాలు దూరం

కాచిగూడ : రైలు ప్రమాదాలు జరిగినపుడు ప్రమాద తీవ్రతను తగ్గించడానికి, మరణాలను నివారించడానికి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను వినియోగంలోకి తెస్తున్నారు. 1955లో ఏర్పాటు చేసిన చెన్నైకి చెందిన ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) 2022 వరకు 70 వేల బోగీలను తయారు చేసింది. వాటి స్థానంలో కొత్తగా లింక్ ఆఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లను వినియోగంలోకి తెస్తున్నారు. ఐసీఎఫ్ బోగీలు గంటకు 140 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో వెళితే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు గంటకు 200 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో వెళ్లగలవు. యాంటీ టెలిస్కోపిక్ డిజైన్, డిస్క్ బ్రేక్‌లు వంటి భద్రతా లక్షణాలతో ఐసీఎఫ్ బోగీలతో పోల్చుకుంటే ఎల్‌హెచ్‌బీ బోగీలు సురక్షితమైనవి. రైలు ప్రమాదం జరిగినపుడు ఎల్‌హెచ్‌బీ బోగీలు రెండో కోచ్‌లో చిక్కుకోవు. పల్టీలు కొట్టవు, పట్టాలు తప్పవు. వీటిని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేశారు. ఇంటీరియర్ అల్యూమినియంతో తయారు చేయబడ్డాయి. ఐసీఎఫ్ బోగీల స్థానంలో దశల వారీగా ఎల్‌హెచ్‌బీ బోగీలను వినియోగంలోకి తెస్తున్నారు.

## గంగనాల.. అడ్డంకులు తొలగితేనే గలగల



ఇబ్రహీంపట్నం : గలగల పారే గోదావరి నీటి ప్రవాహానికి కొన్నిచోట్ల బండరాళ్లు అడ్డుగా మారాయి. ఫలితంగా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గంగనాల ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో నీరు చేరడంలేదు. నీరు సాఫీగా వెళ్లక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలకు పూర్తిస్థాయిలో సాగు నీరందించడానికి నీటిపారుదలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఉన్నతాధికారులు రెండుసార్లు పరిశీలించి అవసరమైన కార్యాచరణ చేపట్టారు.

**ఆయకట్టు.. అటునుంచి చెరువులోకి**

వేములకుర్తి శివారులో గోదావరిపై 1956లో గంగనాల ప్రాజెక్టు నిర్మించారు. దీని కింద ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లోని పలు గ్రామాల ఆయకట్టుకు సాగు నీరందుతుంది. ఎస్సారెస్పీ నుంచి గోదావరి ద్వారా గంగనాల ప్రాజెక్టుకు నీరు చేరుతుండగా.. ఇక్కడినుంచి అయిదు కిలోమీటర్ల మేర వేములకుర్తి, యామాపూర్, ఫకీర్ కొండాపూర్ చెరువులోకి నీరు వెళుతుంది. అక్కడినుంచి మూడు కిలోమీటర్ల దూరంలో మల్లాపూర్ మండలం మొగిలిపేట పెద్ద చెరువులోకి తరలుతుంది. అనంతరం ఆరు కిలోమీటర్ల మేర ప్రవహించి ఒబులాపూర్, సంగెం శ్రీరాంపూర్, పాతదాంరాజ్‌పల్లి, కొత్తదాంరాజ్‌పల్లి, వాల్గొండ గ్రామాల్లోని ఆయకట్టుకు సాగు నీరందుతుంది.

**రెండు జిల్లాలను కలుపుతూ..**

గంగనాలకు ఎగువభాగంలో 1.5 కిలోమీటర్ల దూరంలో మూలరాంపూర్, నిర్మల్ జిల్లా పొన్కల్ గ్రామాలను కలుపుతూ గోదావరిపై సదర్మాట్ బ్యారేజీ నిర్మించారు. 1.58 టీఎంసీ నిల్వ సామర్థ్యంతో నిర్మించిన బ్యారేజీ నుంచి దిగువ భాగంలో సదర్మాట్ ప్రాజెక్టుకు 300 క్యూసెక్కులు, గంగనాలకు 100 క్యూసెక్కుల చొప్పున నీటిని తరలించాలని ప్రణాళిక రూపొందించారు.

**ముఖ్యమంత్రికి విజ్ఞప్తి**

నదిలో బండరాళ్లు సాగునీటి ప్రవాహంపై ప్రభావం చూపుతున్నాయని రైతులు చెబుతున్నారు. ముందున్న రైతుల పొలాలకు నీరు సరిగా అందక ఆందోళన చెందుతున్నారు. బ్యారేజీ నుంచి గంగనాల ప్రాజెక్టు వరకు గోదావరిలో పలు చోట్ల అడ్డంకులను తొలగించాలని రైతులు, ప్రజాప్రతినిధులు బ్యారేజీ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించగా.. పరిశీలించాలని అధికారులకు సూచించారు.

## కార్మిక ఓటే.. విజయ బాట



జగిత్యాల : జగిత్యాల, సిరిసిల్ల, కోరుట్ల, వేములవాడ, మెట్‌పల్లి, కరీంనగర్, రాయికల్, ధర్మపురి, పెద్దపల్లి, చొప్పదండి, రామగుండం తదితర పట్టణాల్లో బీడీ కార్మికుల సంఖ్య అధికంగా ఉంది. స్థానికంగా 44 బీడీ కంపెనీలుండటం.. ఇక్కడి పరిశ్రమ ప్రాధాన్యతను వెల్లడిస్తోంది. పొగాకు ఉత్పత్తిదారులు, తునికాకు సేకరించేవారు, బీడీలు చుట్టేవారు, ప్యాకర్లు, చాకర్లు, టేకేదార్లు, సిబ్బంది, బీడీల రవాణాదారులు, విక్రయదారులను కలుపుకొంటే దాదాపుగా 20కిపైగా రంగాలవారు ప్రత్యక్షంగా, పరోక్షంగా బీడీ తయారీతో ఉపాధి పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో తయారైన బీడీలు ఇతర రాష్ట్రాలకు కూడా వెళ్తుండటంతో.. ఇక్కడి కార్మికులు, పరిశ్రమ రంగంపై నాయకులు దృష్టి నిలిపారు.

**పింఛన్ల హామీతో ప్రచారం** పీఎఫ్ కటాఫ్ తేదీ నిబంధనతో ఆసరా పింఛన్లు రానివారికి పింఛన్లు ఇప్పిస్తామంటూ నేతలు హామీలిస్తున్నారు. జీఎస్టీ కారణంగా పనిరోజుల సంఖ్య తగ్గి బీడీ పరిశ్రమ కునారిల్లుతుండగా.. చాలా కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో తాము ఎన్నికైతే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన నిమిత్తం మహిళా సంఘాలను ఏర్పాటు చేయించి మెప్మా ద్వారా వ్యక్తిగత రుణాలను మంజూరు చేయిస్తామని పేర్కొంటున్నారు. వేల కుటుంబాలకు బీడీలే జీవనాధారం.

**ఉపాధి అవకాశాలే ధ్యేయం**

బీడీ కార్మికులకు నెలలో సగం రోజులు కూడా పని లభించని పరిస్థితి ఉంది. స్వయం ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరుతున్నారు. ప్రధాని ఆవాస్ యోజన ద్వారా 1.50 లక్షల రాయితీ, కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాల మంజూరు, కార్మిక ఆసుపత్రి ద్వారా వైద్య సేవలందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంద్వారా కార్మికులకు ఆసరాగా నిలుస్తాయి.

**అర్హులకు ఇప్పించాలి**

కేవలం నిజామాబాద్ జిల్లాలోనే పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి అందరికి పింఛన్లు ఇస్తున్నారు. మన జిల్లాలోనూ కార్మికులందరికి పింఛన్లు ఇస్తే ఆసరాగా ఉంటుంది. కార్మిక ఆసుపత్రిని విస్తరించాలి.

మంగ, జగిత్యాల

కనీసం 20 రోజులు పని కల్పించాలి

నెలలో 12 రోజులు కూడా పని దొరకడంలేదు. కనీసం 20 రోజులకుపైగా బీడీలు చుట్టే పని లభించేలా చర్యలు తీసుకోవాలి. పిల్లలకు ఉపకార వేతనాలు ఇవ్వాలి.

సుశీల, జగిత్యాల ఉమ్మడి జిల్లాలో మొత్తం కార్మికులు : 2.52 లక్షలు

ఆసరా పింఛన్లు పొందుతున్నవారు : 1.82 లక్షలు

పింఛన్లు రావాల్సిన కార్మికులు : 70 వేలు

## నియంత్రణలో నిర్లక్ష్యం.. భయాందోళనలో ప్రజలు



గోదావరిఖని : 'వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్సలు చేసే సదుపాయాలను పెంచుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు కథలు చెబుతున్నాయంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. వీధి కుక్కల కోసం షెల్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఫెన్సింగ్ వేసి జాతీయ రహదారులపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది.' నిత్యం నగరాలు, పట్టణాల్లో శునకాల దాడుల్లో పిల్లలు, పెద్దలు గాయాలపాలవుతున్నారు. న్యాయస్థానం సూచనల మేరకు గతంలో వీధి కుక్కలకు సంతానోత్పత్తి నిరోధక శస్త్రచికిత్సలు చేసి నగరంలో వదిలేశారు. నామమాత్రంగా ఒకటి, రెండు నెలలు శస్త్రచికిత్సలు నిర్వహించినప్పటికీ నిర్వహణ సంస్థకు బిల్లులు చెల్లించకపోవడంతో వదిలేశారు. పలుమార్లు టెండర్లు పిలిచినప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. రామగుండం నగరపాలికలోని కాలనీలు, వీధుల్లో శునకాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. శస్త్రచికిత్సలు చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నప్పటికీ స్పందన లభించడం లేదు. నగరపాలికలో ప్రతి నెలా సుమారుగా 150 నుంచి 200 మంది శునకాల దాడుల్లో గాయపడి గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో తీవ్రంగా గాయాలైన వారు దాదాపు 40 మంది వరకు ఉంటున్నారు. శునకాల దాడుల్లో చిన్న పిల్లలు ఎక్కువగా గాయాలపాలవుతున్నారు.

వీధి కుక్కలకు సంతానోత్పత్తి నిరోధక శస్త్రచికిత్సలు చేయించేందుకు మల్కాపూర్ శివారులో ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. నగరంలోని వీధి కుక్కలను పట్టుకెళ్లి అక్కడ శస్త్రచికిత్సలు చేసేవారు. తర్వాత వాటిని కాలనీల్లో వదిలేయడంతో గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. చిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. నిర్వహణ లేకపోవడంతో భవనం కిటికీలు చోరీకి గురయ్యాయి.

## పర్యవేక్షణ కరవు.. మొక్కలు కనిపించవు..

నిర్మల్ : నిర్మల్‌లోని కంచరోని కట్టపై ఒక వైపు భాగంలో పచ్చదనం పెంపునకు రక్షణగా జాలీలు అమర్చి అందమైన మొక్కలు నాటారు. మొక్కలు తొలగించి, రక్షణ కంచె నామరూపాల్లేకుండా చేసి కొందరు తమకు సంబంధించిన ఇసుక, కంకర నిల్వ చేసి వ్యాపారం చేస్తున్నారు. వాహనాలు అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. నిర్మల్– భైంసా ప్రధాన రహదారి మంజులాపూర్ శివారులో రెండేళ్ల క్రితం ఇరువైపులా మొక్కలు నాటారు. రక్షణగా కంచె ఏర్పాటు చేశారు. వాటిని పట్టించుకునే వారు లేక, నీళ్లు లేక మోడు వారి ఎండిపోయాయి. వన మహోత్సవంలో ఈ ఏడాది మరోసారి చదును చేసి మళ్లీ నాటారు. పర్యవేక్షణ లేక మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది.

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం వెల్లివిరియాలన్న ఉద్దేశంతో గత సర్కారు హరితహారం, ప్రస్తుత ప్రభుత్వం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. నర్సరీల్లో పెంచి ఆయా చోట్లలో నాటారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పెద్ద మొత్తంలో మొక్కలు నాటాలని



నిర?యించారు. కొన్నిచోట్ల నాటారు. ప్రస్తుతం ఎక్కడా వాటి జాడే లేకుండా పోయింది. జిల్లా కేంద్రంలో రెండేళ్లలో 75 వేలకుపైగా మొక్కలు రహదారుల పక్కన, విభాగినుల మధ్య నాటారు. ఒక్కో మొక్కకు వ్యయం రూ.25 వరకు అవుతుంది. వాటి పర్యవేక్షణ, నిర్వహణను పట్టించుకునే వారే లేకపోవడంతో మోడువారుతున్నాయి. కొన్ని చోట్ల ఏకంగా మైదానాలనే తలపిస్తున్నాయి. కొందరు మొక్కలు, జాలీలు తొలగించి మరీ స్థలాలను తమ వ్యాపారాలకు అనువుగా మార్చుకున్నారు. నిర్మల్– భైంసా మార్గంలోని విభాగిని మధ్యలోని మొక్కల పాదులు సైతం తీసిన దాఖలాలు లేకపోగా నీళ్లు ఇంకని పరిస్థితి. నీళ్లు లేక ఎండిపోతున్నాయి. నటరాజ్‌మిల్ ఎదుట ఇరువైపులా మొక్కలు చాలా బాగా పెరిగినా నీళ్లు లేక కొన్ని ఎండిపోతున్నాయి. కింది భాగంలో శుభ్రత లేక కళావిహీనంగా మారుతున్నాయి.

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను సంప్రదించగా మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కంచరోని చెరువు కట్టపై సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. మొక్కలకు నీళ్లు పట్టించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

## తండాలకు వెళ్లాలంటే తండ్లాట

సంగారెడ్డి : ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా కంగ్టి నుంచి పొట్‌పల్లి తండా మీదుగా సిర్గాపూర్‌కు వెళ్లే మార్గాన్ని తారు రోడ్డుగా మార్చేందుకు 2021–22లో రూ.4.37 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఆ దారిపై కంకర పరిచి వదిలేశారు. ఇప్పటికీ తారు పనులు పూర్తి చేయలేదు. ఆ మార్గంలో వెళ్లే తండాలు, గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నాగల్‌గిద్ద నుంచి కరాస్‌గుత్తి మీదుగా కరా?టక సరిహద్దుకు చేరుకోవడానికి ఆ దారిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.20 కోట్ల నిధులు కేటాయించింది. పిల్లర్ల నిర్మాణం చేపట్టి పనులను అసంపూర్తిగా వదిలేశారు. చేపట్టిన పనులు నాణ్యతగా లేవని అధికారులు నిర్ధారించారు.

ఈ రెండు పనులే కాదు.. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా జిల్లాలో చేపట్టిన పలు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

రూ.106 కోట్ల నిధులు మంజూరు

మారుమూల తండాల నుంచి జిల్లా, మండల కేంద్రాలకు చేరుకునేలా రహదారుల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజలకు రవాణా మార్గం సాఫీగా సాగడానికి రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తోంది. పనులు దక్కించుకున్న గుత్తేదార్లు అసంపూర్తిగా వదిలేయడంతో.. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నప్పటికీ.. కొన్ని చోట్ల ఇంకా పనులు ఆరంభించలేదు. జిల్లాకు పీఎంజీఎస్‌వై ద్వారా 2021, 2022, 2023 సంవత్సరాల్లో 29 పనులు మంజూరు చేసి.. రూ.106 కోట్లు మంజూరు చేశారు. అందులో 16 చోట్ల మాత్రమే పూర్తి చేశారు. ఎనిమిది పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన ఐదు చోట్ల తట్టెడు మట్టి కూడా తీయలేదు. ఏళ్లుగా తాత్సారం సాగుతోంది. ఆయా పనులకు ఎప్పుడు మోక్షం లభిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. పనులను వేగవంతం చేస్తామని పీఆర్ ఈఈ యుగంధర్ తెలిపారు.

జిల్లాలో పీఎంజీఎస్‌వై పనులిలా..

మంజూరైనవి... 29

నిధుల అంచనా: రూ:106 కోట్లు

పూర్తయినవి: 16

ఇప్పటి వరకు వ్యయం: రూ.53.27 కోట్లు

ప్రగతిలో ఉన్నవి: 8

ఆరంభించనివి: 5

## మూడో విడత.. ఫలితం ఎటువైపో..!

నర్సాపూర్: జిల్లాలో మొదటి, రెండు విడత పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి. ఫలితాలు ఇటు అధికార కాంగ్రెస్, అటు ప్రతిపక్ష భారాస పార్టీలకు ఉత్కంఠ కలిగించాయి. ఇక రేపు మూడో విడత పోలింగ్ నర్సాపూర్ నియోజకవర్గంలో జరుగనున్న నేపథ్యంలో అందరి చూపు దీనిపైనే ఉంది. తొలి విడతలో కాంగ్రెస్ ప్రభంజనం కనిపించగా, రెండో విడతలో కాస్త తగ్గింది. భారాస పుంజుకుంది. 161 గ్రామాల్లో.. నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట, వెల్దుర్తి, కొల్చారం, మాసాయిపేట, చిలప్‌చెడ్ మండలాల్లో పల్లె పోరు జరుగనుంది. మొత్తం 183 పంచాయతీలు ఉండగా, 22 గ్రామాల్లో సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా 161 పంచాయతీల్లో పోలింగ్ ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ఆయా చోట్ల ఎవరికి వారే తమ పార్టీ మద్దతుదారులు గెలుస్తారంటూ లెక్కలు వేసుకుంటున్నారు. సొంత మండలాలపై దృష్టి.. ఎమ్మెల్యే సునీతారెడ్డి తన సొంత మండలం శివ్వంపేటపై ప్రత్యేక దృష్టిపెట్టారు. మొత్తం 37 పంచాయతీలు ఉండగా, 3 ఏకగ్రీవం అయ్యాయి. అత్యధిక స్థానాల్లో తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. : మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సుహాసినిరెడ్డి సొంత మండలం కౌడిపల్లిలో కాంగ్రెస్ మద్దతుదారుల తరఫున విస్తృతంగా పర్యటిస్తున్నారు. : డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ సొంత మండలం నర్సాపూర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెల్దుర్తి ఉమ్మడి మండలంపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ నర్సాపూర్‌లో పావులు కదుపుతున్నారు. ఇప్పటి వరకు ఫలితాలు.. తొలి విడత రెండో..

చురకలు



# 'అంటు'కుంది.. ఉపాధి!

కూసుమంచి : కూసుమంచి మండలం లోక్యాతండాకు చెందిన పలువురు యువకులు గతంలో ఉపాధి కోసం వలస వెళ్లేవారు. రాజమహేంద్రవరం,కడియంలో మామిడి మొక్కలను అంటుకట్టే కూలీ పనులు చేసేవారు. స్వగ్రామంలో మామిడి అంటు మొక్కల నర్సరీలు ఏర్పాటుచేస్తే లాభసాటిగా ఉండటంతో పాటు వందలాది మందికి ఉపాధి కల్పించవచ్చునని భావించారు. సుమారు 15ఏళ్ల క్రితం పది మంది యువకులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. వీరిని చూసి ఇంకొందరు ముందుకొచ్చారు. ఇప్పుడు లోక్యాతండాలో సుమారు 60 నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి నాణ్యమైన అంటు మొక్కలు ఎగుమతి అవుతున్నాయి.

**ఏప్రిల్ నుంచి పనులు**

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో మామిడి టెంకలను ఏప్రిల్‌లో సేకరిస్తారు. ఆయా జిల్లాల్లో ఆంచూర్ కోసం మామిడి వినియోగం ఎక్కువ. అందుకే అక్కడ టెంకలు విరివిగా లభిస్తాయి. లక్ష మొక్కలు పెంచాలనుకునే నర్సరీ నిర్వాహకులు రెండు లక్షల టెంకలు సేకరిస్తారు. నర్సరీలకు చేరిన నాణ్యమైన మట్టిని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతారు. ప్రతి పాకెట్‌కు 70 పైసల చొప్పున కూలీలకు



చెల్లిస్తారు. లక్ష మొక్కల నర్సరీ ద్వారా కూలీలకు రూ.70వేలు సమకూరుతాయి. పాకెట్లు నింపుతున్న కూలీలకు ఎరువు కలిపిన మట్టిని చేరవేసేందుకు పురుషులను నియమిస్తారు. ఒక్కొక్కరికి రూ.800 చొప్పున రూ.20వేలు వెచ్చిస్తారు.

అంటుకట్టేందుకు (గ్రాఫ్టింగ్) నిపుణులకు ప్రతి మొక్కకు రూ.2 చొప్పున నిర్వాహకులు చెల్లిస్తారు. ఈరకంగా రూ.2లక్షలు ఖర్చవుతాయి. కలుపు తీసేందుకు పది మంది చొప్పున కనీసం పది రోజుల పాటు కూలీలు అవసరం. వీరికి రూ.50వేలు చెల్లిస్తారు.

టెంకల శుద్ధి, మట్టి నింపిన సంచుల్లో టెంకలు నాటేందుకు 50 పైసల చొప్పున ఖర్చవుతుంది. తద్వారా రూ.50వేలు కూలీలకు చేరుతాయి. నాణ్యమైన మొక్కలు ఎంపిక (గ్రేడింగ్) చేసి అంటుకడతారు. డిసెంబర్ చివరి నాటికి అంటు మొక్కలను లారీల్లో ఎగుమతి చేస్తారు. 60 పైసల చొప్పున లక్ష మొక్కల ఎగుమతికి రూ.60వేలు చెల్లిస్తారు. టెంకల సేకరణ నుంచి మొక్కల ఎగుమతి వరకు లక్ష మొక్కల నర్సరీకి సుమారు రూ.16-18లక్షలు పెట్టుబడి పెడతారు.

ఖర్చులు పోనూ తొమ్మిది నెలలకు సుమారు రూ.6లక్షలకు పైగా ఆదాయం సముపార్జిస్తారు. ఈసారి అధిక వర్షాలతో ఆదాయం రూ.5లక్షల వరకు పరిమితమవుతోందని సమాచారం. ప్రతి సీజన్‌లో సుమారు 2వేల మందికి లోక్యాతండాలో ఉపాధి లభిస్తుండటం గమనార్హం. సుమారు లక్ష మొక్కలు పెంచే నిర్వాహకులు రూ.5.50 లక్షల వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. లోక్యాతండా, సమీప గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది కూలీలు వస్తుంటారు.

వడ్తియా ధర్మా, నర్సరీ నిర్వాహకుడు

# టెండర్లకు అనూహ్య స్పందన

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థ ఖమ్మం విజయడెయిరీ నూతన దుకాణాల సముదాయానికి అనూహ్య స్పందన లభించింది. మొత్తం పది దుకాణాలకు సంబంధించి టెండరు ప్రక్రియ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, టెండరు దరఖాస్తుదారులు పాల్గొన్నారు. మొత్తం పది దుకాణాలకు గానూ 39 దరఖాస్తులు విక్రయించగా.. 33 మంది పాల్గొన్నారు. ఆరుగురు పాల్గొనలేదు. గత అక్టోబరు 30న అధికారులు టెండరు ప్రకటన విడుదల చేశారు. టెండరు ఫారం ధర రూ.1,000గా నిర్ణయించారు. ఈనెల 25 టెండరు గడువు పూర్తి కాగా ఒక రోజు ముందు వరకు కేవలం 8 మంది దాఖలు చేయగా.. చివరి రోజు 25 మంది పాల్గొన్నారు.

**ఊహించని రీతిలో..**

ఒక్కో దుకాణానికి నెలకు రూ.15వేల అద్దెతో పాటు ఈఎండీ రూ.20వేలు, సెక్యూరిటీ డిపాజిట్లు రూ.2లక్షల చొప్పున నిర్ణయించారు. అధికారులే ఆశ్చర్యపోయే విధంగా ఊహించని రీతిలో ఒక్కో దుకాణానికి గరిష్ఠంగా రూ.29,100, కనిష్ఠంగా రూ.17,800 చొప్పున దరఖాస్తుదారులు కోట్ చేయటం విశేషం. ఒకటో నంబరు దుకాణానికి అత్యధిక అద్దె కోట్ చేశారు. ప్రధాన రోడ్డు పక్కనే ఉ



ండటంతో ఇక్కడ ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని టెండరుదారులు పోటీపడి మొత్తం పది దుకాణాలకు కూడా నిర్ణయించిన దానికంటే ఎక్కువ అద్దెను కోట్ చేశారు. ఈ లెక్కన ఏడాదికి దుకాణాల సముదాయం ద్వారా రూ.2లక్షల వరకు డెయిరీకి ఆదాయం సమకూరనుంది. సెక్యూరిటీ డిపాజిట్ రూ.20లక్షల వరకు సంస్థలో నిల్వ ఉంటోంది.

**మంత్రి తుమ్మల ఆదేశాలతో..**

వాస్తవానికి దుకాణాలు నిర్మించి మూడు సంవత్సరాలు గడిచింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఖాళీగా ఉంటున్నాయి. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డెయిరీని సందర్శించిన సమయంలో దుకాణాలు ప్రారంభించని విషయం ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించడంతో పూర్తి చేశారు.

టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. పది దుకాణాల ద్వారా ప్రతి నెలా డెయిరీకి ఆదాయం వస్తుంది. జిల్లాలో పాల సేకరణ, పాల అమ్మకాలను పెంచటంతో పాటు రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తాం.

కె.రవికుమార్, డెయిరీ ఉపసంచాలకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా

# జేఎన్‌టీయూ భూముల రిజిస్ట్రేషన్ ఎప్పుడో..?



హైదరాబాద్ : కూకట్‌పల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(జేఎన్‌టీయూ) కొనసాగుతున్న భూముల ను.. ఆ యూనివర్సిటీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించేందుకు అడ్డంకులు కొనసాగుతూనే ఉన్నాయి. ఐదు దశాబ్దాల క్రితం జేఎన్‌టీయూ వర్సిటీ నిర్మించేప్పుడు హౌసింగ్‌బోర్డుకు చెందిన 90 ఎకరాలను ఏటా లీజు చెల్లించాలన్న షరతుపై వర్సిటీకి ఇచ్చారు. నాలుగైదేళ్ల తర్వాత యూనివర్సిటీ పేరుమీద రిజిస్టర్ చేయిస్తామని అప్పట్లో ప్రభుత్వం చెప్పడంతో క్రమం తప్పకుండా లీజు సొమ్ము చెల్లిస్తున్నారు. అనంతరం అధికారులు రిజిస్ట్రేషన్ చేయించకపోవడం, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక హౌసింగ్‌బోర్డు విడిపోవడం వంటి కారణాలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. జేఎన్‌టీయూ అధికారులు లీజు రూపేణా రూ.90 కోట్లకుపైగా చెల్లించారు. ఈ విషయాన్ని మే నెలలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి అధికారులు తీసుకెళ్లగా... ఒకటి, రెండు నెలల్లో సమస్య పరిష్కరిస్తామంటూ హామీనిచ్చినా నేటికీ దస్త్రాలు కదల్లేదు.

ఆస్తిపన్ను సైతం.. జేఎన్‌టీయూ అధికారులు ప్రభుత్వానికి లీజు చెల్లిస్తుండడంతో 90 ఎకరాల భూముల్లో కిరాయికి ఉంటున్నట్టే. వర్సిటీకి సొంత భూములు లేనందున భవనాలు, నిర్మాణాలు, ప్రయోగశాలలకు జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను విధిస్తోంది. తద్వారా ఏటా లీజు రుసుంతో పాటు రూ.4కోట్ల మేరకు ఆస్తిపన్నును చెల్లిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులూ వస్తాయ్..

రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించకపోవడం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో జేఎన్‌టీయూలో పరిశోధనలకు, ప్రయోగశాలలకు నిధులు కేటాయించలేకపోతున్నారు. పరిశోధనలు, అభివృద్ధి రంగాల్లో ప్రతిభను ప్రదర్శిస్తే కేంద్రంనుంచి నిధులు వచ్చేందుకు అవకాశాలున్నాయి. వీటన్నింటికీ ఏకైక పరిష్కారం జేఎన్‌టీయూకు భూములు రిజిస్ట్రేషన్ చేయించడమేనని వర్సిటీ మాజీ ఆచార్యులు చెబుతున్నారు.

# పన్ను కట్టని ఐదంతస్తుల భవనాలెన్ని?



హైదరాబాద్: ప్రధాన నగరం నుంచి శివారు వరకు.. పన్ను పరిధిలో లేని జీం5 భవనాలను గుర్తించి వారం రోజుల్లో వాటికి ఆస్తిపన్ను మదింపు చేయాలని జీహెచ్‌ఎంసీ కీలక ఆదేశాలు జారీ చేసింది. పన్ను మదింపు నిరంతర ప్రక్రియ అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాలతో కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఐదంతస్తుల భవనాలపై ప్రత్యేకంగా ఆదేశాలిచ్చారు. నాలుగంతస్తుల వరకు పేద, మధ్య తరగతి కుటుంబాలు నిర్మించుకుంటాయని, వాటిని తనిఖీల నుంచి మినహాయించినట్లు యంత్రాంగం చెబుతోంది. ఐదంతస్తుల భవనాల మదింపు తర్వాతి దశల్లో ఆరు, ఏడు అంతకు మించి అంతస్తుల భవనాల్లో పన్ను మదింపు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**మార్గదర్శకాలు ఇవీ..**

బిల్‌కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల సాయంతో పన్ను పరిధిలో లేని ఐదంతస్తుల భవనాలను గుర్తించి వాటిలో ఇళ్లున్నాయా, వ్యాపార కేంద్రాలు నడుస్తున్నాయో తెలుసుకోవాలని గ్రేటర్ పరిధిలోని 60 సర్కిళ్ల ఉపకమిషనర్లను ఆదేశించారు.ః ఆయా భవనాలన్నింటికీ వినియోగంలోకి వచ్చినప్పటి నుంచి పన్ను వేయాలి.

రోజువారీ వివరాలను డిజిటల్ డాక్యుమెంట్‌లో నమోదు చేయాలి.

**సెల్‌ఫోన్ నంబరుతో అనుసంధానం..**

ఆస్తిపన్ను వివరాలతో యజమాని సెల్‌ఫోన్ నంబరును తప్పనిసరిగా అనుసంధానం చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని ఆస్తిపన్ను వివరాలను చక్కదిద్దాలని రెవెన్యూ విభాగం అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. గ్రేటర్‌లో విలీనమైన 7లక్షల నిర్మాణాల్లో 50శాతం, ప్రధాన నగరంలోనూ 30శాతం అనుసంధానం కాలేదని అధికారులు గుర్తించారు.

**శివారుకూ ఆన్‌లైన్ సేవలు..**

గ్రేటర్‌లో విలీనమైన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలోని ప్రజలు కొత్త ఇంటి నంబరు జారీ, పన్ను సవరణ, మ్యుటేషన్, ఆస్తిపన్నుకు సంబంధించిన సేవలను ఆన్‌లైన్‌లో పొందవచ్చని కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ లేదా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

# అత్యవసరంలో పడకల కొరత




హైదరాబాద్-: ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర విభాగాల వద్ద తీవ్ర రద్దీ నెలకొంటోంది. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యాయత్నాలు, కాలిన గాయాలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి రిఫరల్‌గా వచ్చే కేసులను తొలుత అత్యవసర విభాగంలో చికిత్స అందించాక సంబంధిత విభాగాలకు తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో కొన్నిసార్లు 24-48 గంటలు అత్యవసర విభాగంలోనే చికిత్స అందించాల్సి ఉంటుంది. తర్వాత వచ్చే రోగులకు పడకలు సర్దుబాటు కావడం లేదు. నిమ్స్‌తోపాటు గాంధీ, ఉస్మానియాల్లో నిత్యం ఇదే పరిస్థితి ఉంటోంది.

ఇదీ తీరు... నిమ్స్‌లోని అత్యవసర విభాగంలో 100 వెంటిలేటర్ పడకలున్నాయి. ఇందులో 5-10% నిత్యం రిపేర్లలో ఉంటున్నాయి. మిగతావి ఎప్పుడూ రద్దీగానే కన్పిస్తుంటాయి. ఇక్కడ వెంటిలేటర్ కావాలంటే రాజకీయ, అధికార ప్రముఖులతో పైరవీలు చేయాల్సి వస్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఆరోగ్య బీమా లేదంటే రోగులవద్ద డబ్బంతా అయిపోయాక... ఇంకా వైద్యం చేయాల్సి రావడం వల్ల కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు మెల్లగా రోగులను వదిలించుకుంటాయి.

కొన్నిసార్లు అక్కడ ఖర్చు భరించలేక రోగులే స్వయంగా డిశ్చార్జి అయి నిమ్స్‌లో చేరుతుంటారు. ఉస్మానియా, గాంధీలో ఇందుకు భిన్నంగా లేదు. గాంధీలో 36, ఉస్మానియాలో 20 పడకలు అత్యవసర విభాగంలో ఉన్నాయి.

**ఎందుకిలా...** అత్యవసర విభాగానికి వచ్చే కేసులను వైద్యులు పరిశీలించాక వేరే విభాగాలకు తరలించాలి. ఈ ప్రక్రియ సాగాలంటే సరిపడా వైద్య నిపుణులతోపాటు ఇతర అత్యవసర సేవలు అందాలి. బాధితులు, క్షతగాత్రుల పరిస్థితి నిలకడగా అయ్యేవరకు కదిలించే పరిస్థితి ఉండదు. కాబట్టి తర్వాత వచ్చేవారు నిరీక్షించాలి. కొన్నిసార్లు అంబులెన్సుల్లోనే ఐదారు గంటలపాటు నిరీక్షిస్తున్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు రోగుల మరణాల తమవద్ద నమోదు కాకూడదనే ఉద్దేశంతో విషమపరిస్థితికి చేరాకే గాంధీ, ఉస్మానియాలకు పంపుతున్నారు.

# కార్యాలయమా.. కార్ల కార్ఖానానా..?



హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలోని మెహిదీపట్నం విద్యుత్తు డివిజన్ కార్యాలయమిది. పక్కనే విద్యుత్తు ఉపకేంద్రం ఉంది. ఎంతోకాలంగా ఇక్కడ కొన్ని పాతకార్లను నిలిపి ఉంచుతున్నారు. దుమ్ము పట్టిన తీరు చూస్తుంటే నెలల తరబడి ఉన్నట్లున్నాయి. ఇవి విద్యుత్తు సంస్థవి కావు. పదవీ విరమణ చేసిన ఒక ఉద్యోగి తన ఇంట్లో జాగా లేదని కాలం చెల్లిన వాహనాలకు కార్యాలయాన్ని పార్కింగ్ ప్రదేశంగా వాడుకుంటున్నారు. 3 నెలల క్రితం మెట్రోజోన్ చీఫ్ ఇంజినీర్ ఈ కార్యాలయానికి వచ్చినప్పుడు అపరిశుభ్రంగా ఉన్న కార్యాలయం పరిసరాలు, పార్క్ చేసి ఉన్న పాడైన వాహనాలపై ఆరా తీసినప్పుడు విశ్రాంత ఉద్యోగిదని తెలిసింది. వెంటనే తొలగించాలని ఆదేశించారు. స్పందనే లేదు. పక్కనే రంగారెడ్డి, సైబర్‌సిటీ సర్కిల్ కార్యాలయాలున్నాయి. కార్యాలయం చెత్తను పక్కనే ఉన్న ఉపకేంద్రంలో పడేస్తున్నారు. పొరపాటున మంటలు అంటుకుంటే పెద్ద ప్రమాదం తప్పదు.

# ఎవరి వ్యూహం వారిదే..!

కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మున్సిపల్ ఎన్నికల వేడి రాజుకుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, భారాస, భాజపా తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఓవైపు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసుల నేపథ్యంలో భారాస శ్రేణులు నిరసనల్లో, మరోవైపు అధికార పార్టీ వ్యూహాత్మక సమావేశాలతో మునిగిపోయారు. నామపత్రాల ఉపసంహరణ గడువు సమీపిస్తుండటంతో అభ్యర్థులను ఖరారు చేయడం అధికార, ప్రతిపక్ష పార్టీలకు తలనొప్పిగా మారుతోంది.

**హస్తం శ్రేణుల గెలుపు వ్యూహాలు..**

మున్సిపల్ పీఠాలపై జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా సంస్థాగత బలంపై దృష్టిపెట్టింది. మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, ఏదులాపురం పురపాలికలు, కొత్తగూడెం నగరపాలికలో మున్సిపల్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ మంత్రి కొండా సురేఖ ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. ఆయా పట్టణాల్లోని వార్డు ఇన్‌ఛార్జిలతో భేటీ అయ్యారు. క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రభావితం చేసే బాధ్యతలను వారికి అప్పగిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా మార్గనిర్దేశం చేశారు. కొత్తగూడెం నగరపాలిక, ఏదులాపురం పురపాలికలో కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తుల విషయంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. ఇరు పార్టీలు వారే ప్రచారం చేసుకోవడం దీనికి బలం చేకూర్చుతోంది.

**నిరసనల గళం.. ఫలించేనా?**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు రావడంపై పార్టీ శ్రేణులు ఉభయ జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. కొత్తగూడెంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బైక్ ర్యాలీ నిర్వహించి బలం చాటుకునే ప్రయత్నం చేశారు. ఏదులాపురంలో కందాళ ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నిరసన తెలిపారు. ఎన్నికల ప్రచారానికి అనుకూలంగా మలుచుకోవాలనే వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందో వేచిచూడాలి. ఇంకోపక్క ఇద్దరు ముగ్గురు నామినేషన్లు వేసిన చోట బుజ్జగించే ప్రయత్నాల్లో ఉన్నారు.



భాజపా ఈసారి ఎలాగైనా ఉభయ జిల్లాల్లో బోణి కొట్టాలని ప్రణాళికలు రచిస్తోంది. కొత్తగూడెం నగరపాలికలో 57 డివిజన్లలో పోటీ చేస్తున్నారు. మూడుచోట్ల స్వతంత్రులకు మద్దతు తెలుపుతున్నారు. పట్టణ ఓటర్లు భాజపాకు పట్టం కడతారనే నమ్మకంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

**కొలిక్కిరాని ఖరారు**

నామినేషన్ల ఉపసంహరణ గడువు దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీలకు 'రెబల్స్' అభ్యర్థుల భయం పట్టుకుంది. టికెట్ రానివారు స్వతంత్రులుగా బరిలో నిలిస్తే ఓట్లు చీలి పార్టీకి నష్టం జరుగుతుందని, అసంతృప్తులకు భవిష్యత్తులో తగిన ప్రాధాన్యం ఇస్తామనే హామీలతో శాంతింపజేసేందుకు సీనియర్ నేతలు రంగంలోకి దిగుతున్నారు. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు కొందరు బీ-ఫామ్‌లతో సంబంధం లేకుండా ప్రచారంలో దూసుకుపోతుండటం ఇబ్బందికరంగా మారుతోంది. స్క్రీనింగ్ కమిటీల ద్వారా కాంగ్రెస్, సర్వేల ద్వారా భారాస తమ అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.

# సంపదకు ఆపద

నల్గొండ : సంపద వనాల్లో మొక్కల జాడ కనిపించడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం నీరుగారుతోంది. జలవనరుల శాఖకు చెందిన విలువైన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఉండటానికి, ఆదాయం సమకూరే విధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మిగులు స్థలాలు, జలాశయాల కింద సంపద వనాలను ఏర్పాటు చేశారు. మూడు జిల్లాలోని 19 ప్రాంతాల్లోని వంద ఎకరాల విస్తీర్ణంలో వీటిని ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. అయితే నిర్వహణ కొరవడటంతో గడ్డి, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి.

**లక్ష్యం గొప్పదే:** నల్గొండ జిల్లాలో నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో 2, కొండపాకలో 1, కనగల్ మండలం జి.ఎడవెల్లిలో 1, పెద్దవూర మండలం చలకుర్తిలో 3, సాగర్ తిరుమలగిరి మండలం అల్వాలలో 1, గుర్రంపోడు మండలం తాందార్‌పల్లిలో 1, అనుముల, నిడమనూరు, త్రిపురారంలో ఒకొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. కనగల్ మండలంలో ఏఎమ్మార్పీ ప్రాజెక్టు వారు 53 ఎకరాల భూమిని సేకరించారు. మరోవైపు అదే భూమిలో కొందరు రైతులు పట్టాలు పొందారు. ఆ తర్వాత అధికారులు రైతుల పట్టాలను రద్దుచేసి సంపదవనానికి కేటాయించారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులు సంపదవనం భూములను వశపర్చుకొని అందులో ఉన్న మొక్కలను తొలగించడంతో ప్రస్తుతం అక్కడ మొక్కలు కనిపించడం లేదు. మిగతా ప్రాంతాల్లోనూ జలవనరులశాఖ విలువైన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఉండటానికి ప్రభుత్వం దృష్టిసారించడంతో అధికారులు సంపద వనాలు పెంచాలని నిర్ణయించారు.

**ఎండిపోయి:** అధికారుల పర్యవేక్షణ లోపం, నాటిన మొక్కల గురించి పట్టించుకోకపోవడంతో సంపద వనాల్లో పండ్ల మొక్కలు ఎండిపోయి పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగింది. ఎండిపోయిన మొక్కల స్థానాల్లో వేరే వాటిని నాటకుండా వదిలేశారు. పిచ్చి మొక్కలు పెరిగినా వాటిని తొలగించడం లేదు. దీంతో అధికంగా సంపద మొక్కలు ఎండిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**ఆహ్లాదంతోపాటు ఆదాయం:** మొక్కలు నాటడం వల్ల జలాశయ పరిసర ప్రాంతాలు, నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో పచ్చదనం సంతరించుకోవడంతో పాటు అక్కడికి వచ్చే సందర్శకులకు ఆహ్లాదం పంచుతుందని, పండ్ల మొక్కలతో సంపద సమకూరుతుందని అధికారులు భావించారు. ఇందులో భాగంగా జలవనరుల శాఖకు చెందిన స్థలాలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఈజీఎస్ అధికారులకు నివేదిక ఇచ్చారు.

## ఇచ్చుకో.. కట్టుకో.. ఇక కుదరదు

హైదరాబాద్: ఇల్లు నిర్మిస్తే.. ఆ దారి నిండా ఇటుక, ఇసుక, మట్టి వేయడం.. ఆ ప్రాంత అధికారికి అంతోఇంతో ఇచ్చేసి జబర్దస్త్ చేయడం.. కాలనీవాసులు గట్టిగా అడిగితే బెదిరించడం ఇక కుదరదు. ఏకంగా జీహెచ్ఎంసీ చట్ట సవరణకు ప్రతిపాదనలు చేసింది. రేపోమాపో ఆదేశాలు రానున్నాయి.

లక్ష్యం నగరంలో రహదారి కాలుష్యాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లపై ఇసుక, ఇటుకలు, మట్టి వంటి నిర్మాణ సామగ్రిని వేయడం, విక్రయించడంపై నిషేధం విధించేందుకు రంగం సిద్ధం చేసింది. భారీ జరిమానాలు విధించడం, ఉల్లంఘనులకు ఏడాది జైలుశిక్ష పడేట్టు జీహెచ్ఎంసీ చట్టంలో సవరణలు రాబోతున్నాయి.

**ప్రతిపాదనలు ఇలా..**

జీహెచ్ఎంసీ చట్టంలోని ఆర్టికల్ 112(2), (3,), (20), (25), ఆర్టికల్



115(39) ప్రకారం.. జులై 15, 2025న అప్పటి పురపాలకశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రా కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు సమావేశమై.. చేర్పులు, మార్పులపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. రహదారులు, రద్దీ ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులు చెత్త పడేసేందుకు చిన్న డబ్బాలను ఏర్పాటు చేయడం, వ్యర్థాల నిల్వకు తాత్కాలిక ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను అందుబాటులోకి తేవడం, చెత్త నిర్వహణ కేంద్రాలను పెంచనున్నారు.

ఇసుక, ఇటుకలు, కంకర, మట్టి, ఇతర నిర్మాణ సామగ్రిని రహదారులు, కాలిబాటలపై అమ్మడాన్ని నిషేధిస్తున్నారు.

భవన నిర్మాణానికి సంబంధించిన వ్యర్థాలను అనధికారికంగా తరలించడం, ఇష్టానుసారం డంపింగ్ చేయడంపై నిషేధం ఉంటుంది. నిర్మాణ వ్యర్థాలను జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా తరలించే వాహనాలకు మొదటి తప్పుగా రూ.లక్ష జరిమానా. ఒక వేళ ఆ వ్యర్థాలను నాలాలు, చెరువులు, రోడ్లు, కాలిబాటలు, ప్రజలు తిరిగే చోట పడేస్తే.. రెట్టింపు జరిమానా విధిస్తారు.

రెండు, అంతకు మించి తప్పిదాలకు పాల్పడితే రూ. 5లక్షల జరిమానా, ఏడాది వరకు జైలు శిక్ష ఉండేలా సవరణ చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ వెలుపల కూడా వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునే అధికారాన్ని కార్పొరేషన్‌కు కల్పిస్తారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువుల విక్రయం, వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ సెక్షన్ 487-ఏను జీహెచ్ఎంసీ చట్టంలో చేర్చనున్నారు.

## ఆయనదే 'గుత్తా'ధిపత్యం!

హైదరాబాద్ : శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఎంటమాలజీ విభాగంలో ఒప్పంద కార్మికుల సరఫరా కోసం టెండర్ పిలిచారు. నలుగురు గుత్తేదారులు పోటీపడ్డారు. 15శాతం నుంచి 24 శాతం వరకు తక్కువ ధరలకు టెండర్‌లు దాఖలు చేశారు. ఒక గుత్తేదారు మాత్రం నామమాత్రంగా తక్కువ ధరకు టెండర్ వేశారు. మిగిలిన గుత్తేదారులపై అనర్హత వేటు వేసేందుకు ఉన్నత స్థాయిలో పైరవీలు జరుగుతున్నాయి. తనకే టెండర్ దక్కేలా చక్రం తిప్పుతున్నారు.


జీహెచ్ఎంసీలో ఎక్కడైనా సరే ఆయన టెండర్ వేస్తే దక్కాల్సిందే. ఉన్నత స్థాయి అధికారులు సైతం అతనికే మొగ్గు చూపుతున్నారు. అతని కోసం జోన్‌కొక నిబంధన పెడుతున్నారు. ప్రధాన కార్యాలయంలోని ఓ సీఈ స్థాయి అధికారి అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఇటీవల గుత్తేదారులంతా ఆయనపై ఫిర్యాదు చేశారు. 'ఈ ఒక్కసారికి వదిలేయండి..' అంటూ ఆ అధికారి గుత్తేదారులకు నచ్చజెప్పారంటే.. పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

భారీ నజరానాలు..

ప్రధానంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్ జోన్లలో ఆ గుత్తేదారుదే హవా. ఒక్క పాతబస్తీ జోలికి మాత్రం వెళ్లడం లేదు. టెండర్లన్నీ ఎక్సెస్‌కు (అధిక రేట్లకు) దక్కించుకుంటున్నారు. అధికారులకు నజరానాలు ఇస్తున్నాడు.

ఆ గుత్తేదారు ఓ పేరుతో సంస్థను స్థాపించారు. ఓ మహిళను భాగస్వామిగా చేర్చుకొని వ్యక్తిగత పాన్‌కార్డును జత పరుస్తున్నారు. సంస్థ పాన్‌కార్డు అయితే.. 1శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యక్తిగత పాన్‌కార్డుతో0.5శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఆ విధంగా రూ.కోట్లలో పన్ను ఎగవేస్తున్నారు.

ప్రధాన కార్యాలయంలో ఉండే ఓ చీఫ్ అధికారి పూర్తిస్థాయి సహకారం ఉంది. టెండర్లలో మతలబులు సృష్టించి మిగిలిన వారిపై అనర్హత



వేటు వేసే పని ఆయన తీసుకుంటున్నారు.

జోనుకో నిబంధన..!

ఖైరతాబాద్ జోన్ పరిధిలో టెండర్లకు టర్నోవర్ మెలిక పెట్టి చిన్న గుత్తేదారులపై అనర్హత వేటు వేయించారు. మిగిలిన ప్రాంతాల్లో దీన్ని అమలు చేయలేదు.

ఎల్‌బీనగర్ జోన్‌లో అడిషనల్ సెక్యూరిటీ డిపాజిట్‌లో మతలబు పెట్టారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ కూడా తనకు అనుకూలంగా మలుచుకున్నారు.

కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో అన్‌కండిషనల్ సాల్వెన్సీ సర్టిఫికెట్ జత పర్చాలనే కొత్త నిబంధన పెట్టి కొంతమందిపై వేటు వేయించారు. ఇదే నిబంధన ఇతర జోన్లలో వర్తింపజేయలేదు.

జీహెచ్ఎంసీలో మొత్తం ఒప్పంద కార్మికులకు గత ఏడాది బడ్జెట్‌లో రూ. 632 కోట్లు వెచ్చించారు. దీనిలో సగం దుర్వినియోగం అవుతున్నాయన్న ఫిర్యాదులు ఉన్నాయి. విజిలెన్సు విచారణ కూడా జరిగింది.

# బీటీపీఎస్.. బొగ్గు నిల్వలు 'లెస్'



మణుగూరు : భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం(బీటీపీఎస్) లో బొగ్గు నిల్వలు అడుగంటాయి. కేవలం రెండు, మూడు రోజులకు సరిపడా 46వేల టన్నుల బొగ్గు మాత్రమే నిల్వ ఉంది. బీటీపీఎస్‌లో నాలుగు యూనిట్ల నుంచి 1,080 మెగావాట్ల విద్యుదుత్పత్తికి రోజుకు 14,500 టన్నుల బొగ్గు అవసరం. అయితే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 15 రోజులకు సరిపడా 2 లక్షల టన్నుల బొగ్గు బీటీపీఎస్‌లో నిల్వ ఉండాలి. అయితే తక్కువ బొగ్గు నిల్వ ఉండటంతో విద్యుదుత్పత్తిపై ప్రభావం పడనుంది. ఎప్పుడు అత్యవసర పరిస్థితి ఏర్పడుతుందోనని ఇంజినీర్లకు సంక్రాంతి సెలవులను ఉన్నతాధికారులు రద్దు చేశారు. కూతవేటు దూరంలోని మణుగూరు గనుల నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా జరుగుతుంది. అయితే అక్కడి నుంచి నాణ్యమైన బొగ్గు సరఫరా కావటం లేదని తీసుకోవటం లేదు. అందుకే బొగ్గు కొరత ఏర్పడింది. విద్యుదుత్పత్తికి జీ-9, 10 స్థాయి కలిగిన బొగ్గు వినియోగిస్తారు. మణుగూరు గనుల నుంచి ఆ స్థాయి నాణ్యత కలిగిన బొగ్గు ఉత్పత్తి కావటం లేదు. గతంలో మణుగూరు ఓసీ గని నుంచి బీటీపీఎస్‌కు జీ-9, 10 నాణ్యత కలిగిన బొగ్గు రవాణా అయ్యేది. అయితే గనిలో బొగ్గు వెలికితీసే ఓబీ కంపెనీ ఒప్పంద గడువు ముగియటం, మళ్లీ కొత్త ఓబీ కంపెనీతో సింగరేణి ఒప్పందం కుదుర్చుకునేందుకు కొద్దినెలల సమయం పట్టింది. ఆ వ్యవధిలో మణుగూరు ఓసీ గని నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా జరగలేదు. ఓసీ-4లోనూ జీ-9 నాణ్యత కలిగిన బొగ్గు ఉత్పత్తి అవుతుంది. అయితే నీరు నిలిచిందని బొగ్గును ఓబీ కంపెనీ వెలికితీయటం లేదు. ఇలా ఈ రెండు గనుల నుంచి జీ-9, 10 నాణ్యత కలిగిన బొగ్గు సరఫరా కాకపోవటంతో బీటీపీఎస్‌లో నిల్వలు అడుగంటాయి. **భూపాలపల్లి నుంచి సరఫరా**బీటీపీఎస్‌కు బొగ్గు కొరత ఏర్పడిన నేపథ్య ంలో సమస్య జటిలం కాకుండా జెన్కో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. భూపాలపల్లి నుంచి బొగ్గు రవాణా చేసుకునేందుకు సింగరేణితో ఒప్పందం కుదుర్చుకుంది. రోజుకు 2వేల టన్నుల చొప్పున మొత్తమ్మీద 3 లక్షల టన్నుల బొగ్గు భూపాలపల్లి నుంచి రోడ్డుమార్గాన బీటీపీఎస్‌కు సరఫరా కానుంది. మూడు రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 'బీటీపీఎస్‌లో బొగ్గు నిల్వలు తక్కువైనా ప్రస్తుతాని కి వచ్చిన ఇబ్బందులేమీ లేవు. నాణ్యత లేకపోవటం వల్లే మణుగూరు గనుల నుంచి బొగ్గును తీసుకోవటం లేదు. బొగ్గు నిల్వలు పెరిగేలా ఇతర ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటాం' అని సీఈ బిచ్చన్నకు తెలిపారు.

# కలిసికట్టుగా.. గెలిచేట్టుగా..!




ఖమ్మం : కబడ్డీ పోటీల్లో ఖమ్మం జిల్లా మహిళల జట్టు అద్భుత విజయాలు సాధిస్తోంది. 2021 నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది. ఈ విజయాల వెనుక ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలోని సాంఘిక సంక్షమశాఖ మహిళా డిగ్రీ కళాశాల వెన్నుదన్నుగా నిలుస్తోంది. జిల్లా మహిళల కబడ్డీ జట్టులో సింహభాగం క్రీడాకారిణులు ఈ కళాశాలకు చెందినవారే కావటం విశేషం.

**తొమ్మిది మంది ఈ కళాశాలకు చెందినవారే**

ఇటీవల కరీంనగర్‌లో జరిగిన సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఖమ్మం జిల్లా మహిళా జట్టుకు కాంస్య పతకం దక్కింది. ఈ జట్టులో 12 మంది క్రీడాకారిణులు ఉండగా అందులో తొమ్మిది మంది మద్దులపల్లిలోని సాంఘిక సంక్షమశాఖ మహిళా డిగ్రీ కళాశాలకు చెందినవారే. తాజాగా పతకాలు సాధిస్తున్న జిల్లా జట్టులో కె.భవానీ (బీపీఈడీ), బి.ప్రియాంక (బీపీఈడీ), ఎం.కుసుమ (యుజీఈడీ), ఎస్.పూజిత (పీజీ) ఉన్నారు. వీరందరూ ఈ కళాశాలలో చదువుకున్న వారే. ప్రస్తుతం ఇక్కడ డిగ్రీ విద్యనభ్యసిస్తున్న జి.కావ్యశ్రీ, ఎం.మేఘన, ఎం.సువన్య, ఎన్.భావన, టి.అన్విత సైతం ఇదే జట్టులో సభ్యులుగా కొనసాగుతున్నారు. మిగిలిన ముగ్గురు క్రీడాకారిణులు ఎస్.సిరి, కృష్ణవేణి, ఎస్.ఆసిని కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందినవారు. భావన, పూజిత, కుసుమ, ప్రియాంక ఇప్పటికే జాతీయ పోటీల్లో రాణించారు. **మార్పు వచ్చింది ఇలా..**అంతర్జాతీయ క్రీడాకారిణి శివజ్యోతిని మద్దులపల్లి సాంఘిక సంక్షమశాఖ మహిళా డిగ్రీ కళాశాల కోచ్‌గా నియమించినప్పటి నుంచి ఇక్కడి విద్యార్థినులు కబడ్డీ క్రీడలో రాటుదేలుతున్నారు. కోచ్‌గా ఉన్న శివజ్యోతి 12 సీనియర్ నేషనల్ టోర్నీల్లో రాణించారు. ఆరుసార్లు భారత కబడ్డీ శిబిరంలో శిక్షణ పొందారు. ఓసారి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ టోర్నీలో ఆడారు. ఎప్పుడు జూనియర్, సీనియర్ జట్ల ఎంపికలు జరిగినా ఈ కళాశాల క్రీడాకారులు, పూర్వ క్రీడాకారులు రంగంలోకి దిగి ప్రతిభ చాటుతున్నారు.

# తూకాల్లో 'అర'గదీస్తూ.. మోసాల్లో ఇరగదీస్తూ..!



ఖమ్మం : ఖమ్మం నగరంలో ఇటీవల తూనికలు, కొలతలశాఖ అధికారులు చేపల విక్రయ దుకాణాలపై తనిఖీలు చేశారు. ఓ దుకాణంలో రెండు కిలోల తూకం బాట్(రాయి) కిలోన్నర బరువు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సదరు ఇనుప బాట్(రాయి)ని కిందిభాగంలో అరకిలో వరకు అరగదీసినట్లు తేల్చారు. ఇలా 14 చేపల దుకాణాలను తనిఖీ చేయగా ప్రతిచోటా ఇదేవిధంగా రెండు కిలోలకు అరకిలో తక్కువ బరువు కలిగిన తూకం రాళ్లు బయటపడ్డాయి. ఇక్కడ చేపల విక్రేతలందరూ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా తూకాల్లో మోసాలకు పాల్పడుతుండటం గమనార్హం. ప్రస్తుతం కిలో చేపల ధర రూ. 160 పలుకుతోంది. కిలోకు పావు కిలో తక్కువగా ఉండటం వల్ల ఈలెక్కన వినియోగదారులు కిలోకు రూ. 40 వరకు నష్టపోతున్నారు. రెండు కిలోల చేపలు కొంటే వినియోగదారులపై అదనంగా రూ. 80 భారం పడుతోంది. కిలో ధర ఎక్కువ పలికే చేపలు విక్రయిస్తే నిర్వాహకులకు మరింత లాభాలు సమకూరుతాయి. తమకు వచ్చే కమీషన్ కూడా కలుపుకొంటే సగానికి సగం లాభం పొందుతున్నట్లే. కమీషన్ కంటే మోసాల ద్వారా ఎక్కువ ఆదాయం వస్తుండటంతో అందరూ ఇదే విధానం అమలుచేస్తున్నారు. ప్రతి ఆదివారం ఖమ్మం నగరంలో రూ. లక్షల్లో చేపల వ్యాపారం జరుగుతుంది.

**ఎలక్ట్రానిక్ కాంటాల్లో చిప్ అమర్చి...**

ఏన్కూరు, తల్లాడ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన పత్తి వ్యాపారులు సైతం ముఠాలుగా ఏర్పడి రైతులను మోసగిస్తున్నారు. ఏన్కూరు, నర్సింహారావుపేట, అన్నారుగూడెం, బాలప్పేట, తల్లాడ తదితర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో పత్తి వ్యాపారులు ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట తదితర జిల్లాలకు టాటాఏస్ వాహనాలు తీసుకెళ్లి రైతుల నుంచి పత్తి కొంటారు. ఎలక్ట్రానిక్ కాంటాలో ప్రత్యేకంగా చిప్ అమర్చి పత్తి కాంటా వేసే సమయంలో తమ జేబులో రహస్యంగా ఉన్న రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తారు. ఇలా ప్రతి క్వింటాకు 20కిలోల బరువు తగ్గుతుంది. క్వింటా పత్తికి ప్రభుత్వం మద్దతు ధర రూ. 8,110 ప్రకటించింది. తూకంలో 20కిలోలు తగ్గటం వల్ల ప్రతి క్వింటాకు రైతులు సుమారు రూ. 1,600 వరకు నష్టపోతున్నారు. కమీషన్ ద్వారా వ్యాపారులు మరికొంత లాభం పొందుతున్నారు. ఇలా ప్రతి క్వింటాకు రూ. 2,000 వరకు రైతులను దగా చేస్తున్నారు. ఏన్కూరు, తల్లాడ మండలాల్లో ఆరుగురు పత్తి వ్యాపారులపై తూనికలు, కొలతలశాఖ అధికారులు, పోలీసులు ఇటీవల క్రిమినల్ కేసులు నమోదుచేసిన విషయం విదితమే. 'వినియోగదారులకు తూకాలపై అవగాహన ముఖ్యం. కిలో బాట్ల వెనకాల లీగల్ మెట్రాలజీ శాఖ స్టాంప్ ఉంటుంది. ఎక్కడైనా మోసాలు జరిగినట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలి' అని ఖమ్మం జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## తీరనున్న రిజిస్ట్రేషన్ కష్టాలు.. వాహనాల డీలర్లకే బాధ్యతలు

తాండూరు : కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కోసం ఇకపై ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి వేచి చూడాల్సిన పనిలేదు. తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్) లాగే.. శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చే బాధ్యతలను ప్రభుత్వం షోరూం డీలర్లకు అప్పగించనుంది. ఇందుకోసం రవాణాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రక్రియ వచ్చేనెల నుంచి అమలయ్యే అవకాశముందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

**నాలుగు నియోజకవర్గాల పరిధిలో..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో వివిధ కంపెనీలకు సంబంధించిన ద్విచక్రవాహన షోరూంలు 16, నాలుగు చక్రాల డీలర్ షోరూంలు 8 ఉన్నాయి. వీటితోపాటు హైదరాబాద్ డీలర్‌షిప్ పరిధిలో ఇక్కడ సబ్‌డీలర్ షోరూంలున్నాయి. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పరిధిలో రోజూ సుమారు 30- 40 ద్విచక్ర, 6-8 నాలుగు చక్రాల వాహనాలు విక్రయాలవుతున్నాయి.

**సమయం.. ఖర్చు ఆదా..**

అన్ని పన్నులు షోరూం డీలరు ముందే వసూలు చేస్తున్నా.. తాత్కాలిక రిజిస్ట్రేషన్ పత్రం మాత్రమే ఇచ్చేవారు. అన్ని పత్రాలు తీసుకొని రిజిస్ట్రేషన్‌కు ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. రాకపోకలు, రవాణా ఖర్చులు, సమయం వృథ అయ్యేది. ముఖ్యంగా మధ్యవర్తుల ప్రమేయం మరీ ఎక్కువగా ఉండేది. ఇకపై ఆ సమస్య తీరనుంది. డీలరు వద్దే శాశ్వత రిజిస్ట్రేషన్ కానుంది.

ఫ్యాన్సీ నంబరు కావాలంటే అదనం..



ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనానికి కోరుకున్న.. లేదంటే ఫ్యాన్సీ నంబరు కావాలంటే తాత్కాలిక రిజిస్ట్రేషన్‌తోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రవాణాశాఖ నిబంధనలు, అదనపు రుసుం చెల్లిస్తే కావాల్సిన నంబరును రవాణాశాఖ అధికారులు కేటాయిస్తారు. ఇందుకోసం సమయం పడుతుంది.

ప్రభుత్వానిది మంచి నిర్ణయం..-రమేశ్ గుప్తా, తాండూరు

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది. కొత్త వాహనం తీసుకున్న తరవాత చాలా మంది వాహనదారులు రిజిస్ట్రేషన్ల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక, శాశ్వత రిజిస్ట్రేషన్ విషయంలో డీలర్లు బాధ్యతగా వ్యవహరిస్తారు.


సర్కారు ఆదేశాలొచ్చాయి..-వెంకట్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి, వికారాబాద్ డీలర్ల వద్దనే రిజిస్ట్రేషన్ చేయించుకునే కొత్త విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించింది. తాత్కాలిక, శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన అన్ని పత్రాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మా కార్యాలయంలో అన్ని పత్రాలు పరిశీలించి ఆమోదం తెలుపుతాం. కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చాక ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

## అదనపు లోడ్‌కు ఓసీ ఉండాల్సిందే

హైదరాబాద్: నగరంలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అనుమతులు.. అక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ఇన్నాళ్లు అడ్డగోలుగా విద్యుత్తు కనెక్షన్లు జారీ చేశారు. నకిలీ ఓసీతో కొందరు గుత్తేదారులు, అధికారులు కలిసి చేసిన ఆరాచకం అంతా ఇంతా కాదు. ఈ అక్రమాలను అరికట్టేందుకు టీజీఎస్పీడీసీఎల్ కొన్నాళ్లుగా విద్యుత్తు కనెక్షన్ల జారీని కఠినతరం చేసింది. గతంలో ఇచ్చిన కనెక్షన్లపై ఫిర్యాదుల ఆధారంగా విచారణ, బాధ్యులైన సిబ్బంది, అధికారులకు మెమోలు జారీ చేస్తుండటంతో ఇప్పుడు నిబంధనల మేరకు ఉంటే కొత్త కనెక్షన్ అంటున్నారు. దీంతో గ్రేటర్‌లోని పది సర్కిళ్ల పరిధిలో సరైన పత్రాలు లేని దరఖాస్తులను డిస్కం పెండింగ్‌లో పెట్టింది. గడిచిన కొన్ని నెలల్లో వీటి సంఖ్య వేలకు చేరింది. అది కర్మన్‌ఘాట్‌లో పదేళ్ల క్రితం భవనం. ఆ రోజుల్లో అవసరాన్ని బట్టి పరిమిత లోడ్‌తో విద్యుత్తు కనెక్షన్లు తీసుకున్నారు. ఇటీవల వినియో గం పెరిగింది. ఇప్పుడు 160 కేవీఏ అదనపు లోడ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అదనపు లోడ్ అయినా సరే అక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించాల్సిందేనని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. ఓసీ సమర్పించకపోవడంతో నెలలుగా దరఖాస్తు పెండింగ్‌లోనే ఉంది.

**నోటరీలపై సందిగ్ధం..**

నగరంలో చాలా వరకు నోటరీ పత్రాలను స్థలాలను కొనుగోలు చేసినవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరికి సైతం రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌తో పోలిస్తే స్వల్పంగా ఎక్కువ ఛార్జీలు వసూలు చేసి



ఇది వరకు కనెక్షన్లు ఇచ్చేవారు. ఇప్పుడు వీటికి సైతం కనెక్షన్లు జారీ చేయడం లేదు. ఇవ్వాలని కొందరు అధికారులు, వద్దని మరికొందరు అంటున్నారు. సందిగ్ధం నెలకొంది. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో పదుల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టత కోసం కార్పొరేట్ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నట్లు ఓ అధికారి 'ఈనాడు'కు తెలిపారు.

**జంట జలాశయ పరిధిలోనూ..**

జంట జలాశయాలను పరిరక్షంచేందుకు దశాబ్దాల క్రితం ప్రభుత్వం జీవో111 జారీచేసింది. వీటిపరిధిలో నిర్మాణాలకు స్థానిక సంస్థలు అనుమతులు ఇవ్వడం లేదు. అయినా పలు భవనాలు వెలిశాయి. ఇటీవల కట్టిన భవనాలకు విద్యుత్తు కనెక్షన్ కావాలని దరఖాస్తు చేసుకోగా.. నిబంధనల మేరకు అనుమతుల పత్రాలు, 10 మీటర్ల కంటే ఎత్తైన భవనాలైతే ఓసీ సమర్పిస్తేనే కనెక్షన్ అని అధికారులు పెండింగ్‌లో పెడుతున్నారు. నిబంధనలను కఠినంగా అమలు చేస్తుండటంతో శంషాబాద్, మొయినాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త కనెక్షన్లు జారీ నిలిచిపోయింది.

**మరెలా?** విద్యుత్తు కనీస అవసరం కాబట్టి ఒక కనెక్షన్‌ను అది కూడా తాత్కాలిక కేటగిరి-8 కింద జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు యూనిట్‌కు రూ. 12 చొప్పున వసూలు చేస్తున్నారు

## మంత్రి ఆదేశించినా..! ఆక్రమణలు మామూలే

రాజమహేంద్రవరం : పుష్కరాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని రహదారులు, కాలువలను విస్తరించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆక్రమణలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. రోడ్లు విస్తరించాలంటే ముందుగా ఆక్రమణలు తొలగించాలి. ఇందుకుగాను నగరంలో రద్దీగా ఉన్న రహదారులు, వాటి పరిధిలోని ఆక్రమణలు గుర్తించారు. తొలుత మూలగొయ్యి, జాంపేట, ఆజాద్ చౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో తొలగించిన చోట మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. ఏకంగా నడకదారుల పై దుకాణాలు, రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ



40 నుంచి 60 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ కనీసం వెళ్లేందుకు 20 అడుగుల కూడా కనిపించకపోవడం గమనార్హం. దుకాణాలు రోడ్డుపైకి వస్తే, కొనుగోళ్ల కోసం వచ్చిన వాహనదారుల వాహనాలు రోడ్డు సగం ఆక్రమించేస్తున్నాయి. దీంతో ఉన్న సగం రోడ్డులోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఇదే దుస్థితి నెలకొంది. దేవీచౌక్, మెయిన్ రోడ్డు, జాంపేట, గోరక్షణపేట, కోరుకొండ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్ రోడ్డు, అప్సరా థియేటర్ రోడ్డు, కోటగుమ్మం, డీలక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. జాంపేట వద్ద బిర్యానీ సెంటర్లు, చికెన్ దుకాణాలను నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన యంత్రాంగం చూసిచూడనట్లు వదిలేసినట్లు సమాచారం. ముఖ్యంగా పెద్ద దుకాణాల విషయంలో భారీగానే మామూళ్లు పిండేస్తున్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు కార్యాచరణ దిశగా అడుగు వేస్తుంటే ఆదిలోనే హంస పాదు అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

## ఉపాధి పని దినాల పెంపు

రావులపాలెం : ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో పనిదినాలు 100 రోజులు ఉండేవి. వీటిని 125 రోజులకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఈ పథకాన్ని అనుసంధానం చేయడంతో రైతులు, వేతనదారులకు మేలు చేకూరనుంది.

**3.36 లక్షల మందికి ప్రయోజనం**

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జాబ్ కార్డులు 2.2 లక్షలు ఉండగా ఉపాధి శ్రామికులు 3.36 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పాడి పశువులకు గోకులం షెడ్లు, మ్యాజిక్



డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్నారు. రోజుకు శ్రామికులు గరిష్ట వేతనం రూ.307 పొందుతున్నారు.

**త్వరలోనే అమలు**

వంద రోజుల నుంచి 125 రోజులకు పనిదినాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే అమలు చేస్తాం. పనిదినాలు పెరగడం వల్ల వేతనదారులకు గరిష్ఠ ఆదాయం వస్తుంది. మధుసూదన్, డ్వామా పీడీ

## 'సూర్య'డర్

నంద్యాల : దేశవ్యాప్తంగా కోటి సౌర విద్యుత్తు ఫలకాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం 'సూర్యఘర్ యోజన'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృత ప్రచారం చేశారు. పథకం వినియోగించుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నా బ్యాంకర్ల నుంచి సహకారం అంతంతమాత్రంగానే ఉంది. వివిధ కొర్రీలు పెట్టి పథకానికి తూట్లు పొడుస్తున్నారు.

**సదుద్దేశంతో శ్రీకారం చుట్టినా..**

కర్నూలు జిల్లాలో 6,46,025, నంద్యాల జిల్లాలో 5,21,518 మంది గృహ విద్యుత్తు వినియోగదారులు ఉన్నారు. లోఓల్టేజీ సమస్యలు, విద్యుత్తు సరఫరాలో అవాంతరాలను అధిగమించడం.. రూ.వేల విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం పొందేందుకు కేంద్రం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పరిశీలిస్తే నంద్యాల జిల్లాలో 2,200, కర్నూలు జిల్లాలో 1,581 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి. బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు ఇస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలవడం లేదు. వ్యాపారులు, ఉద్యోగులకు మాత్రమే బ్యాంకర్లు మంజూరు చేస్తున్నారు.

**అడ్డంకులెన్నో..**

ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున రైతులున్నారు. వీరు సోలార్ యూనిట్ల కోసం బ్యాంకర్లను సంప్రదిస్తే సిబిల్ స్కోర్, లావాదేవీలు, గతంలో తీసుకున్న రుణాలపై ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత వివరాలు అడుగుతుండటంతో వీరు పథకానికి దూరమవుతున్నారు.

ఇంటి యజమాని అంగీకరించకపోవడంతో అద్దె ఇంట్లో ఉన్నవారు పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

60 ఏళ్లు దాటినవారికి రుణం ఇవ్వడం లేదు.

కర్నూలు నగరంతోపాటు నంద్యాల, ఆదోని తదితర పట్టణాల్లో వేలాది బహుళ అంతస్తు భవనాలున్నాయి. ఇక్కడ ఎవరైనా యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని భావిస్తే అపార్టుమెంటులో నివసిస్తున్న 10 కుటుంబాల వారు సంతకాలు చేయాల్సి రావడం అడ్డంకిగా మారింది. ఇలా.. సూర్యఘర్‌కు వివిధ వర్గాలవారు దూరమయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11,67,543 మంది విద్యుత్తు వినియోగదారులు ఉండగా.. వారిలో కనీసం 0.5 శాతం మందికి కూడా 'సూర్యఘర్' అందని పరిస్థితి నెలకొంది.

**రూ.కోటి అవకాశం కోల్పోయినట్లే..**

గ్రామంలో వంద శాతం ఇళ్లకు సౌర ఫలకాలు ఏర్పాటుచేస్తే.. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంగా రూ.కోటి వరకు నిధులు విడుదల చేస్తుంది. కర్నూలు జిల్లాలో 484, నంద్యాల జిల్లాలో 489 గ్రామాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతంలోనూ ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదు. గ్రామాలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉంది.

## మత్తు వదలగొట్టి.. 'జీవితాలు నిలబెట్టి'



కర్నూలు : మత్తు పదార్థాలకు బానిసలుగా మారినవారి జీవితాల్లో కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని డీఅడిక్షన్ కేంద్రం కొత్త వెలుగులు నింపుతోంది. నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ఓ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇద్దరు చొప్పున పీజీ విద్యార్థులు, నర్సులు సేవలు అందిస్తున్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారు ఆసుపత్రికి వచ్చి ఓపీ పొందితే వైద్యులు మొదట వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటారు. సిగరెట్లు, బీడీ, గుట్కా అలవాట్లున్న వారికి మందులతో నయం చేస్తారు. మత్తుకు బానిసలై పరిస్థితి తీవ్ర స్థాయికి చేరుకున్న వారిని డీఅడిక్షన్ సెంటర్‌లో చేర్పించి నిరంతరం వైద్యసేవలు అందిస్తారు.

**ఈగల్ విభాగం చొరవతో..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. దీనికి అలవాటుపడిన వారి సంఖ్య పెరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి కట్టడికి 'ఈగల్' పేరుతో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం గంజాయి కట్టడికి చర్యలు చేపట్టింది. ఇటీవల కర్నూలులో ఏడుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. సామాన్యులు మొదలుకొని సంపన్నుల వరకు ఎందరో దీనికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇలాంటివారిని ఈగల్ బృందం గుర్తించి డీఅడిక్షన్ సెంటర్‌లో చేర్పించి వ్యసనం నుంచి బయటపడేందుకు కృషి చేస్తోంది. వారి ద్వారా గంజాయి విక్రయించే వారి వివరాలు తెలుసుకొని తగిన చర్యలు చేడుతోంది.

కర్నూలుకు చెందిన నాగేంద్రకు తండ్రి లేడు. తల్లి మాత్రమే ఉంది. చెడు స్నేహాల కారణంగా దురలవాట్లకు బానిసయ్యాడు. గంజాయికి అలవాటుపడిన ఇతడు తీవ్ర అనారోగ్యం బారిన పడి కృత్రిమ శ్వాస తీసుకునే స్థితికి చేరాడు. ఈగల్ పోలీసులు ఇతడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని డీఅడిక్షన్ కేంద్రంలో చేర్పించి రెండు వారాల పాటు చికిత్స చేయించారు. ఆరోగ్యం కుదుటపడింది.

## 'తల'కెక్కని నిబంధనలు



నంద్యాల : ఈ ఏడాది జనవరి 22న నంద్యాల జిల్లా శిరివెళ్లమెట్ట వద్ద ప్రైవేటు బస్సు అదుపుతప్పి డివైడర్ దాటుకుని అటువైపు రోడ్డులో వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో బస్సు కాలి బూడిదైంది. జనవరి 27వ తేదీన కర్నూలు నగరంలోని రింగ్ రోడ్డు వద్ద కావేరి బస్సు అదుపు తప్పి డివైడర్ దాటుకుని అటువైపు రహదారిలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు పెను ప్రమాదం నుంచి ప్రయాణికులందరూ బయటపడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతిరోజూ లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా జాతీయ రహదారులపై గంటకు 120 కి.మీ.కుపైగా వేగంతో వెళుతుంటాయి. మరోవైపు చాలామంది ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. ఫలితంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు.

**శిరస్త్రాణం ధరించడంలో నిర్లక్ష్యం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 23,248 మందిపై గతేడాది కేసులు నమోదు చేశారు. 13,677 మందికి మంత్రణం చేశారు. వీరిపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదు.

శిరస్త్రాణంతో భద్రత కలుగుతుందని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా.. ఇప్పటికీ 80 శాతం మంది ధరించడం లేదు.

గతేడాది డిసెంబరు, ఈ ఏడాది జనవరిలో పరిశీలిస్తే కేవలం రెండు నెలల వ్యవధిలో 40 మందికిపైగా మృత్యువాత పడటం ప్రమాదాల తీవ్రతను చెప్పకనే చెబుతోంది.

**వేలాది కేసుల నమోదు**

ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు పరిశీలిస్తే కర్నూలు జిల్లాలో 2,814, నంద్యాల జిల్లా పరిధిలో 43,570 కేసులు నమోదు చేశారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాన్ని పురస్కరించుకుని ట్రాఫిక్, రవాణా శాఖ అధికారులు ఈ ఏడాది జనవరిలో పెద్దఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించారు. కళాశాలల వద్దకెళ్లి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలను విశదీకరించారు. వివిధ ప్రాంతాల్లోనూ సదస్సులు ఏర్పాటు చేశారు.

## వంద పడకలన్నారు... 30తోనే సరిపెట్టారు!




యర్రగొండపాలెం : యర్రగొండపాలెంలో అప్పటికే ఉన్న 30 పడకల ఆసుపత్రిని వంద పడకలుగా మార్చేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తరువాత రూ.23 కోట్లతో అవసరమైన భవనాలు నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉన్నా... పాలనాపరంగా వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేసి వివరాలు నవీకరించలేదు. దీంతో సాంకేతికంగా నేటికీ ముప్పై పడకలుగానే కొనసాగుతూ ఆధునిక వసతులేవీ అందుబాటులోకి రావడం లేదు.

**ఆధునిక సదుపాయాలు దూరం...**

ప్రస్తుతం ఇక్కడ దాదాపు ఇరవై మంది వైద్యులున్నారు. రోజువారీ ఓపీ సీజన్‌ను బట్టి 600 నుంచి వెయ్యి వరకు నమోదవుతోంది. దస్త్రాల ప్రకారం ముప్పై పడకలుగానే కొనసాగుతుండడంతో... బ్లడ్ బ్యాంక్, వెంటిలేటర్ సదుపాయం, ఆపరేషన్ థియేటర్ వంటి సదుపాయాలు అందుబాటులోకి రావడం లేదు. వీటి ఏర్పాటుకు అవసరమైన సదుపాయాలు ఉన్నా ప్రయోజనం లేకపోతోంది. దీంతో ప్రమాదాలు, అత్యవసర కేసులను ఒంగోలు, కర్నూలు, గుంటూరు తదితర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. అదనంగా పారిశుద్ధ్య కార్మికులను కేటాయించక శుభ్రత పనులు సరిగా సాగడం లేదు. మురుగు, దుర్గంధం కారణంగా రోగులు ఇబ్బంది పడుతున్నారు. సెక్యూరిటీ సిబ్బందినీ ఇవ్వలేదు.

**కమిటీ ఏర్పాటులోనూ నిర్లక్ష్యం**

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ రిజిస్ట్రేషన్ సైతం పెండింగ్‌లో ఉంది. అయిదుగురు సభ్యులను నామినేట్ చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేవు. ఈ కారణంగా వైద్యశాలకు రావాల్సిన రూ.11 లక్షల నిధులు ఇటీవల వెనక్కు మళ్లాయి. సమస్యను కలెక్టర్ దృష్టికి పలుమార్లు స్థానికులు తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ యాదిద్య మాట్లాడుతూ ఆసుపత్రి అప్‌గ్రేడేషన్, అభివృద్ధి కమిటీ అంశాలు కలెక్టర్ దృష్టిలో ఉన్నాయని... త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం ఉందని వివరించారు.

## పర్యావరణానికి ప్రాణం కొల్లేరు

మండవల్లి : తక్కువ లోతు కలిగి అనేక జీవజాతులకు ఆవాసంగా ఉండే చిత్తడి నేలలు భూమికి ఊపిరితిత్తులుగా పని చేస్తున్నాయి. దేశంలోనే అరుదైన 85 రకాల చిత్తడి నేలల్లో కొల్లేరుకు ప్రత్యేక స్థానం ఉంది. 1971 ఫిబ్రవరి 2న ఇరాన్‌లోని రామ్‌సార్ పట్టణంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో చిత్తడి నేలల ఆవశ్యకతను గుర్తించారు. కొల్లేరును 2002 ఆగస్టు 9న రామ్‌సార్ సైట్‌గా గుర్తించారు.

**ఎంతో సారవంతమైన..**

కొల్లేరులో ఎంతో సారవంతమైన నల్లరేగడి నేలలు ఉన్నాయి. వ్యవసాయంతో పాటు, చేపలు, రొయ్యల సాగులో వాటికి అవసరమైన పోషకాలు ఇక్కడ సహజ సిద్ధంగానే లభిస్తున్నాయి. చేపల చెరువుల్లో నెలకు 100 నుంచి 125 గ్రాములు పెరిగే చేపలు కొల్లేరు ప్రాంతంలో సరాసరిన నెలకు 200 గ్రాముల పెరుగుదల లభిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

**అరుదైన పక్షులు, చేపలకు ఆలవాలం**

తూర్పు యూరోప్, ఉత్తరాసియా ప్రాంతాల నుంచి ఏటా పెద్దఎత్తున పక్షులు వచ్చి సంతానోత్పత్తి చేసుకుంటాయి. 186 రకాల వలస పక్షులు, 128 రకాల అరుదైన చేపలు సంతానోత్పత్తి చేసుకుంటూ మనుగడ సాగిస్తున్నాయి. కొరమీను, మట్టగిడస, వాలుగ, వల్లింకాయ, నాటు గొరక, ఇంగిలాయి, బొమ్మిడాయి లాంటి విలువైన జాతి చేపలు కొల్లేరుకు సొంతం.

**వ్యర్థాలతో నష్టం**

సమీప గ్రామాల్లో ఉప్పునీటి రొయ్యల సాగు, విజయవాడ, ఏలూరు, గుడివాడ పట్టణాల్లో మురుగు మొత్తం కొల్లేరులోకే వచ్చి చేరుతోంది. ఈ నీటిలో హానికారక క్రిమి సంహారక అవశేషాలు, హైడ్రో కార్బన్లు, భారీ లోహ అవశేషాలు చొరబడటంతో కొల్లేరులోని మత్స్య సంపద తరిగిపోతోంది. వ్యర్థాలు తిని పెరుగుతున్న చేపల్ని పక్షులు వేటాడి తినడంతో అవి చనిపోతున్నాయి. పర్యావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

ఆందోళన కలిగిస్తున్న ఆక్రమణలు

కొల్లేరులో ఆక్రమణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటికేడు ఆక్రమణలు పెరిగిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. దీంతో వర్షాకాలంలో అంతులేని ప్రవాహం.. వస్తున్నా రెండు నెలల్లోనే కొల్లేరు పూర్తిగా ఎండిపోయి నేలలు బీటలు వారుతున్నాయి. ఇటీవల కాలంలో అటవీశాఖ అక్రమలపై ఉక్కు పాదాన్ని మోపుతున్నా మరిన్ని చర్యలు అవసరం.

**పరిరక్షణకు చర్యలు**

–విజయ, జిల్లా అటవీశాఖ అధికారి, ఏలూరు

కొల్లేరు చిత్తడి నేలలు పరిరక్షణకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే కొల్లేరులో ఆక్రమించి తవ్విన చెరువులను ధ్వంసం చేస్తున్నాం. పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

## ఇఫ్కో.. ప్రగతికి మార్గమిదిగో!

నెల్లూరు: జిల్లా పారిశ్రామిక రంగంలో మరో మేలి అడుగు పడింది. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. రాచర్లపాడు సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రత్యేక ఆర్థిక మండలికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. భూములిచ్చిన వారికి పరిహారం చెల్లింపు అంశాలు కోర్టులో ఉన్నా.. ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో గతంలో ఎరువుల పరిశ్రమ కోసం తీసుకోగా.. ప్రస్తుతం పారిశ్రామిక పార్కుగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ మేరకు పరిశ్రమల ఏర్పాటుకు ఇటీవల విశాఖలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ఎంవోయూ కుదుర్చుకోవడం గమనార్హం.




**పరిశ్రమలను ఆకర్షించేలా..**

ఇఫ్కో సెజ్ జాతీయ రహదారికి ఆనుకుని ఉండటం.. రైలు, రోడ్డు, వాయు, జల మార్గాల ద్వారా రవాణా అవకాశాలు పుష్కలంగా ఉండటంతో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారని అధికారులు భావిస్తున్నారు. మొత్తం రూ. 870 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసును కూడా జారీ చేశారు. ఇప్పటికే మూడు ప్రధాన సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాగా.. రూ. 356 కోట్లతో రామ్కీ బయో ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు డిసెంబరు 30న పర్యావరణ అభిప్రాయ సేకరణ జరగనుంది.

దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలను అందించనుంది. ఈ సెజ్‌తో ఎంఎస్ఎంఈ/ఎస్ఎంఈలకు, స్థానికులకు ఉపాధి, వ్యాపార అవకాశాలు లభిస్తాయి. పార్కు పూర్తిగా అభివృద్ధి చెందితే కావలి–నెల్లూరు మధ్య కీలక ఆర్థిక కారిడార్‌గా మారుతుంది' అని అన్నారు.

## సకాలంలో చికిత్సే కీలకం..

విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో 'స్క్రబ్ టైఫస్' కేసులు పెరుగుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. తాజాగా వ్యాధి లక్షణాలతో దేవరాపల్లికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి మరణించడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే 'స్క్రబ్ టైఫస్'పై ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇది కొత్తగా వచ్చిన వ్యాధి కాదని, సకాలంలో చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

కలెక్టర్ సూచనల మేరకు వైద్యులు, సిబ్బందితో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ఆర్‌టీ)లు ఏర్పాటు చేశారు. ఒకే ప్రాంతంలో ఐదు కంటే ఎక్కువ కేసులుంటే ఆ బృందం వెళ్లి పరీక్షిస్తుంది.

ఇక్కడే ఎందుకంటే..ఈ ఏడాది ఇప్పటివరకు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో 200కు పైగా కేసులు బయటపడ్డాయి. అందులో ఎక్కువ శాతం విశాఖలోవే.

జిల్లాలో ఆసుపత్రులు, ప్రయోగశాలలు ఎక్కువగా ఉన్నాయి. మెరుగైన వైద్య సదుపాయాలుండటంతో అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి అనుమానిత లక్షణాలున్న బాధితులు ఎక్కువగా ఇక్కడికి వస్తున్నారు. దీంతో ఇక్కడే కేసులు ఎక్కువగా బయట పడుతున్నాయి. అందులో అధిక భాగం కేజీహెచ్‌లో నిర్ధారణ అవుతున్నాయి.

మరోవైపు రాష్ట్రంలోనే ఎక్కువ కేసులు నమోదైన జాబితాలో విశాఖ ఉండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

ఎవరికైనా వ్యాధి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రం వైద్యులను సంప్రదించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు సూచించారు.

లక్షణాలు..అకస్మాత్తుగా 99 డిగ్రీలకు పైగా జ్వరం, అలసట, తలనొప్పి, వాంతులు, దద్దుర్లు, శరీరంపై నల్లటి మచ్చలు.

అలా.. గుర్తించారుఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన మైక్రోబయాలజీ విభాగ వైద్యులు గతేడాది దీనిపై పరిశోధన చేశారు. 2023 ఫిబ్రవరి నుంచి 2024 ఫిబ్రవరి వరకు కేజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరిన మొత్తం 507 మంది అనుమానితుల నమూనాలు పరీక్షించారు. అందులో 49 మందికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా గుర్తించారు. బాధితుల్లో మహిళల (30.6 శాతం) కంటే పురుషులే (69.4 శాతం) ఎక్కువగా ఉన్నారు. వారిలో ఆరుగురు జ్వరం రావడానికి ముందు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తించారు. వారిలోనూ యువత ఎక్కువగా ఉండటం గమనార్హం.

నిర్లక్ష్యం చేస్తేనే సమస్య..

'స్క్రబ్ టైఫస్'పై భయపడాల్సిన అవసరం లేదు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు. జ్వరం వచ్చిన 3 నుంచి 5 రోజుల్లో పరీక్షలు చేయించుకోవాలి. త్వరగా గుర్తించకపోవడం వల్ల సమస్య తీవ్రమవుతుంది' అని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పేర్కొన్నారు.

## నిబంధనలకు నీళ్లు.. నచ్చినట్టు వసూళ్లు!

అనకాపల్లి : జిల్లాలోని వందల సంఖ్యలో క్వారీలు ఉన్నా.. గతంలో ప్రభుత్వానికి సీనరేజ్ రూపంలో ఒక్క రూపాయి కూడా ఆదాయం వచ్చేది కాదు. దీంతోపాటు అధికారిక క్వారీల్లో పరిమితికి మించి తవ్వేసేవారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం.. అక్రమ మైనింగ్, రవాణాను అడ్డుకట్ట వేసేందుకు సీనరేజ్ వసూళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించేసింది. దీంతో ఆ సంస్థ జిల్లాలో పలుచోట్ల అక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఈ చెక్‌పోస్టుల్లో ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు.

అంచనా ప్రకారం లెక్కేసి.. నిబంధనల ప్రకారం క్వారీలున్న ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలి. గ్రానైట్, గ్రావెల్, క్రషర్, నల్లరాయి, మెటల్ రవాణా వాహనాలకు వే బిల్లు లేకపోతే.. వాటి నుంచి సీనరేజ్ వసూలు చేయాలి. కానీ.. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు వద్ద ఎక్కడా వే బ్రిడ్జిలు లేవు. వాహనంలో ఎంత పరిమాణంలో సరకు వెళ్తోందో కూడా చూడటంలేదు. అంచనా ప్రకారం లెక్కలేసి.. డబ్బులు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇవ్వమంటే.. వాహనాన్ని కదలనీయడం లేదు. కొన్నిచోట్ల వాహనాల వెంట ద్విచక్రవాహనాలపై వెంబడించి మరీ నిలుపుదల చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల పాయకరావుపేట మండలంలోని సత్యవరానికి చెందిన పడాల కృష్ణ సమీపంలోని క్వారీ బూడిదను పశువుల పాకను ఎత్తుచేసేందుకు ట్రాక్టర్‌తో తీసుకెళ్తుండగా.. ఇద్దరు బైక్‌పై వచ్చి ఆపారు. ట్రాక్టర్ బూడిదకు రూ. 800 ఇవ్వాలని ముక్కుపిండి వసూలు చేశారు.

రసీదులు ఇవకుండానే..కాంట్రాక్టు పొందిన సంస్థ ముద్రించిన బిల్లులు కూడా ఇవ్వడంలేదు. కొన్నిచోట్ల చేతి రాతతో.. వాహనం నంబర్, సమయం, తేదీ, చెక్‌పాయింట్ పేరు రాసి అదే రసీదంటూ డ్రైవర్ చేతిలో పెట్టేస్తున్నారు.

# కంకర మింగుతున్న కింకరులు

నంద్యాల : ఖనిజ అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా సీనరేజ్ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ప్రభుత్వం ఓ రకంగా ఆలోచిస్తే.. అక్రమార్కులు మరోలా పావులు కదుపుతున్నారు. అందొచ్చిన అవకాశంతో అక్రమ మైనింగ్‌ను మరింత పెంచారు. ప్రైవేటు సంస్థతో కొందరు ఒప్పందాలు చేసుకుని అనుమతుల్లేకుండానే తవ్వేస్తున్నారు. కంకర, రోడ్డు మెటల్‌కు సంబంధించిన అనుమతులు వేళ్లమీద లెక్కపెట్టే స్థాయిలో ఉండగా.. పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి.

**నిబంధనలకు చెల్లు**

నంద్యాల జిల్లాలో రోడ్డు మెటల్ క్వారీ లీజులు ఎనిమిది మాత్రమే ఉన్నాయి. బనగానపల్లి కార్యాలయ పరిధిలో మూడు, నంద్యాల పరిధిలో ఐదింటికి మాత్రమే లీజులున్నాయి. కానీ పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గద్దెలకొండలో రెండు లీజులు మాత్రమే అధికారికంగా ఉన్నాయి. మరికొన్ని రెన్యువల్ దశలో ఉన్నాయి. ఇక్కడ ఏకంగా 35 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం. ఆరు క్రషర్ యంత్రాల ద్వారా అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఈ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కుకుపోయింది. క్వారీ నిర్వాహకులు నిబంధనలు తుంగలో



తొక్కి తవ్వకాలు చేస్తున్నారు. ఇక్కడ ఏమేరకు మైనింగ్ జరుగుతుందన్న వివరాలు.. అటు రెవెన్యూ, ఇటు గనుల శాఖల వద్ద లేవు. బనగానపల్లిలో రెండింటికి మాత్రమే అధికారిక అనుమతులుండగా మరో మూడింటిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.

**బండరాళ్లను వదలరు..**

కర్నూలు జిల్లాలో ఏడు కంకర లీజులున్నాయి. పత్తికొండ నియోజకవర్గ పరిధి.. కృష్ణగిరి మండలం కంబాలపాడు సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ నిర్మాణంలో భాగంగా బయట పడిన రాళ్లను పగులగొట్టి కంకరగా మారుస్తున్నారు. దీనిని డోన్ సమీపంలోని కంకర క్వారీలకు తరలిస్తున్నారు. మరికొంత రోడ్డు నిర్మాణాలకు వాడుతున్నారు. కల్లూరు మండలం.. ఉలిందకొండ సమీపంలో నాలుగు కంకర క్వారీలకు అనుమతులుండగా మరో క్వారీలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఓర్వకల్లు మండలంలో పూడిచెర్ల సమీపంలో ఒకచోట అనధికార క్వారీ నడుస్తోంది.

**కానరాని తనిఖీలు**అనుమతులున్న లీజుల నుంచి వసూలు చేసిన సీనరేజ్‌ను మాత్రమే సదరు సంస్థ ప్రభుత్వానికి చెల్లిస్తోంది. అనధికారికంగా.. అక్రమంగా తవ్వకాలు చేస్తున్న కంకర, రోడ్డు మెటల్ క్వారీల నుంచి తరలే 'సరకు' నుంచి వసూలవుతున్న మొత్తాన్ని స్వాహా చేస్తోంది. సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు పరం చేసిన నాటి నుంచి గనుల శాఖ అధికారులు దాదాపు తనిఖీలు ఆపేశారు. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని క్వారీలపై సదరు ప్రైవేటు సంస్థ గురి పెట్టింది. అనుమతి ఉన్న క్వారీల్లో ఎలాగైతే సీనరేజ్ వసూలు చేస్తుందో.. అనధికార క్వారీల్లోనూ అలానే వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతోంది.

# పోగు.. ఉపాధి పేగు

కర్నూలు : గద్వాల పట్టుచీరకు ఎమ్మిగనూరు పుట్టినిల్లు.. ఇక్కడ చేనేత ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి.. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో మరింత వన్నెరాబోతోంది. ఇక్కడి కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో బనవాసిఫారం వద్ద యుద్ధప్రాతిపదికన టెక్స్‌టైల్ పార్కును నిర్మిస్తున్నారు. 77.37 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 249 ప్లాట్లు అందుబాటులోకి తేనున్నారు. తొలిదశలో 24.38 ఎకరాల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేసి 107 ప్లాట్లు అందుబాటులోకి తెచ్చారు. తమిళనాడులోని ఈరోడ్, సేలం ప్రాంతాల టెక్స్‌టైల్ పార్కుల మాదిరిగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే రహదారుల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన పనులు రెండు నెలల్లో పూర్తి చేసి ప్లాట్లను కార్మికులకు అప్పగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే కొందరు వ్యాపారులు ముందుకొచ్చారు. సమగ్రమైన



నివేదికతో రావాలని ఏపీఐఐసీ అధికారులు సూచించారు.

**విదేశాలకు ఎగుమతి చేసేలా**టెక్స్‌టైల్ పార్క్ నుంచే ఆన్‌లైన్‌లో ఉత్పత్తులు విక్రయించుకొనే సౌకర్యం కల్పించనున్నారు. ప్రస్తుతం సింగపూర్, అమెరికా వంటి దేశాలకు చీరలు ఎగుమతి అవుతున్నాయి. ప్రభుత్వ పరంగా వేగంగా సాయం అందేలా 'ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్'ను ఏర్పాటు చేయనున్నారు.

**కార్మికులకు 22 ఎకరాలు**

టెక్స్‌టైల్ పార్కులో చేనేతల కోసం ప్రత్యేకంగా 22 ఎకరాలు కేటాయించనున్నారు. చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా రూ.50 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. 1,500 వరకు అధునాతన ఎలక్ట్రానిక్ జాకార్డ్ మగ్గాలు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇందుకు వర్క్‌షెడ్లు నిర్మించనున్నారు. వాటిని వీవర్లకు కేటాయిస్తారు. దీంతో అధునాతన విధానాల్లో పలు రకాల వస్త్రాలు ఉత్పత్తి చేయడానికి వీలుంటుంది. అదేవిధంగా ప్రత్యేక శిక్షణ కేంద్రం, డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం, డయ్యింగ్ సౌకర్యాలు, గోదాముల సదుపాయం, బ్రాండింగ్, ప్యాకేజింగ్‌లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు.

# ధర పతనం.. రైతుకు కష్టం



మద్దికెర : ఉమ్మడి కర్నూలు జిల్లాలో టమాటా ధరలు అమాంతం పడిపోయాయి. కిలో రూ.5 నుంచి రూ.10లోపే పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం కోత, రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. ధరల పతనంతో సరకును మార్కెట్‌కు తరలించినా ఫలితం లేకుండా పోతోంది. పత్తికొండ మార్కెట్‌లో జనవరి మొదటి వారంలో కిలో టమాటా రూ.10 నుంచి రూ.20 వరకు పలకగా.. ప్రస్తుతం పూర్తిగా క్షీణించాయి. రిటైల్‌గా రూ.15 నుంచి రూ.20కు వ్యాపారులు అమ్ముతుండగా.. రైతుల నుంచి మాత్రం తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండటం గమనార్హం. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

**నాణ్యత లేదంటూ..**ప్రస్తుతం వస్తున్న సరకు నాణ్యతగా లేకపోవడమే ధరల పతనానికి కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. మొదట్లో వచ్చినంతగా నాణ్యత లేదంటూ సరకును తిరస్కరిస్తున్నారు. కొత్తగా దిగుబడులు ప్రారంభమై మార్కెట్‌కు వస్తున్న సరకును కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని పత్తికొండ, ఆస్పరి, బిల్లేకల్లు, దేవనకొండ, ప్యాపిలి తదితర ప్రాంతాల్లోని మార్కెట్లలో గత కొన్ని రోజులుగా ధరలు పూర్తిగా పడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పత్తికొండ మార్కెట్‌కు గత కొన్ని రోజులుగా 4 లారీల లోపే సరకు వస్తోంది. మార్కెట్‌కి వచ్చే రైతుల సంఖ్య సైతం తగ్గిందని మార్కెట్ కమిటీ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

**అప్పులే మిగులుతున్నాయి**

టమాటాకు ధర అంతగా లేకపోవడంతో ఇటీవల సాగు చేసిన రైతులు సైతం పంట కోత చేపట్టకుండా జాప్యం చేస్తున్నారు. భారీగా పెట్టుబడులు పెట్టి సాగు చేయగా.. ధరలు పతనమవడంతో కనీసం ఖర్చులు కూడా చేతికందే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. చివరికి పలువురు అప్పులబారిన పడుతున్నారు. పత్తికొండ మార్కెట్లో సరైన ధర లేకపోవడంతో పంట ఉత్పత్తులను అనంతపురంలోని టమాటా మార్కెట్‌కు తరలిస్తున్నామని ఓ రైతు చెప్పారు.

# అ'ధనం' సమకూర్చాల్సిందే



నంద్యాల : వ్యవసాయ కనెక్షన్లు, నియంత్రికల మరమ్మతుల పేరుతో కొందరు విద్యుత్తు సిబ్బంది రైతులకు 'మస్కా' కొడుతున్నారు. డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేకున్నా కొన్నిచోట్ల వసూలు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రత్యేకించి షిఫ్టింగ్ పేరుతో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పంటలకు సాగునీరు అందించాల్సిన నేపథ్యంలో చేసేదిలేక రైతులు అదనపు డబ్బులు ఇచ్చి పని చేయించుకుంటున్నారు.

**అన్నదాతలపైనే భారం**

వ్యవసాయ నియంత్రికలు అమర్చాలంటే అనుబంధ పరికరాలు అవసరం. వ్యవసాయ సర్వీసు కోసం 10 హెచ్‌పీ సామర్థ్యానికి రైతులు రూ.12,400 చెల్లిస్తున్నారు. 25 కేవీ నియంత్రిక కోసం మూడు విద్యుత్తు స్తంభాలు, 180 మీటర్ల పొడవునా మూడు లైన్ల తీగలు ఇస్తున్నారు. దూరం పెరిగే కొద్దీ రైతులపైనే భారం పడుతోంది. నూతన కనెక్షన్ మంజూరు సమయంలో నియంత్రిక ఏర్పాటు కోసం దిమ్మె కట్టి అదనపు పరికరాలు ఇవ్వాలి. కొన్నిచోట్ల గుత్తేదారులు ఇవన్నీ చేసి రైతుల నుంచి అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వానికి మాత్రం తామే ఈ పని చేసినట్లు చూపుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతేడాది సుమారు 3 వేల వరకు విద్యుత్తు కనెక్షన్లు మంజూరయ్యాయి.


**తరచూ మరమ్మతులు**

నంద్యాల జిల్లాలో నంద్యాల పట్టణం, రుద్రవరం, చాగలమర్రి, వెలుగోడు, ఆత్మకూరు, అవుకు, పాణ్యం తదితర మండలాల్లో పెద్ద ఎత్తున నియంత్రికలు కాలిపోతున్నాయి. కర్నూలు జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాలతోపాటు ఓర్వకల్లు, గూడూరు, నందవరం, మంత్రాలయం, గోనెగండ్ల తదితర మండలాల్లో నెలకు వందల్లోనే నియంత్రికలు మరమ్మతులకు గురవుతున్నాయి.

గత వైకాపా ప్రభుత్వంలో ఓ గుత్తేదారు సంస్థకు లబ్ధి కలిగించేందుకు అవసరం లేకున్నా పెద్దఎత్తున నియంత్రికలను కొనుగోలు చేసి కర్నూలులోని గోదాములో ఉంచారు. ఆ తర్వాత రెండు, మూడేళ్లకు వీటిని రైతులకు అందజేశారు. నియంత్రిక పనిచేసేది ఐదేళ్లయితే రెండేళ్లపాటు గోదాములోనే వృథాగా ఉండిపోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి.

**తప్పని తిప్పలు** కాలిపోయిన నియంత్రికల స్థానంలో మరొకటి అమర్చడం, పాత వాటిని గోదాముకు తరలించడం చేయాలి. షిఫ్టింగ్ సమయంలో రైతుల నుంచి డబ్బులు వసూలు చేయకూడదు. కొందరు సిబ్బంది యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారు. వాహనం సమకూర్చామని.. సిబ్బంది లేకపోవడంతో పక్క మండలాలు, గ్రామాల నుంచి తీసుకొచ్చామని చెప్పి ఒక్కో రైతు నుంచి రూ.2-3 వేల వరకు వసూలు చేస్తున్నారు.

# రైతుల 'కుంగు'బాటు



అవుకు : సీమ జిల్లాలకు సాగు నీరు అందించే అవుకు జలాశయం నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రత్యేకించి ప్రాజెక్టు పరిధిలో కీలకమైన తిమ్మరాజు చెరువుకట్ట వద్ద లీకేజీకి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఫలితంగా పంటలకు పూర్తిస్థాయిలో నీరందని పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టు మట్టికట్ట భద్రతకు ఏర్పాటుచేసిన రాతి అమరిక.. తిమ్మరాజుచెరువు వద్ద మూడు నెలల కిందట కుంగిపోయింది. సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. లీకేజీ సమస్యకు సంబంధించిన కారణాలను గుర్తించేందుకు వీలుగా జలవనరుల శాఖకు చెందిన పలువురు ఇంజినీరింగ్ నిపుణులు పలుమార్లు అవుకు జలాశయాన్ని సందర్శించి అధ్యయనం చేశారు. అత్యాధునిక సాంకేతిక పరికరాలతో పరిశోధనలు చేశారు. పాత తూము కారణంగా మూడు ప్రాంతాల్లో సమస్య ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు.

**రూ.45 లక్షలు ఖర్చు చేసినా..**

కర్ణాటక రాష్ట్రం బెళగావి ప్రాంతానికి చెందిన భూగర్భ జల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గత నెలలో పది రోజులపాటు నిపుణులు నీటిలో పలు రకాల పరిశోధనలు చేశారు. దాదాపు రూ.45 లక్షలు ఖర్చుచేసి సిమెంట్ గ్రౌటింగ్ చేశారు. పరికరాల సాయంతో సిమెంట్ నింపడం ద్వారా లీకేజీ ఆగిపోతుందని భావించినా 30 శాతం మాత్రమే అరికట్టగలిగారు.

**నీటిమట్టం తగ్గించేసి..**లీకేజీ సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అవుకు జలాశయం సామర్థ్యం 4.18 టీఎంసీలు కాగా.. రివిట్‌మెంటు కుంగడంతో నీటి నిల్వను గణనీయంగా తగ్గించారు. సమస్య ఉన్నంతకాలం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నీటిని నింపలేని పరిస్థితి. ప్రస్తుతం రెండు టీఎంసీలకే పరిమితం చేశారు. 'సమస్యను గుర్తించేందుకు మరోసారి నిపుణుల బృందం పర్యటించనుంది. శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది' అని జలాశయం డీఈ సాయికిరణ్ తెలిపారు.

# అన్నదాతలకు.. విస్తారంగా చేయూత

అనంతపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రగతికి ఊతమిచ్చేలా ఉంది. బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేనప్పటికీ ఉమ్మడిగా కలిసొచ్చే అంశాలు చాలా ఉన్నాయి. వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు 'భారత్ విస్తార్' పేరుతో కేంద్రం తీసుకురానున్న ఏఐ టూల్ అనంత ఉద్యాన రైతులకు వరంగా మారనుంది. రైతులను ఏకీకృతం చేయడంతోపాటు పంట సాగులో మెలకువలు, ఉత్పత్తి పెంచే సిఫార్సులు, వాతావరణ వివరాలు, తాజా మార్కెట్ ధరలు వంటి సమాచారాన్ని టూల్ ద్వారా అందించనున్నారు. ఇప్పటికే పీఎం ధన, ధాన్య కృషి యోజన పథకానికి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలను ఎంపిక చేశారు. బాలికల చదువును ప్రోత్సహించేందుకు జిల్లాకు వసతి గృహం మంజూరు చేయనున్నారు.

**ఉద్యాన విస్తీర్ణం పెంచేలా..**

కేంద్రం అమలు చేయనున్న పూర్వోదయ పథకం జిల్లాలో సాగునీటి పథకాలు, వ్యవసాయ విస్తరణకు ఊతమివ్వనుంది. ఉమ్మడి ప్రకాశంతోపాటు రాయలసీమ జిల్లాల్లో 82 ఉద్యాన క్లస్టర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ఉమ్మడి జిల్లాలో 10 క్లస్టర్లు ఉండగా పూర్వోదయ నిధులతో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచేలా రైతులకు ప్రోత్సాహకాలు అందించనున్నారు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం 1.51 లక్షల హెక్టార్లు కాగా దిగుబడి 30 లక్షల టన్నుల వరకు వస్తుంది.

**పాడి రైతులకు..**

జిల్లాలో పశుపోషణ, డెయిరీ పరిశ్రమల ఉత్పత్తి సామర్థ్యం పెంపు, ఆధునికీకరణ కోసం 'క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకం అమలుతో లబ్ధి కలగనుంది. ఉమ్మడి జిల్లాలోని 1.20 లక్షల మంది పాడి రైతులతోపాటు పాల డెయిరీల నిర్వాహకులను ప్రోత్సహించనుండటంతో ప్రయోజనం కలగనుంది. పౌల్ట్రీ రంగం విస్తరించనుంది.

**గంటలో బెంగళూరుకు..**

కేంద్రం ప్రకటించిన హైస్పీడ్ రైల్ కనెక్టివిటీలో హైదరాబాద్-బెంగళూరు మార్గం ఉండటం ఉమ్మడి అనంతకు కలిసొస్తుంది. గంటకు 300 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణించేలా ట్రాక్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇది పూర్తయితే ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతం నుంచైనా బెంగళూరుకు గంటలో చేరుకోవచ్చు.

నగరాభివృద్ధికి నిధులు

అనంతపురం నగరంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం నుంచి సాయం అందనుంది. దేశవ్యాప్తంగా ఉన్న నగరాల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు కేటాయించగా అందులో అనంతపురానికి వాటా దక్కే అవకాశం ఉంది.

ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు

ఎంఎస్ఎంఈలు తయారు చేసే ఉత్పత్తులను ప్రభుత్వం కొనడంతోపాటు రూ.10 వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం శుభపరిణామం. ఉమ్మడి జిల్లాలో 83 వేలకుపైగా ఉన్న ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం చేకూరనుంది.

చేనేతలకు కొత్త పథకాలు..

కేంద్రం నేషనల్ ఫైబర్ స్కీమ్

మ్యాన్‌మేడ్ న్యూ ఏజ్ ఫైబర్స్ స్కీమ్

నేషనల్ హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ ప్రోగ్రాం

టెక్స్-ఎకో ఇనిషియేటివ్

సమర్థ్ 2.0 ఫర్ మోడర్నైజ్డ్ స్కిల్లింగ్

ధర్మవరం, ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాల్లో చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేసి శిక్షణ అందించేందుకు అవకాశం ఉంది. తద్వారా వేలమంది చేనేత కార్మికులకు ఉపాధి లభించనుంది.

# అక్రమార్కుల గారడీ ఇసుక దోపిడీ

ముదిగుబ్బ : చిత్రావతి నది ఇసుకాసురులకు కల్పవల్లిగా మారింది. రేయింబవళ్లు ఇసుక తోడేస్తుండటంతో నదీమతల్లి గర్భం ఛిద్రమవుతోంది.ధర్మవరం నుంచి పార్నపల్లి జలాశయం వరకు చిత్రావతి నది ఉంది. కేవలం ముదిగుబ్బ మండలంలోని పీసీరేవు, తాడిమర్రి మండలంలోని సీసీరేవులో మాత్రమే తవ్వకాలకు ప్రభుత్వ అనుమతి ఇచ్చింది.అయితే ఉప్పలపాడు సమీపంలో రాయచోటికి చెందిన ఓ గుత్తేదారుడు భారీ యంత్రాలతో ఇసుక తవ్వి టిప్పర్లలో అనంతపురం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి ప్రాంతాలకు తరలిస్తున్నాడు. రాత్రివేళ అనంతపురానికి ఇటీవల 18 టన్నుల ఇసుక తీసుకెళ్లినందుకు రూ.14 వేలు, ముదిగుబ్బకి రూ.11 వేలు చొప్పున తీసుకున్నారు. తనిఖీ కేంద్రాల వద్ద నిఘా లేకపోవడంతో యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. ఫిర్యాదులు అందినప్పుడు మాత్రమే అధికారులు ఒకట్రెండు వాహనాలను సీజ్ చేసి చేతులు దులుపుకొంటున్నారే విమర్శలు ఉన్నాయి.**నిబంధనలు పాతాళానికి...**

ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి 500 మీటర్ల దూరంలో చిత్రావతి నది ఉంది. నదికి అటువైపు ఉన్న బత్తలపల్లి మండలంలోని గర్శినపల్లి దగ్గర ఇసుక తవ్వడంతో స్థానికులు అడ్డుకున్నారు. దీంతో తిరిగి ఉప్పలపాడు సమీపంలో తవ్వకాలు ప్రారంభించారు. ఆదివారం గ్రామస్థులు అడ్డుకొని పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి ఒక టిప్పర్, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. నదిలోనే పార్నపల్లి జలాశయం నుంచి ఉప్పలపాడు, ఇక్కడి నుంచి ముదిగుబ్బకు సీపీడబ్ల్యూఎస్ పథకం కింద 18 గ్రామాలకు తాగునీటి పైప్‌లైన్‌లు వేశారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఇసుక తవ్వి, తరలిస్తున్నారు. ఫలితంగా భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నాయి.

నిఘా పెంచుతాం

అమీర్‌బాషా, మైనింగ్ ఏడీ

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా నిఘా పెంచుతాం. అయినా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేసి జరిమాన విధిస్తాం.

# అగ్గిపాడు.. ఊరు విడిచారు!

తాడిపత్రి : మాఘమాసంలో పౌర్ణమి వచ్చిందంటే ఆ ఊర్లో నిప్పురవ్వ కాదు కదా.. ఒక్క దీపమూ వెలగదు. ఒక్కరూ కనిపించారు. ముందురోజు అర్ధరాత్రే పిల్లలు, పెద్దలతోపాటు పశుపక్షాదులను తీసుకొని ఊరు ఖాళీ చేసి వెళ్తారు. మరుసటిరోజు అర్ధరాత్రి మళ్లీ వస్తారు. ఈ ఆచారం తాడిపత్రిలోని తళారిచెరువులో కొన్నేళ్ల నుంచి పాటిస్తుండటం విశేషం. గ్రామపెద్దల కథనం మేరకు.. తలారిచెరువులో సుమారు వెయ్యి మందికిపైగా జీవనం సాగిస్తున్నారు. 600 ఏళ్ల కిందట ఒక బ్రాహ్మణుడు తన అనుచరులతో గ్రామంలోకి చొరబడి బంగారు, పంట దిగుబడులను దోచుకుని వెళ్తుండగా ప్రజలు పట్టుకుని వారిని హతమార్చారు. బ్రాహ్మణుడు మరణించే సమయంలో బ్రాహ్మణ హత్య మహాపాపమని, ఊరిలో కరవు కాటకాలు, పుట్టిన బిడ్డలు పుట్టినట్లే చనిపోతారని శపించాడు. అతడు చెప్పిన విధంగా కొన్నేళ్లపాటు జరిగింది. దీంతో కొందరు గ్రామపెద్దలు చంద్రగిరిలోని జ్యోతిష్యులను కలిసి సమస్యకు పరిష్కారం అడిగారు. ఏటా మాఘపౌర్ణమి రోజు గ్రామంలో అగ్గి రాజేయకుండా, కనీసం వెలుతురు కూడా ఉండకుండా ఇళ్లకు తాళాలు వేసి ఒక్కరోజుపాటు ఊరు విడిచి వెళ్లాలని సూచించారు. అప్పటి నుంచి మాఘ చతుర్దశి అర్ధరాతి నుంచి మాఘ పౌర్ణమి అర్ధరాత్రి వరకు ప్రజలు 'అగ్గిపాడు' పేరుతో ఊరి బయటకు వెళ్తారు.

## రూ. కోట్లు పోశారు.. 'రోడ్డు'న వదిలేశారు

ఎండాడ : నగరంలో 8వ వార్డులో కీలక ప్రాంతమైన ఎండాడ- బీచ్‌రోడ్డు అస్తవ్యస్తంగా దర్శనమిస్తోంది. సుమారు 3 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణ పనులు ఏడాదిగా నిలిచి పోయాయి. ఈ రహదారిని 60 అడుగులుగా విస్తరించేందుకు జీవీఎంసీ రూ.7 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో రహదారులు, కల్వర్టులు పెద్దవి చేసి భవిష్యత్తులో మురుగునీటి పారుదలతో పాటు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని భావించారు. ఈ మేరకు దారి పొడవునా కంకర వేశారు. కొంత మేర పనులు సైతం చేపట్టారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఆ తర్వాత పనులు అర్ధాంతరంగా ఆపేశారు.ఎందుకిలా: పలువురు నాయకులకు సంబంధించిన గృహాలు, స్థలాలు ఇరువైపులా ఆక్రమించి ఉండటం, వాటిని తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు ముందుకు రాకపోవడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.




పనులు ఆపేయడంపై మండిపడుతున్నారు.

ఈ మార్గంలో: కళాశాలలు, బీచ్‌రోడ్డు, ఎంవీపీ, సాగర్‌నగర్, రుషికొండ, ఈపీడీసీఎల్ కార్యాలయం తదితర ప్రాంతాలకు ఇదే ప్రధాన మార్గం. దీంతో నిత్యం వేలాది మంది రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.అధికారుల మాట: జోన్-2 ఏసీపీ శాస్త్రి, ఏఈ శ్రీనివాస్‌లను వివరణ కోరగా.. పలుచోట్ల ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలు ఉండ టంతో కొంతమేర ఇబ్బందిగా మారిందని ఒకరు, పట్టణ ప్రణాళిక అధికారులు జాప్యం చేయడం తోనే పనులు నిలిచిపోయాయని మరొకరు సమాధానం చెప్పడం గమనార్హం.

## ముంచేదాకా తేల్చరా!

ఎలమంచిలి : జిల్లాలోని శారదా, వరాహ నదుల్లో లోలెవెల్ వంతెనల తూములకు అడ్డంగా తుప్పలు, భారీ వృక్షాల మానులు, పేరుకుపోవడంతో వరద నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఉధృతంగా ప్రవహించే వరద నీటికి ఇవి అడ్డుగా నిలిచిపోతుండటంతో ఎగువ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. వరద గట్లకు గండ్లు పడుతున్నాయి. మేజర్ శారదా నదిలో కొత్తూరు వద్ద, వరాహ నదిలో ఏటికొప్పాక వద్ద లోలెవెల్ వంతెనలు ఉన్నాయి. పక్కన హైలెవెల్ వంతెనలు నిర్మించినా వీటిని తొలగించకుండా అలా వదిలేశారు. వరద సమయంలో నదిలో కొట్టుకువచ్చిన తుప్పలు, చెట్లు, తాటిమానులు లోలెవెల్ వంతెన తూముల వద్ద అడ్డంగా ఉండి



పోతున్నాయి. క్రమేపీ తూములు మూసుకుపోతున్నాయి. జలవనరుల శాఖ అధికారులు నదిలో వరదనీరు తగ్గిపోగానే వీటిని తొలగించాలి. నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా చూడాలి. మూడేళ్లుగా అధికారులు నిధుల కొరత కారణంగా ఈ పనులు చేపట్టలేదు. ఇటీవల వచ్చిన వరదలకు శారదా నదికి పలుచోట్ల గండ్లు పడటానికి ఇదే ప్రధాన కారణం. ప్రస్తుతానికి ఈ పాత వంతెనలు వినియోగంలో లేవు. పాత వంతెనలు కూల్చివేయడమో... తుప్పలు, దుంగలు తొలగించడమో చేయాలని పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ఎంతకాలం ఈ నిరీక్షణ!

మాధవధార: ఏదైనా వాహనం రోడ్డెక్కాలంటే రవాణా శాఖ జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ (ఎఫ్‌సీ) తప్పనిసరి. నిర్ణీత కాలంలో రవాణా, వ్యక్తిగత వాహనాలకు తప్పకుండా ఫిట్‌నెస్ పరీక్ష చేయించాల్సిందే. దీనికోసం జిల్లాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఫిట్‌నెస్ కార్యాలయాలకు వాహనదారులు బారులుతీరుతున్నారు. అయితే వారం రోజులుగా జిల్లాలో ఎఫ్‌సీ జారీ చేసే ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం మాన్యువల్ పద్ధతిలో ఫిట్‌నెస్‌ను నిలిపివేసింది. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ద్వారానే ఫిట్‌నెస్ చేయించుకోవాలని ఆదేశించింది. దీంతో ప్రైవేటు ఏజెన్సీలు నిర్వహిస్తున్న ఏటీఎస్



కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.( జిల్లాలో గంభీరం వద్ద ఎఫ్‌సీలు జారీ చేసే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్) కేంద్రం పనులు ఇంకా పూర్తి కాలేదు. అందుకే సమీపంలోని అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న ఏటీఎస్ కేంద్రాల్లో ఎఫ్‌సీలు చేయించుకోవటానికి వెళుతున్నారు.

ఆయా కేంద్రాల వద్ద ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. వీరి సంఖ్య ఎక్కువగా ఉండటం...మరో వైపు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రోజుల తరబడి ఏటీస్ కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది.

ఏ వాహనమైనా ఎఫ్‌సీ లేకుండా రోడ్డు మీద ప్రయాణించడం చట్ట ప్రకారం నేరం. ప్రమాదం జరిగితే వాహన యజమాని, చోదకుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే బీమా సైతం వర్తించదు. దీంతో ఎఫ్‌సీ పొందేందుకు వాహన చోదకులు త్వరపడుతున్నా...ఆలస్యం తప్పటం లేదు. ఫిట్‌నెస్ పరీక్షల కోసం జిల్లాలో ప్రతి నెలా అన్ని రకాల వాహనాలు కలిపి సుమారు రెండు వేల వరకూ వస్తుంటాయి.

# వికృతమాలలో ఆక్రమణల పుట్టలు



శ్రీకాళహస్తి : తిరుపతి విమానాశ్రయం, పెద్దఎత్తున పరిశ్రమలు, ఐఐటీ, ఐసర్ వంటి కేంద్ర విద్యాసంస్థలు కొలువుదీరిన ఏర్పేడు మండలంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. శ్రీకాళహస్తి-తిరుపతి పుణ్యక్షేత్రాలకు మధ్యలోని ప్రాంతం కావడంతో అందరి కళ్లు మండలంపైనే పడింది. ఈ నేపథ్యంలోనే చెట్టు, పుట్ట, ప్రభుత్వ, ప్రైవేట్, కాలువ పోరంబోకు స్థలాలు అనే తేడా లేకుండా కొందరు విచ్చలవిడిగా ఆక్రమించుకుని వారి ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. రూ.కోట్లకు విక్రయించుకుంటూ సిరులు ఆర్జిస్తున్నారు.

విమానాశ్రయం, ఈఎంసీలు ఏర్పడిన వికృతమాల రెవెన్యూ ఆక్రమణలకు నిలయంగా మారుతోంది. ఎకరా భూమి రూ.నాలుగు కోట్ల వరకు పలుకుతుండటంతో స్థానికులతోపాటు బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇక్కడి భూములపై దృష్టిపెడుతూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే గ్రామానికి సమీపంలోని 97, 98 సర్వేనంబర్లలో సుమారు 5.58 ఎకరాల కాలువ పోరంబోకు స్థలాన్ని వైకాపా నేతలు ఆక్రమించుకుని అయినవారికి పంచిపెట్టడంతో విలువైన ప్రభుత్వ భూమి పెద్దలపరంగా మారింది.

**పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి..**

అధికారులు ఓవైపు ఆక్రమణలు తొలగిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ రోజురోజుకు పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏర్పేడు మండలంలోని మర్రిమంద, వికృతమాల, కోబాక, పల్లంతో పాటు శ్రీకాళహస్తి, తొట్టంబేడు, రేణిగుంట మండలాల్లో రాజకీయ పార్టీల పేర్లతో విచ్చలవిడిగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అవసరం ఉంది.

**వైకాపా బాటలోనే..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైకాపాలో జరిగిన ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టింది. అయితే కొందరివి మాత్రమే తొలగించి చేతులు దులుపుకోగా పెద్దల భూములను పదిలంగా ఉంచింది. తర్వాత కాలంలో మిగిలిన ప్రభుత్వ, కాలువ పోరంబోకు భూముల్లో కొందరి నేతల అనుచరులు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆక్రమణలు సాధారణంగా మారిందని వాపోతున్నారు.

# ప్రతి పనికీ పైసా వసూల్



అనకాపల్లి : 'ప్రభుత్వ శాఖల్లో ముఖ్యమైన రెవెన్యూ శాఖలో అవినీతి పెచ్చుమీరుతోంది. అక్రమార్జనకు వెనకడుగు వేసేదేలే అన్నట్లు రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారు. చేయి తడపందే చిన్నపనైనా చేయడం లేదు. తహసీల్దారు కార్యాలయాలను అడ్డాగా చేసుకుని పలువురు అధికారులు దందా సాగిస్తున్నారు. ఇటీవల దేవరాపల్లి, అనకాపల్లి రూరల్ మండలాల్లో పలువురు వీఆర్వోలు అవినీతి నిరోధక శాఖకు దొరికినా.. ఆ శాఖ తీరులో మార్పు రావడం లేదు.

జిల్లాలో ప్రస్తుతం పరిశ్రమలు వస్తుండటంతో భూములకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో రెవెన్యూ సమస్యలు, పనులపై చాలామంది రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదునుగా చూసుకుని పట్టాదారు పాసుపుస్తకం నుంచి మ్యుటేషన్లు, సర్వేలు చేసేందుకు అధికంగా దండేస్తున్నారు. భూ సమస్య ఉందంటూ మండలాల్లోని తహసీల్దారు కార్యాలయాలకు వెళ్తే.. ఓపట్టాన ఫైల్ ముందుకు కదలడంలేదు. చాలాసార్లు ఏవో కొర్రీలతో మూలకు చేరుతున్నాయి.

ఇటీవల అచ్యుతాపురానికి చెందిన తహసీల్దారు డబ్బులకు ఆశపడి స్థానిక ప్రజాప్రతినిధి అండతో ఓ భూవ్యవహారంలో తలదూర్చాడు. తీరా ఆ వ్యవహారం డిప్యూటీ సీఎం దృష్టి వరకు వెళ్లడంతో.. తహసీల్దారుపై బదిలీ వేటు పడింది.

**పట్టుబడుతున్నా.. పట్టించుకోరు**

జిల్లాలో చాలా మండలాల్లో వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు, మూడు పంచాయతీలకు ఒకరు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఏ చిన్న పనున్నా.. వీఆర్వోలు, మండల సర్వేయర్ల ద్వారానే జరగాలి. దీంతోపాటు తహసీల్దార్లకు అందిన ప్రతి అర్జీపై వీరే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిష్కరించాలి. ఇదే అదునుగా చూసుకుని.. రైతులు, భూ యజమానుల దగ్గర నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. బీ దేవరాపల్లి మండలం ఎ.అలమండకు చెందిన ఓ వ్యక్తి.. తన తండ్రి పేరుమీద ఉన్న భూమిని తన పేరుమీదకు మార్చాలని మ్యుటేషన్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఈ పనికోసం వీఆర్వో సూర్యనారాయణ రూ. 25 వేలు లంచం అడిగాడు. రూ.20 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. వీఆర్వో సొమ్ము తీసుకుంటుండగా గతనెలలో అనిశాకు చిక్కారు.

అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామంలో వీఆర్ఓగా పనిచేస్తున్న ఎం.సూర్యనారాయణ చిన్న పనైనా చేయి తడపందే పనిచేయకుండా వేధిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఓ వితంతువు భర్త చనిపోయాడని.. భూమిని తన పేరుమీద మ్యుటేషన్ పెట్టుకుంటే ఆమె దగ్గర లంచం డిమాండ్ చేశాడు. సొమ్ము తీసుకుంటుండగా అ.ని.శాకు అడ్డంగా దొరికారు.

కొన్నాళ్ల క్రితం కశింకోట మండలం నర్సింగబిల్లిలో ఓ వీఆర్వో భూమి మ్యుటేషన్ కోసం డబ్బులు తీసుకుంటుంటూ నేరుగా అవినీతి నిరోధక శాఖకు దొరికిపోయారు.

# రూ.6 కోట్లు.. అధునాతన 'బజారు'



కర్నూలు : నగరంలోని సి.క్యాంపు రైతుబజారు విస్తరణకు అడుగులు పడుతున్నాయి. సి.క్యాంపు రైతుబజారును 1999లో రూ.కోటి నిధులతో 67 సెంట్ల విస్తీర్ణంలో అందుబాటులోకి తెచ్చారు. ఉమ్మడి జిల్లాలో 120 గ్రామాల రైతులు పంట ఉత్పత్తులు విక్రయించుకునేలా వీలు కల్పించారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలు సాగు చేస్తున్న 6,500 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. రైతుబజారుకు ప్రతిరోజూ వేలాది మంది వినియోగదారులు వస్తుంటారు. పండగ సమయాల్లో కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీన్ని విస్తరించాలంటూలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. 'కూటమి' ప్రభుత్వం స్పందించి రూ.6 కోట్లు మంజూరు చేసింది.

**నిధులివ్వని వైకాపా**

రైతు బజారులో రద్దీ తీవ్రమవడం.. స్థలం సరిపోకపోవడంతో 2017-18లో అప్పటి తెదేపా ప్రభుత్వం రైతుబజారు విస్తరణకు చర్యలు చేపట్టింది. దీనిని ఆనుకుని ఆర్‌అండ్‌బీకి చెందిన పది క్వార్టర్లు కేటాయించింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడం.. వైకాపా అధికారంలోకి రావడంతో విస్తరణ పనులు ఆగిపోయాయి. 2022లో రూ.4.75 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించినా.. అది కేవలం ప్రకటనలకే పరిమితమైంది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

**వరుస కథనాలతో కదలిక**

రైతుబజారు విస్తరణ అత్యవసరం అంటూ లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. జిల్లా పాలనాధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పలుమార్లు రైతుబజారును పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మే 17న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సి.క్యాంపు రైతుబజారును సందర్శించారు. రైతుబజారు విస్తరణతోపాటు ఆధునికీకరించేందుకు రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ నిధులు మంజూరు చేస్తూ వారం కిందట ఉత్తర్వులు విడుదలయ్యాయి.

**రెండంతస్తుల్లో నిర్మాణం**

సెంట్రల్ మార్కెట్ ఫండ్ (ఎస్‌ఎంఎఫ్) నిధులతో రైతుబజారును విస్తరించనున్నారు. టెండర్లు ఖరారైన తర్వాత ప్రభుత్వ నివాస గృహ సముదాయాలను తొలగించి రైతుబజారును విస్తరించనున్నారు.

ప్రస్తుతమున్న రైతుబజారుతోపాటు ఆర్‌అండ్‌కి చెందిన 10 నివాస గృహ సముదాయాలతో కలిసి మొత్తం 1.69 ఎకరాల స్థలం ఉంది. ఇందులో 85 సెంట్లలో రైతుబజారును విస్తరించనున్నారు.

కింది అంతస్తులో పార్కింగ్.. మొదటి అంతస్తులో 155 స్టాళ్లు, 33 దుకాణాలు, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. రైతుబజారుకు వచ్చే అన్నదాతల సౌకర్యార్థం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు.

నిత్యం వచ్చే వినియోగదారులు : 2 వేల మంది

రోజువారీ విక్రయాలు : 800-850 క్వింటాళ్లు

ఏటా ఆదాయం : సుమారు రూ.50 లక్షలు

## నీటి వనరుల రాత మారేనా?

బొబ్బిలి : గత ప్రభుత్వం చిన్న నీటి వనరులను పూర్తిగా పట్టించుకోలేదు. నిర్వహణను గాలికొదిలేసింది. కాలువల్లో పూడిక పెరిగిపోయినా.. తూములు శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోలేదు. అసంపూర్తిగా ఉన్న పనుల జోలికి వెళ్లలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతిపాదనలకు సంబంధించిన దస్త్రాలు కదులుతున్నా ఆలస్యమవుతోంది. నిధులు విడుదలైతేనే మోక్షం కలుగుతుంది.

బొబ్బిలి మండలం నారాయణప్పవలస వద్ద కంచరగెడ్డ జలాశయ నిర్మాణం 16 ఏళ్ల కిందట తలపెట్టారు. సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. మట్టికట్ట పూర్తిచేసి, కాలువల తవ్వకాలు వదిలేశారు. పనులు పూర్తిచేయడానికి అదనంగా రూ.2 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. గత అయిదేళ్లలో పైసా విదల్చలేదు. రామభద్రపురం, బొబ్బిలి మండలాలకు సాగునీరు అందించే ఏడొంపుల గెడ్డ ఆనకట్ట నుంచి 750 హెక్టార్లలో భూములకు సాగునీరు అందాల్సి ఉంది. ఆనకట్ట శిథిలావస్థకు చేరుకోవడం,



కాలువలు పాడవడంతో శివారుకు నీరు అందడంలేదు. ఏడేళ్ల కిందట వీటికి మరమ్మతులు చేపట్టారు. పూడిక పెరిగిపోయి, కాలువలు బలహీనంగా మారాయి. తూములు శిథిలావస్థకు చేరాయి.

**5,500 ఎకరాలకు సాగునీరు కరవు**

వెంగళరాయసాగర్ పరిధిలో రెండు కీలక పథకాలు పడకేశాయి. బొబ్బిలి మండలంలోని 5,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన అదనపు ఆయకట్టు పనులు నిలిచిపోయాయి.

తోటపల్లి కుడి ప్రధాన కాలువ పరిధిలోని బొబ్బిలి మండలం రాముడువలస, తెర్లాం మండలం లోచర్ల వద్ద ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి తెదేపా హయాంలో అనుమతులు మంజూరు చేసి, భూమిపూజ చేశారు. ఒక్కో పథకానికి సుమారు రూ.16 కోట్లు అవసరమని ప్రతిపాదించారు.

**ప్రతిపాదనలు పంపించాం**

– అప్పారావు, ఎస్‌ఈ, జలవనరుల సర్కిల్, బొబ్బిలి

చిన్ననీటి వనరుల మెరుగుకు ప్రతిపాదనలు పంపించాం. ఏడొంపులగెడ్డ ఆనకట్ట మరమ్మతులు, చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపాం. కంచరగెడ్డకు రూ.2 కోట్లు కావాలని అంచనాలు నివేదించాం. మిగిలిన పనులు జైకాలో చేపడతాం.


## ప్రత్యేక దళం.. బోర్డుకే పరిమితం!

ఒంగోలు : శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైన పోలీసు బెటాలియం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకొని సుమారు 15 ఏళ్లు గడిచినా ఇప్పటివరకు అక్కడ ఎలాంటి మౌలిక వసతులు సమకూరలేదు సరికదా సిబ్బందిని సైతం నియమించలేదు. మద్దిపాడులోని 7వ పోలీసు బెటాలియన్ కేవలం బోర్డుకే పరిమితం కావడం గమనార్హం. ప్రముఖులకు రక్షణ, ఎన్నికలు, ఇతరేతర సందర్భాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు రక్షణగా నిలిచే ప్రత్యేక పోలీసు దళం జిల్లాలో ఏర్పాటుకు 94 ఎకరాలు కేటాయిస్తూ 2009లో నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ నదిని ఆనుకుని ఉన్న కొండలను కేటాయించారు. ప్రత్యేక దళం పర్యవేక్షణాధికారి, ఇతర అధికారులు, సిబ్బంది అంతా కలుపుకొని సుమారు 1,000 మంది వరకు నియమించాల్సి ఉంది. స్థలమైతే కేటాయించారు గానీ ఎలాంటి భవనాలు నిర్మించకపోవడంతో అధికారులు, సిబ్బంది ఇక్కడకు రాలేదు. ఈ ఏడాది మాత్రం బోర్డు ఏర్పాటు చేసి ఆ ప్రాంతానికి కాపలాగా సిబ్బందిని నియమించారు. ఇక్కడకు కేవలం 15 మంది సిబ్బంది వచ్చారు. వీరి కోసం ఒక గది, రెండు షెడ్లు మాత్రమే నిర్మించారు. ప్రత్యేక దళం ఏర్పాటైతే పోలీసు అధికారులు, సిబ్బంది వారికి సేవలు అందించేందుకు అదనపు సిబ్బంది నియమితులవుతారు. సిబ్బందికి క్వార్టర్స్, పాఠశాల, దేవాలయాలు, పార్కులు వంటివి రూపుదిద్దుకుంటాయి. ఒక ప్రత్యేక కాలనీగా రూపుదిద్దుకుంటుంది. వీరంతా వస్తే పరోక్షంగా స్థానికంగా కొంతమందికి ఉపాధి లభిస్తుంది.

**ఒక్కో అడుగు పడితేనే..**

ప్రస్తుతం సీఐ, ఎస్.ఐ., అధికారులు, ఇతర సిబ్బంది కలుపుకొని 15 మంది వరకు ఉన్నారు. ఇక్కడ ఉండాల్సిన 600 మంది వరకు సిబ్బంది ఇతర బెటాలియన్లలో శిక్షణలో ఉన్నారు. వారంతా ఇక్కడకు రావాలంటే కార్యాలయ భవనాలతో పాటు క్వార్టర్స్ వంటివి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ ఏడాది రూ.60 లక్షల నిధులు కేటాయించారు. బెటాలియన్ స్థలంలోకి వెళ్లేందుకు ప్రధాన రహదారి తప్ప అప్పట్లో స్థలం కేటాయించినప్పుడు కొండలు, గుట్టలతో ఎలా ఉందో.. ఇప్పుడు అలానే ఉంది. దశల వారీగా నిర్మాణాలు చేపట్టి, సిబ్బంది అడుగుపెడితే ప్రత్యేక దళంతో గుండ్లకమ్మ తీరంలో సందడి నెలకొంటుంది.

## విజ్ఞానం విరిసె.. విద్యార్థి మెరిసె




విజయనగరం : పది.. ఇరవై కాదు.. 294 ప్రాజెక్టులు. మా ప్రతిభ చూడమంటూ బాలలంతా సృజన విందు ఆవిష్కరించారు. వ్యవసా యం, పర్యావరణం, పరిశుభ్రత, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ ఇలా పలు అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. విజయనగరంలోని బాబామెట్ట బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో సందడిది. డీఈవో మాణిక్యం నాయుడు దీన్ని ప్రారంభించారు. విద్యార్థుల బృంద విభాగంలో ఏడు, వ్యక్తిగత విభాగంలో రెండు, ఉపాధ్యాయుల విభాగంలో రెండింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమానికి హాజరైన ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే పరిశోధనల దిశగా వెళితే ఉజ్వల భవిత అందుకోవచ్చున్నారు. ఆర్డీవో కీర్తి విజ్ఞాన ప్రదర్శన తిలకించారు. ఉప విద్యాశాఖాధికారులు కె.వి.రమణ, మోహనరావు, జిల్లా సైన్స్ అధికారి రాజేష్ పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాలికలు నృత్య ప్రదర్శనతో అలరించారు.

# కోడి కూసింది... కాసులు కురిశాయి

అచ్యుతాపురం : కోడి పుంజుల ధరలు అమాంతం పెరిగాయి. ఇది పెంపకందారుల ముఖాల్లో ఆనందం నింపింది. అచ్యుతాపురంలో శుక్రవారం జరిగిన వారపుసం తకు భారీగా నాటుకోళ్లు విక్రయానికి వచ్చాయి. వీటి కోసమే ఎదురుచూస్తున్నాం అన్నట్లు పందెంరాయుళ్లు కొనుగోలుకు పోటీపడ్డారు. సాధారణ రోజుల్లో రూ. మూడు వేలు పలికే కోడిపుంజులు రూ. 10 వేల వరకు పలికాయి. కోడిపెట్టలు సైతం రూ. 1000 నుంచి రూ. మూడు వేలు వరకు ధర చెల్లించి మాంసం ప్రియులు కొనుగోలు చేశారు. పండగ సంత కావడంతో మహిళలు అధిక సంఖ్యలో కనిపించారు. ఇప్పటి వరకూ గోదావరి జిల్లాలకే ప్రత్యేకంగా నిలిచిన ఈ పందెం పుంజుల పెంపకం, శిక్షణ క్రమంగా మన జిల్లాలోనూ వ్యాప్తి



చెందుతోంది. బుచ్చెయ్యపేట మండలం లింగభూపాలపుర అగ్రహారం గ్రామంలో ఔత్సాహికులు ప్రత్యేకంగా వీటిని పెంచుతున్నారు.

**సంత కళకళ..** నక్కపల్లి వారపు సంత శుక్రవారం క్రయ, విక్రయదారులతో కళకళలాడింది. పండగ ముందు జరిగిన సంత కావడంతో ప్రధానంగా మేకలు, గొర్రెలు, కోళ్ల వద్ద రద్దీ నెలకొంది. ఇక్కడకు పక్క జిల్లాల నుంచి అనేక మంది వచ్చారు. ముఖ్యంగా మూగజీవాల ధరలు భారీగా ఉన్నాయి. నాటు కోళ్ల ధరలైతే మరీ దారుణం. కేజీ బరువుండే సాధారణ కోడి రూ.రెండు వేలకుపైగా పలికింది. ఇక పందెం కోసం తెచ్చినవి రూ. ఏడెనిమిది వేల వరకు పలికాయి. కొందరు ఖరీదుతో సంబంధం లేకుండా వీటిని ఉత్సాహంగా కొనుగోలు చేసుకుని వెళ్లారు.

# కంచేస్తాం.. పంచేస్తాం!!

పీఎంపాలెం : జీవీఎంసీ, రెవెన్యూ శాఖల మధ్య కొరవడిన సమన్వయం ఆక్రమణదారులకు వరంలా మారుతోంది. కళ్లముందు ఇష్టారీతిన కబ్జాలు జరుగుతున్నా తమది కాదన్నట్లు వ్యవహరిస్తు చర్యలకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు అక్రమార్కుల పరమవుతున్నాయి.

పీఎంపాలెం హౌసింగ్‌బోర్డు కాలనీ ఎల్ఐజీ నివాసాల వద్ద అటవీ శాఖ ప్రహరీకి చేరువగా సుమారు రూ.10 కోట్లు విలువ చేసే ప్రభుత్వ ఖాళీ స్థలం ఉంది. ఆర్‌హెచ్ కాలనీ నీళ్ల ట్యాంకు నుంచి సాయిబాబా ఆలయం వరకు ఉన్న ఈ భూమిని కొందరు కబ్జా చేసి ఇళ్ల స్థలాలుగా హద్దులు వేసుకుని రాత్రికి రాత్రి ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. మరికొందరు కంటైనర్లు ఏర్పాటు చేశారు. కొందరు వైకాపా నాయకుల ప్రోద్బలంతో, పేదల ముసుగులో ఈ ఆక్రమణలకు తెరతీసినట్లు



సమాచారం. సుమారు 30కి పైగా ప్లాట్లు వేయడంతో పాటు నేడో రేపో పక్కాగా రేకుల షెడ్లు నిర్మించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గత 20 రోజులుగా బహిరంగంగా ఈ కబ్జాల తంతు జరుగుతున్నా జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక్కడి విషయంపై ఆయా శాఖల ఉన్నతాధికారులకు, కింది స్థాయి అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎలాంటి చర్యలకు ఉపక్రమించక పోవడంపై విమర్శలొస్తున్నాయి.

# పరుగున వచ్చేలా.. ప్రాణం నిలిపేలా..

నక్కపల్లి : రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు.. అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడే జనాలకు అత్యవసర వైద్య సేవలు అందించే 108 నూతన వాహనాలు రహదారులపై పరుగులు తీస్తున్నాయి. కాల్ రాగానే రయ్‌మంటూ వెళ్తున్న కొన్ని వాహనాల్లో అధునాతన సదుపాయాలూ ఉన్నాయి. జిల్లాకు ఇటీవల కొత్తగా పలు వాహనాలు రాగా వీటిలో సేవలు మెరుగుపడ్డాయి. జిల్లా పరిధిలోని 24 మండలాల పరిధిలో ప్రస్తుతం 22 వాహనాల ద్వారా అత్యవసర వైద్య సేవలందిస్తున్నారు. ఏ ప్రమాదం జరిగినా, ఎవరైనా తీవ్ర అస్వస్థతకు గురైనా సమాచారం అందితే అక్కడకు చేరుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటి సేవలను మరింత మెరుగుపరిచారు. మరమ్మతుకు చేరుకున్న వాహనాల స్థానే కొత్తవి చేర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వందల వాహనాలు కేటాయించగా, జిల్లాకు 12 వాహనాలు చేరాయి. ప్రస్తుతం పాత, కొత్త వాహనాలు సేవలందిస్తున్నాయి.

**ఆరుచోట్ల ఏఎల్ఎస్‌లు**

జిల్లాలో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) వాహనాలు ఆరు ఉన్నాయి. ప్రభుత్వం ప్రస్తుతం కేటాయించిన వాటిలో కండిషన్ బాగాలేని మూడు వాహనాలను మార్పు చేసి, కొత్త వాటిని అందించింది. మిగిలినవన్నీ బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) వాహనాలే. అన్ని వాహనాల్లో ప్రాణవాయువు, బీపీ మిషన్, సెక్షన్ ఆపరేటర్, మోనిటర్, స్ట్రెచర్, వీల్‌ఛైర్ తదితర సామగ్రి ఉండగా..ఏఎల్ఎస్‌లో వీటితో పాటు వెంటిలేటర్, ఆటో మెటిక్ డీఫిబ్రిలేటర్ (గుండె పోటు బాధితులను రక్షించే పరికరాలు) ఉంటాయి.

**నూతన వాహనాలు వచ్చిన ప్రాంతాలు**

ఏఎల్ఎస్‌లు (3): నక్కపల్లి, నర్సీపట్నం, కె.కోటపాడు.

బీఎల్ఎస్‌లు (9): ఎస్.రాయవరం, గొలుగొండ, నాతవరం, దేవరాపల్లి, చీడికాడ, రావికమతం, మాకవరపాలెం, అచ్యుతాపురం, ఎలమంచిలి

**కొత్త వాటికి ప్రతిపాదనలు**

అంబులెన్స్‌ల్లో చాలావరకు ఎక్కువ దూరం తిరిగినవి జీవనకాలం ముగుస్తుండటంతో ప్రభుత్వం కొత్తవి కేటాయించింది. త్వరలో ఎలమంచిలి, మాకవరపాలేనికి ఏఎల్ఎస్ వాహనాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. జిల్లాలో మునగపాక, రాంబిల్లికి వాహనాల్లేవు. వీటికోసం కలెక్టర్ ప్రతిపాదనలు పంపించాం. అనమతులు రాగానే ఇక్కడ నుంచి 108 వాహనాలు తిరుగుతాయి.వి.త్రినాథ్, జిల్లా మేనేజరు

# వీరు ఏకగ్రీవమై.. వారు మరిచారు ఏకమై



తాడేపల్లిగూడెం : పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం మరో మూడు నెలల్లో ముగియనుంది. ఏకగ్రీవ పంచాయతీలకు మాత్రం నేటికీ ప్రోత్సాహక నిధులు మంజూరు కాలేదు. పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటే గ్రామాల్ని అభివృద్ధి చేసుకోవచ్చని పలుచోట్ల రాజకీయాలకతీతంగా నాయకులంతా ఏకతాటిపైకి వచ్చారు. కానీ, గత వైకాపా ప్రభుత్వం పైసా విదల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలైనా ప్రోత్సాహక నిధులు ఊసెత్తలేదు. ఫలితంగా ఏకగ్రీవ పంచాయతీలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది.

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉంగుటూరు మండలం కాగుపాడు పంచాయతీ ఏకగ్రీవమైంది. ఈ పంచాయతీకి ఏకగ్రీవ నిధులు రూ.5 లక్షలు విడుదల కావాల్సి ఉండగా.. గత వైకాపా ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వలేదు. ఈ నిధులు విడుదలైతే గ్రామస్థులు పుంత దారిని అభివృద్ధి చేయించుకోవాలని భావించారు. కానీ, వారి ఆశలు అడియాసలయ్యాయి.

ఎదురుచూపులే మిగిలాయి..కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేస్తోంది. దీంతో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకాలు విడుదల చేస్తుందని ఆయా గ్రామాల సర్పంచులు ఆశలు పెట్టుకున్నారు. మరోసారి ఎదురుచూపులే మిగిలాయి. ఏప్రిల్ మొదటి వారంలో పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. అప్పటికైనా ప్రోత్సాహక నిధులు విడుదల చేస్తారో లేదోనని ఏకగ్రీవ పంచాయతీల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 99..**

ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 892 పంచాయతీలు, 9,660 వార్డు స్థానాలకు నాలుగు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. ఏకగ్రీవమైతే జనాభా ఆధారంగా ప్రోత్సాహకం అందిస్తామని అప్పటి వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. 99 పంచాయతీల్లో ప్రజలు ప్రథమ పౌరుడిని ఏకగ్రీవం చేసుకున్నారు. వీటికి ప్రభుత్వం సుమారు రూ.6 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసిన వైకాపా ప్రభుత్వం.. చివరికి రిక్తహస్తం అందించింది.

# ఇక్కడ జీవితాలనే మలుపు తిప్పేస్తోంది



భీమవరం : ఇక్కడికొచ్చేటప్పటికి అందరికీ హడలే. కొత్త వారైతే ప్రమాదం బారిన పడటమే. అదే జిల్లా కేంద్రం భీమవరం నుంచి కృష్ణా జిల్లాకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టు.

గొల్లవానితిప్ప రోడ్డు నుంచి 216 నంబరు జాతీయ రహదారిపై మచిలీపట్నం మీదుగా విజయవాడ వెళ్లే మార్గం కావడంతో నిత్యం వాహన రద్దీ ఉంటోంది. దాంతో నెలలో తక్కువంటే రెండు ప్రమాదాలు జరుగుతున్నాయి.ప్రాధాన్యం ఇదీ.. కార్లు, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు రోజుకు రెండు వేలకు పైగా తిరుగుతాయి. ఆక్వా ఉత్పత్తులను తరలించే కంటైనర్లకు ఇదే ప్రధాన మార్గం. ఇతర జిల్లాల నుంచి తాడేపల్లిగూడెం ప్రధాన మార్కెట్‌కు సరకులు ఇటు నుంచే తీసుకెళ్తారు. సమస్య ఏమిటంటే.. రహదారి పొడవునా లోసరి-గూట్లపాడు పంట కాలువ ఉంది. దీనికి భీమవరం రామలక్ష్మణ్‌నగర్ దగ్గర కల్వర్టును దాదాపు 80 ఏళ్ల కిందట నిర్మించారు. అదీ కూడా అప్పట్లో రైతుల అవసరార్థం నిర్మించారు. అదే ఇప్పటికీ సేవలందిస్తోంది. **కారణాలు ఇవే..**

రహదారి విస్తరణకు తగ్గట్టుగా వంతెన లేదు.

ఇరుకుగా ఉండటంతో పాటు మలుపులో గుంతలు.

ఇక్కడ విద్యుత్తు స్తంభాలు ఉన్నా లైట్లు వెలగవు.

భీమవరం యనమదుర్రు గట్టు వైపున పొదలు కప్పేయడంతో కల్వర్టు కనిపించదు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం మరో కారణం.

అధికారులు ఏమన్నారంటే.. పొదల అడ్డంకులు లేకుండా చేస్తామని, స్తంభాలకు వీధిదీపాలు బిగిస్తామని పురపాలక కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. వంతెన నిర్మాణానికి సీఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యాయని ర.భ.శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. పనులు వెంటనే చేపడతామని వివరించారు.

గత అయిదేళ్లలోప్రమాదాలు 94

# జలవనరులో కబ్జా జలగలు!



ఒంగోలు : నాటి పెద్దలు ముందు చూపుతో మనకు అందించిన జలవనరును సంరక్షించేవారు లేకుండా పోయారు. ప్రజల అవసరాలకు తవ్విన జిల్లా కేంద్రం మార్కాపురంలోని చెరువు విషయంలో నిర్లక్ష్యం వహించడంతో ఆక్రమణలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. మరోవైపు చెరువులో నీటి నిల్వలు తగ్గిపోయి ఉపయోగం లేకుండాపోతోంది. మార్కాపురం ప్రాంతంలో 1,100పైగా ఎకరాలకు సాగునీరందించేం దుకు 584 ఎకరాల విస్తీర్ణంలో చెరువును తవ్వారు. ఇందులో 0.2 టీఎంసీల నీటిని నింపే అవకాశం ఉంది. చెరువుకు నీటిని తీసుకొచ్చే సప్లయి ఛానల్ ఆక్రమణలతో కుదించుకుపోవడంతో నానాటికి నీటి లభ్యత తగ్గి పోతోంది. ప్రధానంగా మాల్యవంతెనపాడు నుంచి గుండ్లకమ్మ నీరు చెరువులోకి రావాల్సి ఉండగా 8 మీటర్ల మేర ఉండాల్సిన కాలువ చిన్నదిగా మారి నీరు పారక చెరువు నిండడంలేదు. ఈ ఏడాది మొంథ తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు అలుగు పారుతుంది. లేకపోతే భారీ చెరువు ఏటా కుంటను తలపిస్తుంటుంది. చెరువు చుట్టుపక్కల స్థిరాస్తి వ్యాపారుల వెంచర్లు భారీగా పెరిగిపోవడం, ప్రధానంగా చెరువు అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో అక్రమణలు అంతకంతకూ పెరిగిపోయి చెరువు కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి నెలకొంది. నాటి పాలకులు దూరదృష్టితో ప్రజలకు మేలు చేయాలని ఆలోచిస్తే నేటి పెద్దలు మాత్రం చెరువును నీటితో నింపితే వెంచర్లు మునిగిపోతాయని నీటిని నింపే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం.

**నిధులొచ్చినా.. పట్టించుకోలేదు**

చెరువు కట్టను ట్యాంకు బండ్ మాదిరి అభివృద్ధి చేస్తామని నాయకులు గొప్పగా చెబుతున్నారు. ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడడం లేదు. నాటి ప్రభుత్వ హయాంలో చెరువు కట్ట రెండు కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.10 కోట్ల మేర నిధులు కేటాయించారు. నాటి పెద్దలు శ్రద్ధ చూపకపోవడంతో పనులు మొదలుకాలేదు. తాజాగా తిరిగి ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. వీటిని ఎంత వరకు ముందుకు తీసుకెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కేవలం సాగునీటి అవసరాలకే చెరువు నీటిని వినియోగిస్తున్నారు. అదే చెరువును శుభ్రపరిస్తే మార్కా పురం పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చవచ్చు. చెరువు నీటిని రక్షత తాగునీటి పథకం ద్వారా క్లోరినేషన్ చేసి ప్రజలకు అందించవచ్చు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాల్సి ఉంది.

# అనధికార లోడు... ఆదాయం బోలెడు

విద్యుత్తుశాఖ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటనకు చక్కటి స్పందన లభించింది. గతేడాది మార్చి 1వ తేదీ నుంచి డిసెంబరు నెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం ఇంట్లో పెరిగిన ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకానికి అనుగుణంగా అదనపు లోడు చెల్లించారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని 50,909 విద్యుత్తు సర్వీసులకు సంబంధించి క్రమబద్ధీకరణ దరఖాస్తు నిమిత్తం 84,977 కిలోవాట్ల అదనపు లోడుకు రూ.10,45,91,460 మేర నగదు జమ చేశారు. ఇంట్లోని విద్యుత్తు పరికరాల వినియోగం ఆధారంగా లోడు అంచనా వేశారు. ఒక్కో కిలో వాట్‌కు రూ.1,250 చొప్పున ఎంత అదనపు లోడు ఉన్నా క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇచ్చారు. దీంతో ఎక్కువ మంది వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు.

**పెరిగిన విద్యుత్తు వినియోగం**

కొత్తగా విద్యుత్తు కనెక్షన్ మంజూరు నిమిత్తం గ్రామాల్లో ప్రస్తుతం కనీసం కిలో వాట్, పట్టణాల్లో రెండు కిలోవాట్ చొప్పున దరఖాస్తు చేయిస్తున్నారు. పదేళ్ల కిందట గృహాల్లో ఉండే ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం ఆధారంగా 0.5 కిలోవాట్ లోడ్‌కు మాత్రమే రుసుం చెల్లించేవారు. కాలక్రమేణా రైస్ కుక్కర్ నుంచి వాషింగ్ మిషన్, ఏసీ, రిఫ్రిజిరేటర్..ఇలా ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరిగింది. ప్రత్యేకించి వేసవి కాలంలో ఎండ తీవ్రత దృష్ట్యా రేకుల ఇంట్లో నివాసిస్తున్న వారు కూడా ఏసీ వినియోగిస్తుండడంతో లో ఓల్టేజీ సమస్య పెరిగింది. దానికి అనుగుణంగా అవసరమైన చోట పరివర్తకాలు ఏర్పాటు చేయడంలో అధికారులు జాప్యం చేశారు. జిల్లావ్యాప్తంగా విద్యుత్తు అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహించి అదనపు లోడు రుసుం విధిస్తున్నారు. మా ఇంట్లో అన్ని వస్తువులు లేవు...రుసుం తగ్గించాలంటూ..పునఃపరిశీలనకు కొందరు అర్జీ పెట్టడం...మరికొందరు రుసుం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో అదనపు లోడు నియంత్రికలు ఏర్పాటుకు నిధుల సమస్య వెంటాడుతోంది. తాజాగా ఖజానాకు నిధులు సమకూరడంతో నాణ్యమైన విద్యుత్తును అందించే దిశగా అవసరమైన చోట పరివర్తకాలు ఏర్పాటు చేయనున్నారు.

# దిగొచ్చిన గుడ్డు ధర

ఎలమంచిలి : జిల్లాలో కోడిగుడ్ల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గతనెలలో రికార్డు స్థాయిలో ధర పలికిన గుడ్డు మళ్లీ అదే స్థాయిలో తగ్గింది. వంద గుడ్ల ధర రూ. 775 నుంచి రూ.575కి దిగివచ్చింది. రిటైల్‌గా ఒక్కొక్కటి రూ. 2 వరకు తగ్గడంతో రైతులకు మళ్లీ నష్టాలు ప్రారంభం అయ్యాయి. మన రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి పెరగడం, చలికాలంలో గుడ్డు వినియోగం ఎక్కువగా ఉండటంలో డిసెంబరు 22 నాటికి ధర రికార్డు స్థాయికి చేరుకుంది. నెలాఖరు వరకూ అదే ధర కొనసాగింది. జనవరి నుంచి మళ్లీ తగ్గుముఖం పట్టింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి కోల్‌కతా, అసోం, బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ ప్రాంతాలకు గుడ్లు ఎక్కువగా ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం అక్కడా ఉత్పత్తి పెరగడంతో ధర తగ్గిందని పెంపకందారులు చెబుతున్నారు

**ఆనందం లేకుండా పోయింది**

గుడ్డు ధర పెరిగింది మంచి లాభాలు వస్తున్నాయన్న ఆనందం లేకుండా పోయింది. ఒక్క నెల మాత్రమే ధర బాగుంది. ఇదే ధర మరో రెండు



నెలలు ఉంటే బాగుండేది. లాభాల బాట పడుతున్న రైతులు ఒక్కసారిగా మళ్లీ నష్టాల్లోకి పోయారు. చలికి పెద్దవి, పిల్లకోళ్లు చనిపోవడంతో ఆర్థికంగా నష్టపోయాం. ఎగుమతులు తగ్గడంతో ధర తగ్గిపోయింది. పాపారెడ్డి, పౌల్ట్రీ రైతు ఎలమంచిలి

ఉమ్మడి విశాఖ జిల్లాలో గుడ్లు పెట్టే కోళ్లు : 21 లక్షలు

రోజుకు ఉత్పత్తి : 20 లక్షలు

ఒక్కో కోడికి సగటున అవుతున్న ఖర్చు : రూ. 370

ఏడాదిలో కోడిపెట్టే గుడ్ల సంఖ్య : 340

గుడ్డుకు రైతు సగటున పెడుతున్న ఖర్చు : రూ.5.10

రైతుకు లభిస్తున్న ధర : రూ. 5.75

చిల్లరన మార్కెట్‌లో ధర : రూ. 7

# కంది రైతు కంట కన్నీళ్లు

కర్నూలు : మద్దతు ధరతో కందులు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఊరించింది. చాలా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఉన్న ప్రాంతాల్లో అంతంతమాత్రమే కొనుగోళు సాగుతుండటంతో రైతులు మార్కెట్‌కు సరకును తరలిస్తున్నారు. ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. తమ సమస్యను అధికారులకు విన్నవిస్తే గిట్టుబాటు కాకుంటే వెనక్కు తీసుకెళ్లండని సలహా ఇచ్చారు. సరకును ఇంటికి తీసుకెళ్లలేక.. తక్కువ ధరకు అమ్ముకోలేక అన్నదాతలు నరకయాతన అనుభవిస్తున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం కందుల దిగుబడులు పోటెత్తాయి. కర్నూలు జిల్లాతోపాటు అనంతపురం జిల్లా నుంచి రైతులు సరకు తీసుకొచ్చారు. వరుసగా మూడు, నాలులు రోజులు వస్తుండటంతో రైతులు సరకును భారీగా తీసుకొచ్చారు.

4,254 క్వింటాళ్ల దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.2,000, మధ్యస్థ ధర రూ.6,789, గరిష్ఠ ధర రూ.7,300 పలికింది. మార్కెట్కు పెద్ద ఎత్తున దిగుబడులు రావడంతో వ్యాపారులు సిండికేటయ్యారు. క్వింటాపై రూ.300 నుంచి రూ.500 వరకు ధర తగ్గించి కొనుగోలు చేశారు. మధ్యస్థ ధర పేరుతో ఎక్కువగా క్వింటా రూ.3 వేలకు కొనుగోలు చేస్తున్నారు.వ్యాపారుల తీరును నిరసిస్తూ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేశారు. ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పరిశీలన చేయలేదు. వ్యాపారులకే మద్దతు పలికారు. నాణ్యత ప్రమాణాలు లేవని.. సరకు పచ్చిగా ఉందంటూ క్వింటా రూ.3,000, రూ.3,500కు కొనుగోలు చేయడం దారుణమని రైతులు మండిపడ్డారు."మీకు నచ్చితే విక్రయించండి.. లేకుంటే వెనక్కు తీసుకెళ్లండి" అని మార్కెట్ కమిటీ అధికారులు తెగేసి చెప్పడంతో అన్నదాతలు బిత్తరపోయారు. అధికారులు వ్యాపారుల వైపు మాట్లాడటంతో అన్నదాతలు తీవ్రంగా మండిపడ్డారు.

**కొర్రీలు పెట్టి ధరలో కోత**

ప్రభుత్వ మద్దతు ధర రూ.8 వేలు ఉండగా.. మార్కెట్‌లో క్వింటా రూ.6,400కు కొనుగోలు చేయడం దారుణమని డోన్ మండలం కొత్తకోట గ్రామ రైతు డి.శాంతరాజు పేర్కొన్నారు. తమ పంటను క్వింటా రూ.6,300కు అడిగారని శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సరకు నాసిరకంగా ఉందంటూ క్వింటా రూ.3,200కు కొనుగోలు చేస్తున్నారని సురేష్ వాపోయారు.

# కందుల కొనుగోలుకు కసరత్తు!

ఒంగోలు : కంది పంట ఈనెలాఖరు నుంచి రైతుల చేతికందనుంది. దిగుబడులొచ్చిన వెంటనే దళారుల మాయజాలంతో ధరలు అమాంతం పతనమవుతున్నాయి. రైతులకు కష్టాలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే రైతుల నమోదు ప్రక్రియ ప్రారంభించింది.వర్షాధారంగా పంటలు పండే జిల్లాలో కందులు అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. గతేడాది ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7,650 ఉండగా, బయట మార్కెట్‌లో మాత్రం వ్యాపారులు రూ.6,600 చొప్పున కొనుగోలు చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా గతేడాది 26 వేల మెట్రిక్ టన్నుల కందులను రైతుల నుంచి సేకరించింది. ఈ ఏడాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ, సహకారసంఘాల అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 13న మరోసారి సమావేశం నిర్వహించి ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. కందుల సేకరణ విషయమై రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ వివరాలు నమోదు చేయిస్తున్నారు. ఇప్పటివరకు 600 మంది వరకు రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది తొలి విడతలో 12 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతులు వచ్చాయి.

రూ.8 వేలు మద్దతు ధర జిల్లాలోని సహకార సంఘాల్లో 40 నుంచి 45 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఒక్కో రైతు నుంచి రోజుకు 40 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయనున్నారు. తేమ శాతం 12 శాతం ఉంటే ప్రభుత్వం పెంచిన మద్దతు ధర ప్రకారం క్వింటాకు రూ.8,000 ఇవ్వనున్నారు. ఈ మేరకు సొసైటీల్లో తేమ శాతం తూచే యంత్రాలు, జల్లెడలు, బయోమెట్రిక్ పరికరాలు సిద్ధం చేస్తున్నారు. రైతుల ఖాతాలోనే నేరుగా నగదు జమ చేయనున్నారు. సీఎం యాప్‌లో నమోదు ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేయించుకున్న కంది రైతులు తన పంటను విక్రయించుకునేందుకు ముఖ్యమంత్రి యాప్‌లో వివరాలు పేర్కొనాలి.

చురకలు



## మినీ డ్రెస్ లో చెమటలు పట్టిస్తున్న షనయా కపూర్..

బాలీవుడ్ స్టార్ కిడ్ షనయా కపూర్ ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వకముందే సోషల్ మీడియా సెన్సేషన్‌గా మారిపోయింది. సంజయ్ కపూర్ తనయగా కంటే, తనకంటూ ఒక ప్రత్యేక ఫ్యాషన్ స్టైల్‌ను క్రియేట్ చేసుకున్న ఈ బ్యూటీ, తాజాగా గ్రీన్ మినీ డ్రెస్‌లో మెరిసి నెటిజన్ల కళ్లు తిప్పుకోకుండా చేస్తోంది. గ్లామర్, కాన్ఫిడెన్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన షనయా, తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో ఇంటర్నెట్‌లో హీట్ పెంచుతోంది. ఆమె సినీ ప్రయాణం , తాజా గ్లామర్ పిక్స్ విశేషాలు మీకోసం. గ్రీన్ మినీ డ్రెస్‌లో షనయా గ్లామర్ విందు: షనయా కపూర్ తాజాగా పంచుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్రీన్ కలర్ మినీ డ్రెస్‌లో ఆమె చూపిస్తున్న గ్లామర్ మ్యాజిక్ నెటిజన్లకు 'చెమటలు పట్టిస్తోంది' అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. మోడ్రన్ అండ్ పాప్ గ్లామ్ లుక్‌లో ఆమె ఫిజిక్, స్టైలింగ్ అదిరిపోయాయని ఫ్యాషన్ ప్రియులు కామెంట్స్



చేస్తున్నారు. సోనమ్ కపూర్, జాన్వీ కపూర్ వంటి స్టార్ సోదరీమణుల బాటలోనే షనయా కూడా తన స్టైల్ స్టేట్‌మెంట్‌తో యూత్ ఐకాన్‌గా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియా వేదికగా ట్రెండింగ్‌లో ఉన్నాయి. అభిమానులు ఈ భామ పిక్స్ ను షేర్ చేస్తూ తమ అభిమానాన్ని చాటుతున్నారు. సినీ ఎంట్రీ: షనయా కపూర్ తన కెరీర్‌ను జాన్వీ కపూర్ నటించిన 'గుంజన్ సక్సేనా' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రారంభించి, సినిమా మేకింగ్‌పై పట్టు సాధించింది. ఆ తర్వాత భారీ అంచనాల మధ్య మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటించిన పీరియడ్ ఫాంటసీ డ్రామా "వృషభ" ద్వారా వెండితెరకు పరిచయమైంది. డిసెంబర్ 2025లో విడుదలైన ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో, గత జన్మల నేపథ్యంలో రూపొందినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. మిశ్రమ సమీక్షలు మరియు ప్రతికూల వసూళ్లతో ఈ సినిమా షనయా ఎంట్రీకి గట్టి పునాది వేయలేకపోయింది. భవిష్యత్తు ప్రణాళికలు: ఇక షనయా కపూర్, విక్రాంత్ మాస్సే కలిసి నటించిన మూవీ ఆంఖోన్ కి గుస్తాఖియాన్ మూవీ 2025 లో రిలీజ్ అయ్యి బాక్సాఫీస్ సక్సెస్ ను అందుకుంది. ఇక అప్‌కమింగ్ హీరోయిన్లలో అత్యధిక ఫాలోయింగ్ ఉన్న భామగా ఆమె పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం ముంబై, యూరప్ వంటి ప్రాంతాల్లో షూటింగ్స్ ముగించుకుని మరికొన్ని బాలీవుడ్ ప్రాజెక్టులపై దృష్టి సారించింది. కమర్షియల్ సక్సెస్ లభించినా లభించకపోయినా, తన గ్లామర్ , నటనతో ఇండస్ట్రీలో నిలదొక్కుకునేందుకు షనయా సిద్ధమవుతోంది. మరి రాబోయే చిత్రాలతో ఈ బ్యూటీ ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి..

## కంగారూ బీచ్‌లో కంగారు పుట్టిస్తున్న శర్మా గాళ్

శర్మా సిస్టర్స్ నేహా శర్మ- ఐషా శర్మ పరిచయం అవసరం లేదు. నేహాశర్మ చిరుత చిత్రంతో టాలీవుడ్ లో కథానాయికగా పరిచయమైంది. ఆ తర్వాత హిందీ చిత్రసీమకు వెళ్లిపోయిన ఈ బ్యూటీ, కొన్నాళ్లకు తన సోదరి ఐషా శర్మను కూడా సినీరంగానికి పరిచయం చేసింది. అయితే ఈ సిస్టర్స్ కెరీర్ అంతంత మాత్రమే. ఇప్పుడున్న రఫ్ కాంపిటీషన్ లో శర్మా గాళ్స్ కెరీర్ రన్ ఆశించినంతగా లేదు. అయితే సోషల్ మీడియాల్లో తమకు ఉన్న ఫాలోయింగ్ దృష్ట్యా పలు ప్రకటనల్లో నటించి రాణిస్తున్నారు. అయితే అక్కా చెల్లెళ్లలో నేహా శర్మ ఇటీవల వెల్ కం 3 లాంటి భారీ చిత్రంలో అవకాశం అందుకుంది. పలువురు యువహీరోల సరసన నటిస్తున్న ఈ బ్యూటీ ఇటీవల వెబ్ సిరీస్ లతోను మంచి పేరు తెచ్చుకుంటోంది. ఇక ఇటీవల శర్మా సిస్టర్స్ ఆస్ట్రేలియా పర్యటనలో ఫుల్ జాలీగా టైమ్ స్పెండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మెల్‌బోర్న్ వీధుల్లో సువిశాలమైన ఆసీస్ బీచ్‌ల్లో తెగ హంగామా చేస్తున్నారు. దీనికి సంబంధించిన తాజా ఫోటోలు వెబ్ లోకి వచ్చాయి. నేహా శర్మ లేటెస్టుగా తన ఫోటోలను



ఇన్ స్టాలో షేర్ చేయగా అవి సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ముఖ్యంగా మెల్‌బోర్న్ తీరంలో శర్మా గాళ్ దిగిన బికినీ ఫోటోలు నెటిజనుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

నేహా గ్లామర్ , ఫిట్ లుక్ కి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. ప్రస్తుతం శర్మా సిస్టర్స్ ఆసీస్ లోని అన్ని బీచ్ లను చుట్టేస్తున్నారు. -మెల్‌బోర్న్ డైరీస్- పేరుతో వారు షేర్ చేస్తున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఓవైపు బికినీలు మరోవైపు సమ్మర్ లూజ్ స్టైల్ దుస్తులతోను శర్మా సిస్టర్స్ ఆసీస్ వీధుల్లో రచ్చ లేపుతున్నారు. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. నేహ శర్మ బికినీ లుక్ ఇంటర్నెట్లో గుబులు రేపుతోంది. తెలుగులో రామ్ చరణ్ సరసన చిరుత సినిమాతో ఎంట్రీ ఇచ్చిన నేహా శర్మ ఆ తర్వాత బాలీవుడ్ కి వెళ్లింది. ప్రస్తుతం ఆమె కొన్ని వెబ్ సిరీస్‌లతో పాటు మలయాళంలో దుల్కర్ సల్మాన్ వంటి స్టార్ల సరసన నటిస్తోంది.




## బ్లాక్ డ్రెస్ లో అందాల జాతర.. మాళవిక సోయగాలు అదరహో!



ఈమధ్య కాలంలో వెరైటీ ఇండియా రూపొందిస్తున్న ఫ్యాషన్ దుస్తులతో హీరోయిన్స్ తమ అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంటున్నారు. ముఖ్యంగా తమ అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా వెరైటీ డ్రెస్ లతో ఫ్యాషన్ ప్రియులకు మరింత స్పెషల్ అట్రాక్షన్ గా కనిపిస్తున్నారు. ఇందులో బాగానే మలయాళీ ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ కూడా తాజాగా వెరైటీ ఇండియా డిజైన్ చేసిన బ్లాక్ అవుట్ ఫిట్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇటీవలే రకుల్ ప్రీత్ సింగ్ వెరైటీ డ్రెస్ తో మెస్మరైజ్ చేయగా.. ఇప్పుడు మాళవిక కూడా అలాంటి తరహా డ్రెస్ లోనే ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. టాప్ ట్రెండీ ఔట్ ఫిట్ ధరిస్తూనే.. బాటమ్ చీరకట్టులో కనిపిస్తూ సరికొత్తగా కనిపించింది. ముఖ్యంగా ఫ్యాషన్ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటుంది ఈ ఔట్ ఫిట్. ఇక చేతులకు గోల్డెన్ కడ ధరించి తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. ప్రస్తుతం ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మలయాళ బ్యూటీగా పేరు తెచ్చుకున్న ఈమె తొలిసారి తెలుగులో ప్రభాస్ హీరోగా.. మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ది రాజా సాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాలో మాళవికతో పాటు రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కూడా హీరోయిన్లుగా నటించారు. ఇకపోతే భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమా మాత్రం ఏడాది సంక్రాంతి బరిలో నిలిచి డిజాస్టర్ గా నిలిచింది. అయినా సరే మాళవిక మోహనన్ కి మాత్రం మంచి గుర్తింపు లభించిందని చెప్పవచ్చు. ఇకపోతే ఈమె ఎవరో కాదు ప్రముఖ మలయాళ సినిమాటోగ్రాఫర్ కేయు మోహనన్ కుమార్.. 2013లో వచ్చిన మలయాళ చిత్రం పట్టంపోల్ సినిమా ద్వారా నటన రంగ ప్రవేశం చేసింది. ఇక తర్వాత ది గ్రేట్ ఫాదర్ , పెట్ట , మాస్టర్ , హృదయపూర్వం వంటి సినిమాలలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈమె 1993 ఆగస్టు 4న కేరళలోని కన్నూరు జిల్లాలోని పయ్యనూరు పట్టణంలో జన్మించింది. కానీ ముంబైలో పెరిగింది. ప్రస్తుతం కార్తీ హీరోగా నటించిన సర్దార్ సినిమా సీక్వెల్ సర్దార్ 2లో నటిస్తోంది. తమిళ భాష పై యాక్షన్ థ్రిల్లర్ మూవీకి పిఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. రత్నకుమార్ , ఆశామీరా అయ్యప్పన్ , విగ్నేష్ మునియాండి రచన , నంబి స్క్రీన్ ప్లే అందించారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవి ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై ఈ చిత్రం రూపుదిద్దుకుంటుంది. ఇందులో కార్తీక్, రజీషా విజయన్ తో పాటు మాళవిక మోహనన్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరితోపాటు ఆషికా రంగనాథ్, ఎస్ జె సూర్యా కూడా ఈ సర్దార్ 2 లో భాగం కానున్నారు. 2024 జూలైలోనే షూటింగ్ ప్రారంభమైన ఈ సినిమా ఈ ఏడాది జూన్లో విడుదల కానున్నట్లు సమాచారం.

## ఓవైపు ఏర్పాట్లు.. మరోవైపు సీక్రెసీ.. ఎందుకలా...



టాలీవుడ్ లో మరోసారి హాట్ టాపిక్ గా మారింది విజయ్ దేవరకొండ -- రష్మిక మందన్న పెళ్లి వార్త. గత కొద్దికాలంగా వీరిద్దరి రిలేషన్ పై సోషల్ మీడియాలో వినిపిస్తున్న ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఫిబ్రవరి 26న రాజస్థాన్ లోని ఉదయ్ పుర్ లో వారిద్దరూ వివాహ వేడుక జరగనుందంటూ నేషనల్ మీడియాలో కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. అదే సమయంలో అక్కడి ఓ హెరిటేజ్ ప్యాలెస్ లో విజయ్ం, రష్మిక పెళ్లికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయంటూ వైరల్ అవుతున్న వీడియోలు వైరల్ గా మారాయి. అయితే ఆ జంట తమ పెళ్లిని అత్యంత గోప్యంగా, కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య మాత్రమే నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే ఆ ప్రముఖ ప్యాలెస్ ను బుక్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నిశ్చితార్థంలాగే పెళ్లి వేడుక కూడా సైలెంట్ గా జరపాలన్నది వీరి ప్లాన్ అని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే పెళ్లి అనంతరం హైదరాబాద్ లో సినీ పరిశ్రమ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని సమాచారం. ఇదిలా ఉంటే, గతేడాది అక్టోబర్ 3న హైదరాబాద్ లోని విజయ్ నివాసంలోనే వీరి నిశ్చితార్థం జరిగిపోయిందన్న వార్తలు కూడా అప్పట్లో వినిపించాయి. కానీ ఆ విషయాన్ని విజయ్ గానీ, రష్మిక గానీ అధికారికంగా ధ్రువీకరించలేదు. ఇప్పటికీ పెళ్లి వార్తలపై ఇద్దరూ మౌనం పాటించడం గమనార్హం. ఇటీవల ఎయిర్ పోర్టు లో ఆ విషయంపై ప్రశ్నించగా రష్మిక నవ్వుతూ స్పందించకుండా వెళ్లిపోవడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. గత 24 గంటలుగా సోషల్ మీడియాలో ఓ యువతి షేర్ చేసిన వీడియో వైరల్ అయింది. ఉదయ్ పుర్ ప్యాలెస్ లో డెకరేషన్ పనులు జరుగుతున్న విజువల్స్ తో పాటు విజయ్- రష్మిక పెళ్లి ఏర్పాట్లు అంటూ ఆమె పేర్కొనడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అయితే ఆ వీడియోపై క్లారిటీ లేకపోవడంతో సినీ వర్గాలు అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆ వీడియోను ఫేక్ గా చూడాలని సూచిస్తున్నాయి. ఏదేమైనా విజయ్, రష్మిక మధ్య స్నేహం ఎప్పటినుంచో చర్చనీయాంశమే. పబ్లిక్ ఈవెంట్స్ లో కలిసి కనిపించడం, ఒకే తరహా లొకేషన్లలో ఫోటోలు షేర్ చేయడం, కలిసి వెకేషన్లకు వెళ్లడం వంటి అంశాలు ప్రేమ ఉందనే ప్రచారానికి బలం చేకూర్చాయి. ఇటీవలే ఇటలీలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ముగించుకుని కలిసి హైదరాబాద్ కు రావడం కూడా ఆ ఊహాగానాలను మరింత బలపరిచింది. మొత్తానికి, ఓవైపు పెళ్లి ఏర్పాట్లపై వార్తలు.. మరోవైపు పూర్తి సీక్రెసీ.. దీంతో ఎ×=ూాఎ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. అధికారిక ప్రకటన కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి విజయ్, రష్మిక ఎప్పుడు రివీల్ చేస్తారో వేచి చూడాలి.

## రాశీ ఖన్నా: కొంచెం రాజరికం.. కొంచెం నిశ్శబ్దం

ప్రస్తుతం ఉత్తరాది దక్షిణాది సినిమాలను బ్యాలెన్స్ చేస్తూ, తెలివిగా ఆటాడుతోంది అందాల రాశీ ఖన్నా. ఈ దిల్లీ బ్యూటీ ఓవైపు ముంబైని మ్యానేజ్ చేస్తూనే, హైదరాబాద్ ని తన సొంత ఇల్లుగా మార్చుకుంది. మరోవైపు చెన్నై పరిశ్రమలోను రాశీ పేరు మార్మోగుతోంది. ఏక కాలంలో తెలుగు, తమిళం, హిందీ చిత్రాలలో నటిస్తున్న ఈ బ్యూటీ కెరీర్ పరంగా వెనుదిరిగి చూసుకోనంత బిజీగా ఉంది. ఇప్పటికిప్పుడు అరడజను ప్రాజెక్టులతో రాశీ బిజీ బిజీగా ఉంది. ఇటీవల అనీష్ బజ్మీ లాంటి టాప్ డైరెక్టర్ సినిమాకి సంతకం చేసిందని కథనాలొచ్చాయి. రాశీ ఖన్నా నటిస్తున్న వరుస చిత్రాల వివరాల్లోకి వెళితే.. మొదటిసారి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన ఈ బ్యూటీ అవకాశం అందుకుంది. పవర్‌స్టార్ సరసన హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న -ఉస్తాద్ భగత్ సింగ్- చిత్రంలో శ్లోక అనే ఔత్సాహిక ఫోటోగ్రాఫర్ గా కనిపించనుంది. ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. షూటింగ్ దాదాపు పూర్తయింది. ఇది ఏప్రిల్ 2026లో విడుదలయ్యే అవకాశం ఉంది. మరోవైపు -తలాఖోన్ మే ఏక్- అనే చిత్రంలో నటిస్తోంది. విక్రాంత్ మాస్సేతో రాశీకి ఇది రెండో చిత్రం. ఇది ఒక గ్రిప్పింగ్ డ్రామాగా రూపొందుతోంది. ఆర్. మాధవన్,



సోహా అలీ ఖాన్‌లతో కలిసి రాశీ నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ -బ్రిడ్జ్- యూకే నేపథ్యంలో రక్తి కట్టించనుంది. ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. అక్షయ్ కుమార్, విద్యాబాలన్‌లతో కలిసి అనీస్ బజ్మీ రూపొందించనున్న కామెడీ ఎంటర్‌టైనర్‌లోను రాశీ నటించనుంది. షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. రాజ్ అండ్ డీకే -ఫర్జీ 2- వెబ్ సిరీస్ లోను రాశీ నటించనుంది. మొదటి భాగంలో నటించిన షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి తదితరులు ఇందులో నటిస్తున్నారు. అలాగే -రౌడీ అండ్ కో- అనే తమిళ చిత్రంలోను రాశీ నటించనుంది. ూశ్రీంశీ =ఝ౦ - నాని 'డబుల్' దూకుడు.. జోష్ కొనసాగించడం పక్కానా? కెరీర్ పరంగా వరుస చిత్రాలతో బిజీగా ఉన్న రాశీ తన అభిమానుల కోసం సోషల్ మీడియాల్లో నిరంతరం టచ్ లో ఉంది. రాశీ ఖన్నా ఫ్యాషన్ ప్రపంచంలోను రాణిగా మెరిసిపోతోంది. కేవలం నటనతోనే కాదు తన అద్భుతమైన స్టైల్ కంటెంట్‌తోను మతులు చెడగొడుతోంది. ఫ్యాషన్ ఐకాన్‌గా సాటి యువనాయికలకు గట్టి పోటీనిస్తోంది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఏ లిటిల్ రాయల్, ఏ లిటిల్ క్వైట్..( రాశీ ఖన్నా: కొంచెం రాజరికం.. కొంచెం నిశ్శబ్దం) అనే క్యాప్షన్‌తో రాశీ షేర్ చేసిన ఫోటోలు అభిమానులను కట్టిపడేస్తున్నాయి.ూశ్రీంశీ =ఝ౦ - ఇక్కడ 'జన నాయగన్'...అక్కడ 'ఓ రోమియో'! దీనికి -వి-వాని బై వాని వాట్స్- డిజైన్ చేసిన చీరలో దేవకన్యలా మెరిసిపోతోంది. ఈ అద్భుతమైన లుక్ వెనుక షారా అష్రఫ్ ప్రయాగ్ మిశ్రా స్టైలింగ్, సారంగ్ గుప్త ఫోటోగ్రఫీ కీలక పాత్ర పోషించారు. రాశీ ఖన్నా ఎంపిక చేసుకునే డిజైనర్ దుస్తులు ఎప్పుడూ ట్రెండీగా, క్లాసీగా మురిపిస్తున్నాయి. తనదైన యూనిక్ ఫ్యాషన్ సెన్స్ తో ఇప్పటికే యూత్‌లో భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. సంప్రదాయ చీరకట్టు అయినా, వెస్టర్న్ దుస్తులు అయినా రాశీ ఎంతో హుందాగా తనను తాను ఆవిష్కరించుకుంటుందని తాజా లుక్ చెబుతోంది.

## సండే లెజీ డే.. గ్లామర్ తో దివి ఫోజులు!

తెలుగు చిత్రసీమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి దివి వధ్యా. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చి, తన కృషి, పట్టుదలతో గ్లామర్ ప్రపంచంలో నిలదొక్కుకున్న ఈ తెలుగమ్మాయి, సహజసిద్ధమైన అందానికి నిలువుటద్దంలా కనిపిస్తుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, విభిన్నమైన షోలు , వెబ్ సిరీస్‌లతో తన నటనను నిరూపించుకుంటోంది. చూడ్డానికి చాలా సైలెంట్‌గా కనిపించినా, కెమెరా ముందుకు వస్తే తన ఎక్స్‌ప్రెషన్స్‌తో మ్యాజిక్ చేయడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. నేడు సోషల్ మీడియాలో అత్యధిక ఫాలోయింగ్ ఉన్న నటీమణులలో ఒకరిగా ఎదిగి, యువతకు ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తోంది.

**బిగ్ బాస్ ప్రయాణం మరియు సినీ కెరీర్:** మహర్షి నుండి బిగ్ స్టార్ వరకు దివి ప్రయాణం టాలీవుడ్‌లో చాలా ఆసక్తికరంగా సాగింది. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన 'మహర్షి' సినిమాలో ఒక చిన్న పాత్ర ద్వారా వెండితెరకు పరిచయమైన ఆమె, ఆ తర్వాత బిగ్ బాస్ సీజన్ 4లో కంటెస్టెంట్‌గా అడుగుపెట్టి రాత్రికి రాత్రే స్టార్‌డమ్



సంపాదించుకుంది. ఆ షోలో ఆమె చూపించిన పద్ధతి, నిజాయితీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. బిగ్ బాస్ తర్వాత దివి వెనక్కి తిరిగి చూసుకోలేదు. పలు వెబ్ సిరీస్‌లు, మ్యూజిక్ ఆల్బమ్స్ మరియు 'క్యాబ్ స్టోరీస్' వంటి చిత్రాలతో బిజీగా మారింది. సినీ పెద్దలు ఆమె నటనను మెచ్చుకోవడం ఆమె కెరీర్‌కు పెద్ద బూస్ట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఆమె మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

**స్టైలిష్ ఫోటో షూట్:** మోడ్రన్ మేకోవర్‌లో మంత్రముగ్ధులను చేస్తున్న దివి తాజాగా దివి షేర్ చేసిన ఈ ఇన్‌స్టాగ్రామ్ ఫోటోలు నెట్టింట సెగలు రేపుతున్నాయి. ఈ పిక్స్‌లో ఆమె ధరించిన అవుట్‌ఫిట్ ఆమె స్లిమ్ పర్సనాలిటీని మరింత ఆకర్షణీయంగా ఎలివేట్ చేస్తోంది. ముఖ్యంగా ఆ ఫోటోల్లోని వెలుతురు, ఆమె కళ్ళలోని తీక్షణత ఒక ప్రొఫెషనల్ మోడల్‌ను తలపిస్తున్నాయి. ట్రెండీ డ్రెస్సుల్లో కనిపిస్తూనే, తన సిగ్నేచర్ స్మైల్‌తో నెటిజన్లను కట్టిపడేస్తోంది. సంప్రదాయ చీరకట్టులో ఎంత ముద్దొస్తుందో, ఇలాంటి మోడ్రన్ వెస్ట్రన్ లుక్స్‌లో కూడా అంతే స్టైలిష్‌గా కనిపిస్తూ 'గ్లామర్ క్వీన్' అనిపించుకుంటోంది. ఈ ఫోటో షూట్ చూసిన నెటిజన్లు ఆమె ఫోటోలను విపరీతంగా షేర్ చేస్తూ ట్రెండింగ్‌లో నిలుపుతున్నారు. అందంతో పాటు అభినయం ఉన్న దివి, రాబోయే రోజుల్లో తెలుగు సినిమాలో అగ్ర కథానాయికగా ఎదగడం ఖాయంగా కనిపిస్తోంది. తన సహజత్వమే ఆమెకు అతిపెద్ద బలం. మరిన్ని మంచి అవకాశాలతో ఆమె తన నటనతో తెలుగు ప్రేక్షకులను అలరించాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536